


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 73 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 24 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 73 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 24 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## అమెరికా టారిఫ్‌లపై కనీసం నోరెత్తరు

### మోడీ సర్కార్‌పై రాహుల్ గాంధీ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** మోడీ సర్కార్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. మోడీ పరిపాలనలో భారత ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీగా మారిందని విమర్శించారు. అమెరికా సుంకాలు భారత వస్త్ర పరిశ్రమను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయని.. వస్త్ర ఎగుమతిదారులకు కేంద్రం ఆదుకోవడం లేదని మండిపడ్డారు. భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడుతున్న సుంకాల సమస్యను మోడీ సర్కార్ పరిష్కరించడం లేదని నిప్పులు చెరిగారు. హర్యానాలోని ఒక వస్త్ర కర్మాగారాన్ని శుక్రవారం (జనవరి 22) రాహుల్ గాంధీ సందర్శించారు.

- మిగతా 2లో

## ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం

- తన వల్లే ఇరాన్‌లో 800 మందికి పైగా ఉరిశిక్షలు ఆగిపోయాయన్న ట్రంప్
- తాము మరణ శిక్షల నిర్ణయమే తీసుకోలేదన్న మొవాహెది
- తప్పుదారి పట్టించే ప్రచారం చేయవద్దని మీడియాకు విన్నపం

- మిగతా 2లో



## కేసీఆర్ ఫ్యామిలీని టచ్ చేసే దమ్ము కాంగ్రెస్‌కు లేనేలేదు

- చేతులు ముడుచుకుని కూర్చున్న అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్
- ముడుపులు దండుకునేందుకు విచారణ పేరుతో సాగదీతలు
- ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి ఆధారాలన్నీ ఉన్నాయి
- పోలీసులే విచారణ సందర్భంగా నాకు ఆధారాలు, సాక్షాలు చూపారు
- అయినా కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?
- మంది కొంపలు ముంచిన కేటీఆర్ వ్యక్తిత్వ హననం గురించి మాట్లాడటమా?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ తోపాటు అనేక అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడినప్పటికీ కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేనేలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పౌరుషం లేదని, చేతులు ముడుచుకుని

- మిగతా 2లో

## ముగిసిన కేటీఆర్ విచారణ..

### రాధాకిషన్ రావుతో కలిపి.. 7 గంటల పాటు కేటీఆర్ విచారణ



- కేటీఆర్ వాంగ్మూలం రికార్డు చేసిన సిట్ అధికారులు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ3గా ఉన్న మాజీ డీసీపీతో కలిపి విచారణ
- సుదీర్ఘంగా కొనసాగిన విచారణ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొదటి రోజు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు సుమారు 7 గంటల పాటు ఆయనను విచారించి వాంగ్మూలం రికార్డు చేశారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఈ విచారణ కొనసాగింది. కేటీఆర్‌ను, ఈ కేసులో ఏ3గా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్ రావును కలిపి విచారించినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం కేటీఆర్ జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి తెలంగాణ భవన్ చేరుకున్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ 2024 మార్చిలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే తాజాగా కేటీఆర్‌ను సిట్ విచారించింది.

### అవసరమైతే మళ్లీ పిలుస్తం



- కేటీఆర్‌కు ఆ విషయాలు చెప్పాం: సిట్ అధికారులు
- సాక్షులను ప్రభావితం చేయవద్దని చెప్పామన్న సిట్
- మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని కూడా చెప్పామని వెల్లడి
- కేటీఆర్‌ను ఒంటరిగానే విచారించినట్లు స్పష్టీకరణ

### సిట్ విచారణలో ఏమి లేదు..

#### అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగిర్రు: కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు పూర్తిగా సహకరించానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ కేసులో బీఆర్ఎస్ పార్టీ నేతల వ్యక్తిత్వ హననానికి బాధ్యులెవరని వారిని అడిగానని.. అయితే.. లీకులతో మాకు సంబంధం

- మిగతా 2లో

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు హైదరాబాద్ పోలీసుల నోటీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆ పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు సిట్ విచారణను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ మరో కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ పోలీసులు

- మిగతా 2లో

## మంత్రి సీతక్క పర్యటనలో ఉద్రిక్తత



- అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట
- కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఆహ్వానించిన ఎమ్మెల్యే
- బీఆర్ఎస్ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నాయకుల అభ్యంతరం

- మిగతా 2లో




## ఇరాన్ పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు...

### భారీగా ఆయుధాలు తరలిస్తున్న అమెరికా!

- ఇరాన్ అణు కార్యక్రమం కొనసాగిస్తే మళ్లీ దాడులు తప్పవన్న ట్రంప్
- అమెరికా హెచ్చరికలతోనే ఇరాన్ ఉరిశిక్షలు నిలిపివేసిందన్న వాదన
- మధ్యప్రాచ్యానికి తరలివస్తున్న భారీ యుద్ధ విమాన వాహక నౌకలు
- ఇరాన్ అల్లర్లలో 20 వేల మందికి పైగా మరణించినట్లు అంచనా
- శాంతి స్థాపన కోసం 'బోర్డ్ ఆఫ్ పీస్' ఏర్పాటు చేసినట్లు ప్రకటన

- మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు పక్కా

- జూబ్లీహిల్స్ బై పోల్, సర్పంచ్ ఎన్నికలతో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్
- ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించండి
- టికెట్ దక్కని వారికి భవిష్యత్తులో అవకాశాలుంటాయని హామీ

- మిగతా 2లో



## కేటీఆర్ చాలా దుర్మార్గుడు..

### ఆయనకు క్యారెక్టర్ ఎక్కడుంది..?

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్ చాలా దుర్మార్గుడు అని.. ఆయనకు క్యారెక్టర్



- మిగతా 2లో

## కేరళలో మార్పు అనివార్యం..

### అక్కడ బీజేపీ విజయం ఒక నగరంతో ప్రారంభమైంది

- గుజరాత్‌లోనూ బీజేపీ విజయం ఒక నగరం నుంచే ప్రారంభమైందన్న మోదీ
- కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌ల అవినీతిని అంతం చేస్తామన్న ప్రధాని
- కేరళ ప్రజలు అభివృద్ధి, సుపరిపాలన ఇచ్చే బీజేపీ వైపు చూడాలని వ్యాఖ్య


- మిగతా 2లో



## మేడారం జాతరపై కేంద్రం ఫోకస్..

### రూ.3 కోట్ల 70 లక్షలు విడుదల

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ
- విడుదల చేసిన గిరిజన, పర్యాటక మంత్రిత్వ శాఖలు



**హైదరాబాద్ పెన్ పవర్:** గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ, గిరిజన మంత్రిత్వ శాఖలు రూ. 3 కోట్ల 70లక్షలు విడుదల చేశాయి.

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## ఇరవై ఏళ్ల పోరాటం.. ఇంకా దక్కని పెన్షన్ హక్కు!

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించట్లేదు' అన్న నానుడి నేటి 2003 డీఎస్సీ ద్వారా ఎంపికై, 2004 సెప్టెంబర్ తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల పరిస్థితికి అచ్చుగుద్దినట్లు సరిపోతుంది.నియామక ప్రక్రియ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఆలస్యమైందన్న ఒకే ఒక్క కారణంతో వేలాది మంది ఉద్యోగులను బలవంతంగా నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) పరిధిలోకి నెట్టివేయడం ఘోరమైన అన్యాయం. పెన్షన్ అనేది భిక్ష కాదు.. అది ఉద్యోగి హక్కు అని న్యాయస్థానాలు స్పష్టంగా చెప్పినా, ప్రభుత్వాలు నేటికీ ఆ వాస్తవాన్ని విస్మరించడమే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఉద్యోగ విర మణ అనంతరం తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందనుకున్న పెన్షన్ విధానాన్ని తొలగించడం దుర్మార్గమైన చర్యగా వారు పరిగణిస్తున్నారు. సుమారు ముప్పై సంవత్సరాలకు పైగా ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగికి పెన్షన్ అందించకపోవడం ఉద్యోగులను వంచించడమే అవుతుంది. 2004 కన్నా ముందు ప్రభుత్వాలు ఏ విధంగా ఉద్యోగులకు పెన్షన్ అందించాయి? అది ఇప్పుడు ఎందుకు సాధ్యపడడం లేదు? పీఎఫ్ఆర్డీఏ చట్టం ప్రకారం 2004 జనవరి 01 నుండి మన దేశంలో ప్రవేశ పెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలులో భాగంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ 01 నుండి సీపీఎస్ విధానం అమలు అవుతోంది. అయితే, సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే నోటిఫికేషన్లు విడుదలై నియామక ప్రక్రియ ఆలస్యం కావడం వలన సీపీఎస్ అమలు తేదీ తరువాత నియామకం జరిగిన ఉద్యోగులను బలవంతంగా నూతన పెన్షన్ పరిధిలోకి తీసుకురావడం జరిగింది. ఇలా తమకు జరిగిన అన్యాయం గురించి కేంద్రప్రభుత్వం దృష్టికి ఉద్యోగులు తీసుకువెళ్లిన నేపథ్యంలో వారికి న్యాయం చేకూరుస్తూ కేంద్రం 2004 జనవరి తరువాత జాయిన్ అయిన వారిని పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువస్తూ మెమో విడుదల చేసింది. అలాగే 2003 డిసెంబర్ 22 నాటికి నోటిఫికేషన్ విడుదల అయి 2004 తర్వాత నియామకాలు జరిగి సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న వారినందరినీ పాత పెన్షన్ పరిధిలోకి తీసుకు వెళ్లేలా ఉత్తర్వులు విడుదల చేయడం జరిగింది. పీఎఫ్ఆర్డీఏ చట్టం ప్రకారం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మార్పులు చేర్పులు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనుసరించవలసి ఉంటుంది. ఆ లెక్కన రాష్టంలో కూడా రాష్ట్రంలో సీపీఎస్ అమలు తేదీకి ముందు నోటిఫికేషన్ విడుదల అయిన నియామకం కాబడిన ఉద్యోగులను ఓపీఎస్ చేర్చాలి. కానీ వారిని సీపీఎస్ పరిధిలోకి వచ్చి అన్యాయం చేశారు.ఈ విషయమై రెండు దశాబ్దాలకు పైగా అనేక ధర్నాలు, ఉద్యమాలు, నిరసనలు చేసినప్పటికీ సమస్య సమస్యగానే మిగిలిపోవడం శోచనీయం. ప్రభుత్వాలు ఎన్ని మారినా సీపీఎస్ ఉద్యోగుల గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు నూతన పెన్షన్ విధానం రద్దు కోసం చెయ్యని ధర్నా లేదు, కలవని పార్టీ లేదు. రద్దవడం మాట అటుంచితే ప్రభుత్వం దానిని రద్దు చేసే దిశగా ఆలోచన చేయడం మానేసి సరికొత్త స్కీంలను తీసుకురావడం విడ్డూరం.. ఆ కోవలో కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ పథకం ప్రవేశపెట్టింది. ఇక రాష్ట్రాల్లోనైతే ప్రతీ ఐదేళ్ల కొకసారి రాజకీయ పార్టీలకు సీపీఎస్ విధానం రద్దుచేస్తామని తమ తమ మేనిఫెస్టోల్లో పెట్టుకొని ఉద్యోగుల ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన తదుపరి ఆ ఊసే ఎత్తక పోవడం పరిపాటిగా మారిపోయింది. కేవలం పంజాబ్, హర్యానా, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక మొదలైన రాష్ట్రాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయి. ఈ నేపథ్యంలో మిగితా రాష్ట్రాలు కూడా ఆ దిశగా అడుగులు వేయాల్సిన ఆవశ్యకత ఉంది. కొత్త పెన్షన్ అమలు చేస్తున్న ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అధ్యయనం చెస్తే సీపీఎస్ రద్దు చేయడం సాధ్యమయ్యే ప్రక్రియే. ఈ రద్దు లక్షా అరవై వేల ఉద్యోగుల కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశంగా ప్రభుత్వం పరిగణించి వెంటనే రద్దు దిశగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాలి. రాష్ట్రోపాధ్యాయ సంఘం సీపీఎస్ రద్దును కోరుతూ 2018లోనే ఓరుగల్లు నడిబొడ్డున మహాధర్నా నిర్వహించి పాత పెన్షన్ ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేసింది. ఇక గత ఇరవై ఏళ్లుగా ఏటా సెప్టెంబర్ మొదటి తేదీన పెన్షన్ విద్రోహ దినంగా జరుపుతున్న నేటికి సీపీఎస్ విధానం రద్దుకాకపోవడం శోచనీయం. ప్రభుత్వాలు ఈ విధానం రద్దును ఒక రాజకీయ ప్రక్రియగా కాకుండా ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసాను కల్పించే దిశగా ఆలోచించి రద్దుకు చర్యలు చేపట్టాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో పాత పెన్షన విధానాన్ని పునరుద్ధరిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి. ఆ ప్రకారం ముందుగా కేంద్ర ప్రభుత్వం సూచించిన మాదిరిగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలి.

## మేడారం జాతరపై కేంద్రం ఫోకస్..

- మొదటి పేజి తరువాయి

కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మేడారం చుట్టుపక్కల ఉన్న ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించడం కోసం 'గిరిజన సర్క్యూట్ పేరిట' గతంలో రూ.80 కోట్లతో ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా పలు అభివృద్ధి పనులను కూడా చేపట్టింది. యునెస్కో గుర్తింపు లభించిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రూ.140 కోట్లు ఖర్చుచేస్తోంది. అమ్మవా ర్లకు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచి, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌక ర్యార్థం జాతర జరిగే నాలుగు రోజుల పాటు, దక్షిణ మధ్య రైల్వే శాఖ 30 ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతోంది.

## అమెరికా టారిఫ్‌లపై కనీసం నోరెత్తరు

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఫ్యాక్టరీ యాజమానితో మాట్లాడాడు. వ్యాపారం ఎలా సాగుతుంది.. అమెరికా సుంకాలు ఏ మేర ప్రభావం చూపుతున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ యాజమాని మాట్లాడుతూ.. వస్త్ర పరిశ్రమ శ్రమతో కూడుకున్నదని.. దేశంలో వ్యవసాయం తర్వాత రెండవ అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తుందని అన్నారు. గతంలో అమెరికా నుంచి పెద్ద ఎత్తున ఆర్డర్లు ఉండేవని, 50 శాతం సుంకాల తర్వాత ఆర్డర్లు లేక వ్యాపారం డీలా పడిపోయిందని.. సుంకాలు ఇంకా పెరిగితే పరిశ్రమలు మూతపడిపోతాయని రాహుల్ గాంధీతో చెప్పాడు. ఈ మేరకు వస్త్ర పరిశ్రమను సందర్శించిన వీడియోను రాహుల్ గాంధీ శనివారం (జనవరి 23) సోషల్ మీడియాలో పోస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీని లక్ష్యంగా విమర్శలు గుప్పించారు.

"అమెరికా 50 శాతం సుంకాలు, యూరప్‌లో ధరలు తగ్గడం, బంగ్లాదేశ్, చైనా నుండి తీవ్రమైన పోటీ కారణంగా భారత వస్త్ర పరిశ్రమ.. వస్త్ర ఎగుమతిదారులు తీవ్రంగా దెబ్బ తింటున్నారు. ఇది ఉద్యోగాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతోంది. -పరిశ్రమలు మూతపడుతున్నాయి. మొత్తం వస్త్ర రంగంలో గందరగోళం ఉంది. భారత వ్యాపారాలు, భారతీయ కార్మికులకు ప్రాధాన్యతనిచ్చే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని భారతదేశం పొందడం అత్యవసరం" అని రాహుల్ పేర్కొన్నాడు. కేంద్రం సుంకాల సమస్యను పరిష్కరించకపోవడంతో వస్త్ర వ్యాపారులు తీవ్రంగా దెబ్బ తింటున్నారని.. 4.5 కోట్లకు పైగా ఉద్యోగాలు, లక్షలాది వ్యాపారాలు ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ అమెరికా సుంకాలపై నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ ఇకనైనా ఈ విషయంపై దృష్టి పెట్టాలని సూచించారు.

## కేటీఆర్ చాలా దుర్మార్గుడు.. ఆయనకు క్యారెక్టర్ ఎక్కడుంది..?

- మొదటి పేజి తరువాయి

ఎక్కడుంద న్నాడు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్‌లో కేటీఆర్ వివిధ రకాల నార్కోటిక్ సరఫరా పెంచిండని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని పబ్‌లు, క్లబ్‌లలో డ్రగ్స్ సప్లై పెంచిన ఘనత కేటీఆర్‌దని విమర్శించాడు. కేటీఆర్‌ను జైల్లో వేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి నూటికి నూరు శాతం అమ్ముడుపోయినట్లేనని అన్నాడు.

శుక్రవారం (జనవరి 23) కోరుట్ల పట్టణంలో పలువురు వ్యాపారవేత్తలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం పేరుతో కోట్లు మింగింది ఎవరు..? ఢిల్లీ లిక్కర్ స్కామ్ చేసింది ఎవరు..? ఫార్ములా ఈ కార్ రేస్ స్కామ్ చేసిందెవరు..? ఫోన్ ట్యాపింగ్ చేయించిందెవరు..? పదేళ్లు తెలంగాణను దోచుకున్నది ఎవరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగిన అవినీతి అక్రమాల్లో కేటీఆర్ హస్తం లేకుంటే ఆయన కాలు ఉందా లేక కేసీఆర్ ముక్కు ఉందా అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడ కంపెనీలనే దావోస్ తీసుకెళ్లి అక్కడ ఫొటోలు దిగుతున్నాడని.. తెలంగాణకు పెట్టుబడులు వచ్చిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని సొంత పార్టీ తీవ్రంగా అవమానిస్తోందని అన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడ్డ జీవన్ రెడ్డిని ఈ వయసులో ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని, ఆయనను కూర్చోబెట్టి మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. ఇక ఎమ్మెల్సీ ఎల్ రమణ, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో వారికి కూడా తెలియదని ఎద్దేవా చేశారు. రైతులకు లాభం చేకూర్చడానికి పసుపు బోర్డు ప్రణాళిక బద్ధంగా పని చేస్తుందని తెలిపారు.

# కేసీఆర్ ఫ్యామిలీని టచ్ చేసే దమ్ము కాంగ్రెస్ కు లేనేలేదు

- మొదటి పేజి తరువాయి

కూర్చున్న అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. ఢిల్లీకి ముడుపులు కోసమే ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో సాగదీస్తున్నారని అన్నారు. విచారణ పేరుతో హడావుడి చేసినప్పుడల్లా ఫాంహౌజ్ నుండి ఏఐసీసీకి ముడుపులు వెళుతున్నాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి అన్ని ఆధారాలు, సాక్షాలు పోలీసుల వద్ద ఉన్నాయని, తనను విచారణకు పిలిచిన సమయంలో ఆ ఆధారాలను, సాక్షాలను సైతం చూపించారని తెలిపారు. జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు తేలిందన్నారు. అయినా కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈరోజు కరీంనగర్ లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ పై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోపాటు కేటీఆర్ అరాచకాలను వివరిస్తూ తీవ్రస్థాయిలో స్పందించారు. ఏమన్నారంటే...

ఫోన్ ట్యాపింగ్ పై సిట్ విచారణ టీవీ సీరియల్ ను మించి ఆది అంతం లేకుండా కొనసాగుతూనే ఉంది. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోతున్నారు. సిట్ అధికారులకు స్వేచ్ఛ ఇవ్వడం లేదు. ప్రభుత్వంలో కొందరు పెద్దలు ఆదేశాలకు అనుగుణంగానే విచారణ చేస్తున్నారు. నిజానికి సిట్ అధికారులు సమర్థులు, నిజాయితీపరులు. కానీ వాళ్లపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోంది. ఆ పెద్దలు ఎవరిని పిలవమని అడిగితే వాళ్లనే పిలిచి విచారణ చేస్తున్నారు.

నేనడుగుతున్నా.. కేటీఆర్ ను ఎందుకు విచారణకు పిలిచారు? ఆయన ఫోన్ ట్యాపింగ్ చేయించినందుకు పిలిచారా? లేక ఆయన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని చెప్పడానికి పిలిచారా? సిరిసిల్ల కేంద్రంగా వార్ రూంను ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేశారని నేను చాలా సార్లు చెప్పిన. యువరాజు కేటీఆర్ ఆడిందే ఆటగా ఫోన్ ట్యాపింగ్ చేయించి పాలనను కొనసాగించారు. బ్రిటీష్ పాలన తరహాలో పాలన చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. రియల్ ఎస్టేట్ బిల్డర్లు, వ్యాపారులను, సినీ నటులను బెదిరించి కోట్లు దండుకున్నారు. బెదిరించి బీఆర్ఎస్ పార్టీకి ఎలక్ట్రోరల్ బాండ్స్ కొనుగోలు చేయించారు. నా ఫోన్లను, ప్రస్తుత సీఎం, మంత్రుల ఫోన్లతోపాటు జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. కేసీఆర్ కుటుంబమే ఇదంతా చేసింది. అసలు కారకులైన వాళ్లను సాక్షిగా పిలిచి విచారణ పేరుతో వాంగ్మూలం నమోదు చేయడమేంటి?రెండేళ్ల విచారణలో సిట్ సాధించిందేమిటి? ఒక్క రాజకీయ నాయకుడినైనా అరెస్ట్ చేశారా? ఎన్ని ఆస్తులు జప్తు చేశారు? ఎంత మందిపై చర్యలు తీసుకున్నారు?... స్వయంగా కేసీఆర్ కూతురే తన ఫోన్ ట్యాప్ చేశారని చెప్పారు. మాజీమంత్రి హరీష్ రావు ఆ టైంలో ఏడాదిపాటు ఫోన్ కూడా వాడలేదు. ఇన్ని సాక్షాలు, ఆధారాలున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? కేసీఆర్ పాలనలో సామాన్యులు మొదలు భిక్షాటన చేసే వ్యక్తులు కూడా ఫోన్ ఉన్నా వాట్సప్ కాల్ లో తప్ప నార్మల్ కాల్ మాట్లాడలేని పరిస్థితి తీసుకొచ్చారు. ఇంత దారుణానికి దొంగలను పిలిచి 'మీ ఫోన్ ట్యాప్ చేశారా?'అని విచారణకు పిలవడం ఏంది?అసలు కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో టైం పాస్ విచారణ చేస్తున్నారు. సిట్ అధికారులు మంచి అధికారులు. వాళ్లకు స్వేచ్ఛనిచ్చి విచారణ జరిగేలా చూడాలి. అట్లా కాకుండా ప్రభుత్వ వ్యవహారశైలికి విసిగిపోయి సిట్ నుండి తప్పుకునే ప్రమాదముంది.

నన్ను సిట్ విచారణకు పిలిచి 6 నెలలైంది. మావోయిస్టు జాబితాలో నా నెంబర్ ఉంచి ఫోన్ ట్యాప్ చేశారని పోలీసులే చెప్పారు. ఆధారాలు కూడా నాకు చూపించారు. అంతెందుకు సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆయనే చెప్పారు కదా? సీఎం స్థాయి వ్యక్తి ఆధారాల్లేకుండా మాట్లాడరు కదా? అయినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు? ఇదంతా డ్రామా. విచారణకు పిలిచినప్పుడల్లా ఏఐసీసీకి ఎక్కువ ముడుపులు అందుతున్నాయోమో. ఏఐసీసీకి, ఫాంహౌజ్ కు మధ్య పూర్తి డీల్ కుదరకపోవడంతోనే విచారణ పేరుతో డ్రామాలాడుతున్నారు. జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేస్తే చర్యలు తీసుకోకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంది? వాళ్లు ఎవరికి చెప్పుకోవాలి? ఇకనైనా కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే అరెస్టుల

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు పక్కా

సంగారెడ్డి: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు పక్కా అని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చా ర్జి మంత్రి గడ్డం వివేక్వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ బై పోల్, సర్పంచ్ ఎన్నికల తర్వాత పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చిందన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం ముత్తంగి, జిన్నారం లో పర్యటించారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడి దల, జిన్నారం, గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

నియోజకవర్గంలో గ్రూపు రాజ కీయాలు లేవని, తాను చేయించిన సర్వేలో పార్టీ తప్పక విజయం సాధిస్తుందని తేలిందన్నారు. అభ్యర్థుల ఎంపిక సక్రమంగా జరగాలన్నారు. టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని, అలాంటి వారికి భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారని, అందరూ కలిసి పార్టీ అభ్యర్థులను గెలిచింపుకో వాలన్నారు. కొత్త రేషన్ కార్డుల ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్న మంత్రి.. ఇండ్ల విషయంలో గత ప్ర భుత్వం ప్రజల్ని మోసం చేసిందని విమర్శించా రు.

ప్రజల దగ్గరకు వెళ్ళినప్పుదు 6 గ్యారంటీల గురించి వివరించాలన్నారు. మహిళలకుకు పెట్రోల్ బంకులు శాంక్షన్ చేయిస్తామన్నారు. ఎదుటి పార్టీ విమర్శలకు గట్టి కౌంటర్అవ్వాలని సూచించారు. పఠాన్ చెరులో పోల్ మేనేజమెంట్ సరిగా లేక ఓడిపోయామన్నారు. కార్మికుల వైపే కాంగ్రెస్ పార్టీ ఉందని చెప్పారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు హైదరాబాద్ పోలీసుల నోటీసులు

- మొదటి పేజి తరువాయి

నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ సీపీ, ఫోన్ ట్యాపింగ్ కేసు సిట్ చీఫ్‌గా ఉన్న సజ్జనార్‌పై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయని ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఈ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు, వివరాలు వెల్లడించకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు పోలీసులు. సిట్ చీఫ్ ప్రతిష్టను దిగజార్చేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేశారని.. విచారణలో ఉన్న కేసును ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేసినట్లు నోటీసులో స్పష్టం చేశారు. సిట్ చీఫ్‌పై ఉన్నాయని పేర్కొన్న 7 కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు.

ఎఫ్ఐఆర్‌లు, చార్జ్‌షీట్లు, కోర్టు ఆదేశాలు వంటి ఆధారాలు సమర్పించాలని స్పష్టం చేశారు. రెండు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. గడువులోగా స్పందించకపోతే

క్రిమినల్, సివిల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. పరువు నష్టం కేసులు, క్రిమినల్ ఇన్టిమిడేషన్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. చట్ట ప్రకారం పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సిట్ విచారణలో ఏమి లేదు..
## అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగిర్రు: కేటీఆర్

- మొదటి పేజి తరువాయి

లేదని అధికారులు చెప్పారన్నారు. హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేశారంటూ జరుగుతున్న ప్రచారం నిజం కాదని పోలీసులు చెప్పారని తెలిపారు. లీకులను ఎవరూ నమ్మొద్దని.. లోపల ఏదో జరిగిపోతుందని బయట తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. వేధింపుల తప్ప సిట్ విచారణలో ఏమి లేదని.. ఈ కేసులో ఏదైనా ఉంటే కదా ఉక్కిరి బిక్కిరి అయ్యేదన్నారు. అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగి వేధించారని ఆరోపించారు. ఎన్నిసార్లు పిలిచినా సిట్ విచారణకు వెళ్తామని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం (జనవరి 23) కేటీఆర్ సిట్ విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి దాదాపు 7 గంటల పాటు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన విరాళాలు, ఎలక్టోరల్ బాండ్లు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొందరు వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి కేటీఆర్‌పై అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. అలాగే ఈ కేసులో నిందితుడు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, కేటీఆర్‌ను కలిపి గంట పాటు ఇన్విస్టిగేట్ చేసినట్లు సమాచారం. విచారణ అనంతరం కేటీఆర్ తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ పేరుతో కాలక్షేప కథాచిత్రం నడుపుతున్నారన్నారు. సింగరేణి టెండర్లలో అవకతవకలపై ఆధారాలతో హరీష్ రావు బయటపెట్టినా ఇప్పటివరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. స్వయంగా మంత్రి కుమారుడు గుండాగిరి చేస్తున్నా.. చర్యలు లేవు.. అక్కడ సిట్ కూడా లేదని అన్నారు. బొగ్గు కుంభకోణం కేసులో సీఎం రేవంత్ రెడ్డి బావమరిది కింగ్ పిన్ అని ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకునే దమ్ము ప్రభుత్వానికి ఉన్నదా అని ప్రశ్నించారు. సీఎం, మంత్రులు అవినీతికి పాల్పడుతుంటే సిట్ ఎందుకు వేయరని..

న్యాయం, ధర్మం అందరికీ ఒకేలా ఉండాలని పేర్కొన్నారు. ఇది లీకుల ప్రభుత్వమని.. లీకులపై ఆధారపడి పాలన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ డీసీపీ రాధాకిషన్ రావుతో కలిపి విచారించారన్న వార్తలపై క్లారిటీ ఇచ్చారు. తనను ఎవరితో కలిసి విచారించలేదని తెలిపారు. తాను సిట్ అధికారులను బెదిరించలేదని తెలిపారు. బాధ్యత గల ప్రతిపక్షంగా విచారణకు సహకరిస్తామని చెప్పారు.

## ఇరాన్ పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు...

మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్ లక్ష్యంగా మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే, అమెరికా నుంచి మరోసారి భీకర దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అణు ఆయుధాల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని ట్రంప్ తేల్చిచెప్పారు.

### సైనిక మోహరింపుతో ఉద్రిక్తత

ట్రంప్ హెచ్చరికలకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో అమెరికా సైనిక కదలికలు వేగవంతమయ్యాయి. అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం/పర్షియన్ గల్ఫ్ దిశగా తరలిస్తోంది. దీనికి తోడు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ జెట్‌లు, గగనతలంలోనే ఇంధనం నింపే కేసీ-135 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అమెరికా సిద్ధం చేసింది. ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు థాడ్ (ఎనూగాణ), పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను మధ్యప్రాచ్యంలో మోహరించారు. ఇజ్రాయెల్, ఖతార్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను అమెరికా మరింత పటిష్టం చేయడం గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది.

### అణు కేంద్రాలపై ఆందోళన

గత ఏడాది జూన్‌లో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఫోర్డో అణు కేంద్రంపై జరిగిన బంకర్ బస్టర్ దాడుల తర్వాత అక్కడి నుంచి సుమారు 400 కిలోల సుసంపన్న యురేనియం అదృశ్యమైందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలలుగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ తనిఖీలు నిలిచిపోవడంతో ఇరాన్ రహస్యంగా అణు ఆయుధాలను తయారు చేస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### శాంతి చర్చలకు అవకాశం ఉందా?

యుద్ధ వాతావరణం కనిపిస్తున్నప్పటికీ, ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్' అనే కొత్త అంతర్జాతీయ సంస్థను ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. గాజా సమస్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపనకు ఈ సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. అయితే, ఇరాన్ తన ప్రాక్సీల ద్వారా హార్ముజ్ జలసంధిలో నౌకలను అడ్డుకోవడం లేదా ప్రతీకార దాడులకు దిగడం వంటివి చేస్తే పరిస్థితి చేజారిపోయే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్ కూడా తమ ఐరన్ డోమ్, అరో సిస్టమ్స్‌తో అప్రమత్తంగా ఉంది. మొత్తానికి ట్రంప్ మాటల్లో బెదిరింపులు ఉన్నప్పటికీ, చర్చలకు కూడా దారులు తెరిచే ఉంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## మంత్రి సీతక్క పర్యటనలో ఉద్రిక్తత

తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క జనగామ పర్యటనలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. జనగామ జిల్లా కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి సీతక్క, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరుల మధ్య మాటల యుద్ధం జరిగింది.

పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం సీతక్క, పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కాదని, ఈ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల్లో ఇతర నియోజకవర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.మరోవైపు, కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి ఆహ్వానించగా, ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య వాగ్వాదం, తోపులాటకు దారితీసింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేయగా, బీఆర్ఎస్ శ్రేణులు 'జై పల్లా' అంటూ ప్రతి నినాదాలు చేశారు.

## అవసరమైతే మళ్లీ పిలుస్తం

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు స్పందించారు. 2024 మార్చిలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో సిట్ దర్యాప్తు జరుపుతోంది. కేటీఆర్ విచారణ నేపథ్యంలో పలు ఊహాగానాలు మీడియాలో రావడంతో సిట్ ఓ ప్రకటన విడుదల చేసింది.సాక్షులను ప్రభావితం చేయవద్దని కేటీఆర్‌కు తెలియజేసినట్లు సిట్ తెలిపింది. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని కూడా ఆయనకు చెప్పినట్లు వెల్లడించింది. కేసీఆర్‌ను మరొకరితో కలిసి విచారణ జరిపారని మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కూడా సిట్ స్పందించింది. కేటీఆర్‌ను ఒంటరిగానే ప్రశ్నించామని స్పష్టం చేసింది. ఆధారాలు, రికార్డులను ముందు ఉంచి ప్రశ్నించినట్లు పేర్కొంది. ఈ విచారణ నిష్పక్షపాతంగా జరిగిందని వెల్లడించింది. ఎలాంటి అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని సూచించింది. అధికారిక ప్రకటనను మాత్రమే విశ్వసించాలని తెలిపింది.

## ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. తన జోక్యం వల్లే ఇరాన్‌లో 800 మందికిపైగా నిరసనకారుల ఉరిశిక్షలు ఆగిపోయాయని ట్రంప్ పేర్కొనడంపై ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన అగ్ర ప్రాసిక్యూటర్ మొహమ్మద్ మొవాహెది తీవ్రంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు.

నిరసనకారులకు సామూహికంగా మరణ శిక్షలు విధించాలనే నిర్ణయమే ఇరాన్ ప్రభుత్వం ఎప్పుడూ తీసుకోలేదని మొవాహెది తెలిపారు. ఎవరికీ ఉరిశిక్షలు విధించలేదని, అరెస్టయిన వారి సంఖ్య కూడా ట్రంప్ చెప్పినంత పెద్దగా లేదన్నారు. ఈ విషయంలో తప్పుడు వార్తలు, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచారం చేయొద్దని అంతర్జాతీయ మీడియాను ఆయన కోరారు. ఇదే అంశంపై ట్రంప్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌లో వందల మంది నిరసనకారులకు విధించబోయే ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి కారణంగా అక్కడి అధికారులు రద్దు చేశారని వ్యాఖ్యానించారు. తాను జోక్యం చేసుకోకపోయి ఉంటే 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయేవని, తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం పూర్తిగా ఖండిస్తూ, అవి వాస్తవానికి దూరమని స్పష్టం చేసింది.

## కేరళలో మార్పు అనివార్యం..

గుజరాత్‌లో బీజేపీ విజయం ఒక నగరం నుంచి ప్రారంభమైందని, అదే తరహా విజయం కేరళలోనూ పునరావృతమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటీవల తిరువనంతపురం నగరంపాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీ సాధించిన అద్భుత విజయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా తిరువనంతపురంలో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తూ, కేరళలో మార్పు అనివార్యమని ఆయన జోస్యం చెప్పారు.కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)ల అవినీతిని అంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ పరిస్థితులను పూర్తిగా మార్చివేస్తాయని ఆయన అన్నారు. ఇప్పటివరకు కేవలం రెండు కూటములను మాత్రమే చూశారని ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లను ఉద్దేశించి విమర్శించారు. ఈ రెండు కూటములు రాష్ట్రాన్ని నాశనం చేశాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.కేరళ ప్రజలు మూడో ప్రత్యామ్నాయం వైపు చూస్తే అభివృద్ధి, సుపరిపాలన సాధ్యమవుతాయని బీజేపీని ఉద్దేశించి అన్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌ల జెండాలు మాత్రమే వేరని, వారి అజెండా మాత్రం ఒక్కటేనని ఆయన విమర్శించారు. ప్రజల అభివృద్ధికి తోడ్పడే ప్రభుత్వం ఇప్పుడు అవసరమని, ఆ బాధ్యతను బీజేపీ తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. బీజేపీపై నమ్మకం ఉంచి కేరళ ప్రజలు తమతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. "శబరిమలలో జరిగిన బంగారం దొంగతనంపై విచారణ జరిగేలా చూడటం ఈ మోదీ హామీ" అని ఆయన వ్యాఖ్యానించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



2024 ఆగష్టు 16న ఏసిపి సాయిబాబా, టిపిఎస్ ప్రభావతి ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణం సీజ్..


ఫాక్స్‌సాగర్ నాలాపై మార్వాడి అక్రమ నిర్మాణం.. అధికారుల అండతోనే..

# ఫాక్స్‌సాగర్ 'నాలా' కబ్జాలపై..
# 'విజిలెన్స్' కొరడా..!

**అడ్డుకోలేకపోయిన జీహెచ్ఎంసి అధికారి "టిపిఎస్" అంటూ విజిలెన్స్ నివేదిక..!**

- 125 ఏళ్ళనాటి చారిత్రక ఫాక్స్‌సాగర్ నాలా కబ్జాలపై నిప్పులమీద నీళ్ళు చల్లిన నివేదిక..!
- ఈ వ్యవహారంలో దొంగలు చాలామందే ఉన్నప్పటికీ నింద మాత్రం ఒక్కరి పైనే..?
- ఒకప్పుడు(1897-99) 200 ఫీట్లు ఉన్న నాలాను..ప్రస్తుతం 2030 ఫీట్లకు కుదింపు..
- 2018 జాయింట్ సర్వేలో నాలా వెడల్పు 100 ఫీట్లు ఉన్నట్టు స్కెచ్‌ప్లాన్..!
- నాడు నివేదిక జారీచేసిన మూడు శాఖలు.. నిబంధనలు అమలులో విఫలం..
- "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్ నిర్మాణం లోనూ ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణ..
- తాజాగా (విజిలెన్స్ విచారణ చేపట్టిన) మార్వాడి అక్రమ నిర్మాణం బఫర్ జోన్‌లోనే..
- అక్రమ షాపింగ్ కాంప్లెక్స్ అంటూ విజిలెన్స్ నివేదికలో ఆధారాలతో స్పష్టీకరణ..
- కోర్టుకు కౌంటర్ దాఖలు చేయక పోవడంలో అధికారుల ఉదాసీనత బట్టబయలు..
- టిపిఎస్ ప్రభావతిపై మాత్రమే విజిలెన్స్ విచారణకు, పలు అనుమానాలు వ్యక్తం..?
- ఇరిగేషన్‌రెవెన్యూ పాత్రను ప్రస్తావించడంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మౌనం..
- పలుకుబడి ఉన్నోళ్ళను వదిలేసి మహిళా అధికారిపై వేటు..! అంటూ విమర్శలు..!

- 'పెన్ పవర్' వందల కథనాల తర్వాత ఒక్క టిపిఎస్‌పై మాత్రమే విజిలెన్స్ విచారణ..?
- శాఖాపరమైన విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు..
- 2026 జనవరి 2న జీహెచ్ఎంసి కమిషనర్‌ను విచారణకు ప్రభుత్వం ఆదేశం..
- విచారణలో తాజా పరిస్థితిపై స్పష్టమైన నివేదిక పెండింగ్..?



పత్రికల్లో వచ్చిన వార్తలను కూడా కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి అధికారులు బేఖాతర్.. నిర్మాణం పూర్తి..

-4లో

ఫాక్స్‌సాగర్ నాలా కబ్జాలపై దాదాపు మూడేళ్లపాటు 'పెన్ పవర్' దినపత్రికలో వార్తా కథనాలతో ట్విట్టర్ (ఎక్స్) వేదికగా, అటు ప్రభుత్వ పెద్దలకు, సంబంధిత శాఖల యంత్రాంగానికి ఫిర్యాదులకు గానూ ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది.. ఈ వ్యవహారంలో దొంగలు చాలామందికి భాగస్వామ్యం ఉన్నప్పటికీ నింద మాత్రం ఒక్క టిపిఎస్ పైనే..? ఉండటంపై తీవ్ర విమర్శలు తలెత్తుతున్నాయి.. పలు అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.. కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్ నుండి టిపిఎస్ ఒక్కరే బాధ్యులా..? అక్రమ నిర్మాణానికి టిపిఎస్ సహకారం అందించారనేది నగ్నసత్యం.. అయినప్పటికీ డిప్యూటీ కమిషనర్, అండ్ ఏసిపి(టౌన్‌ప్లానింగ్ అధికారి) చర్యలను టిపిఎస్ ప్రభావతి అడ్డుకున్నారా..? నాలా పరిరక్షణా బాధ్యత ఇరిగేషన్ రెవెన్యూ శాఖల యంత్రాంగానికి బాధ్యత లేదా..? అక్రమ కట్టడానికి టీజీఎస్‌పీడీసీఎల్ ఏ ప్రాతిపదికన "ట్రాన్స్‌ఫార్మర్" మంజూరు చేశారు..? నాలా కబ్జాలకు బాటలు వేసిన అధికారులు ఎవరు..? ఇందులో రాజకీయ హస్తం లేకుండా నాలా కుదింపు సాధ్యమేనా..?రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఫాక్స్‌సాగర్ నాలా కుదింపుకు ఎవరి హస్త ఉంది..? మరోవైపు ఇరిగేషన్ 'ఔట్ సోర్సింగ్' ఉద్యోగి రామారావు కీలక పాత్రను పోషించాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి.. ఇంతమందిపై విజిలెన్స్ విచారణ కొనసాగిందా..? నిప్పుల మీద నీళ్ళు చల్లిన చందంగా చారిత్రక సంపద దోపిడీపై విజిలెన్స్ విచారణలో 'టిపిఎస్'ను మాత్రమే దోషిగా ప్రస్తావించారు బాగుంది.. మిగతా వారిని తప్పించేందుకు పావులు కదుపుతున్నది ఎవరు..? ఈ మొత్తం కబ్జా వ్యవహారంలో ప్రభుత్వం స్పందించింది అనాలా..? తూతూ మంత్రపు విచారణగా భావించాలా..? **మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 23:**


అనుమతుల్లేని అక్రమ షాపింగ్ కాంప్లెక్స్‌కు విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు..



## కార్తీకదీపం సరే... ముందు బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోండి

- కేటీఆర్ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ ఫైర్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్య
- కవితను చెల్లెలుగా గౌరవిస్తానన్న పీసీసీ చీఫ్

- మిగతా 4లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బొగ్గు స్కామ్ భయంతోనే సిట్ నోటీసులు..!

**కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలు: బీఆర్ఎస్ నేత నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి..**

- సింగరేణి బొగ్గు స్కామ్‌పై నిజాలు బయట పడతాయన్న భయంతో కాంగ్రెస్ కుట్రలు..
- హరీష్‌రావు, కేటీఆర్‌లకు నోటీసులు కక్ష సాధింపు చర్యలే..
- ఎన్ని విచారణలైనా బీఆర్ఎస్ వెనుకడుగు వేయదు..


**దుండిగల్, పెన్ పవర్, జనవరి 23:**బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేకే కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని, సిట్ నోటీసులు, అనవసర విచారణలు కాంగ్రెస్ పాలనా వైఫల్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ నేత, బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు..సింగరేణి బొగ్గు స్కామ్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుండటంతో నిజాలు బయట పడతాయన్న భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉండి, ప్రజల దృష్టిని మళ్లించేందుకే సిట్ నోటీసులు, అనవసర విచారణలు చేపడుతోందని ఆరోపించింది.. మొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావుకు, నేడు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్షసాధింపు చర్యకు పరాకాష్ట అని పేర్కొంది. వరుసగా వెలుగులోకి వస్తున్న కుంభకోణాల నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసి విచారణల పేరుతో కాలక్షేపం చేస్తోందని తెలిపింది.. సింగరేణిలో జరిగిన బొగ్గు స్కామ్‌పై దేశమంతా చర్చ జరుగుతున్న ఈ సమయంలో నిజాలను ఎదుర్కోలేక, ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని దారి మళ్లించేందుకే సిట్ విచారణల డ్రామాకు తెరలేపిందని బీఆర్ఎస్ నాయకుడు ఆరోపించారు.. అయితే ఈ కేసుల్లో ఎలాంటి పస లేదని, తెలుసుకుని, రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పాలకుల కక్షసాధిస్తున్నట్టు విమర్శించారు.. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని విచారణలు చేసినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎదుర్కోవడానికి సిద్ధంగానే ఉంటారని, ప్రజల పక్షాన నిలబడుతూ పోరాటం కొనసాగిస్తామని పేర్కొంది. పార్టీ నాయకులకు కార్యకర్తలంతా అండగా నిలుస్తారని, కాంగ్రెస్ డైవర్షన్ రాజకీయాలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు..



నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి.. బౌరంపేట్ మాజీ కౌన్సిలర్..


# టెన్‌జు కుత్బుల్లాపూర్ నూతన కమిటీ.. ఏకగ్రీవ నియామకం..

**కన్వీనర్‌గా ఎర్రోళ్ళ కృష్ణ.. కో-కన్వీనర్‌గా ఉదయ్ కుమార్..**


టీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి సమక్షంలో కమిటీ నియామకం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 23:**తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ యూనియన్ (టెన్‌జు) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా నియమించారు. ఈ కమిటీలో కన్వీనర్‌గా ఎర్రోళ్ల కృష్ణ, కోకన్వీనర్‌గా ఉదయ్ కుమార్‌ను ఎంపిక చేశారు.. రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, టీయుడబ్ల్యుజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కోలా వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలెపాక వెంకట్‌ల ఆధ్వర్యంలో ఈ నియామక ప్రక్రియ జరిగింది.. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో టెంజు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు..


కన్వీనర్ ఎర్రోళ్ళకృష్ణ..


కో- కన్వీనర్ ఉదయ్ కుమార్..

# ఫాక్స్‌సాగర్ 'నాలా' కబ్జాలపై.. 'విజిలెన్స్' కొరడా..!




ఈ అక్రమ నిర్మాణానికి ఎదురుగా మరో అపార్ట్‌మెంట్ కూడా ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణతో..





ఫాక్స్‌సాగర్ నాలాపైనే మార్వాడి నిర్మాణం..





పెన్ పవర్
పెన్ పవర్
తెలంగాణ రౌండప్
సోమవారం 11 ఆగస్టు 2025 పేజీలు 8
నాలాపైనే అక్రమ నిర్మాణం ఉన్నట్టు ఆధారం..
# కబ్జాల ఊబిలో..!
# చారిత్రక వారసత్వ సంపద
అవినీతి అధికారుల చేతుల్లో కుందించుకు పోతున్న ఫాక్స్‌సాగర్ నాలా..?

ఫాక్స్‌సాగర్ నాలా చారిత్రక వారసత్వ సంపదను కబ్జాదారుల చేతుల్లో పెట్టి..! కొందరు అవినీతి అధికారుల కరెప్షన్‌కి అడ్డూ అదుపు లేకుండా పోతోంది..! 125 ఏళ్లనాటి చారిత్రక ఆనవాళ్ళను, ఏడాదికి ఏడాది నామ రూపాలు లేకుండా ఆ దిశగా కనుమరుగు చేస్తున్నారు.. 1897-99 కాలంలో నిర్మితమైన ఈ ఫాక్స్‌సాగర్ చెరువు నాలా, ఒకప్పుడు 200 ఫీట్ల వెడల్పుతో, మూసీనదిని కలిపే అతిపెద్ద నాలాగా ఉండేదని జీడిమెట్ల గ్రామస్థులు చెబుతుండగా..! ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసి జాయింట్ సర్వేతో, 2018లో 100 ఫీట్లకు కుదించారు..! ప్రస్తుతం సంబంధిత ఫాక్స్‌సాగర్ నాలా కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, ప్రాంతంలో పలుచోట్ల భారీ అక్రమ కట్టడాలతో ఆక్రమణకు గురైంది.. ఇదంతా అధికారుల ధనార్జనకు నిదర్శనం.. రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారుల సమన్వయంతో, ప్రజల ఆస్తులను అక్రమార్కులకు అప్పగిస్తున్నారు.. ఈమూడు శాఖలకు తోడుగా విద్యుత్ శాఖ కూడా వక్రమార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి సహకరిస్తున్నట్టు సమాచారం.
మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 10:

-2లో

నాలాపై అక్రమ నిర్మాణానికి విద్యుత్ అధికారులు, అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..

- కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 పరిధి, సుచిత్రా రోడ్డులో ఈ కబ్జాల పర్వం..
- ప్రధాన సూత్రధారులుగా "నీటిపారుదల శాఖ, రెవెన్యూ, జీహెచ్ఎంసి సర్కిల్-25..
- ఫాక్స్‌సాగర్ నాలా బహిరంగ కబ్జాల వెనుక ప్రముఖ ప్రజాప్రతినిధి హస్తం..?
- పనికిమాలిన ఓ నేత నిర్వాకం..! అంతరించి పోతున్న ప్రభుత్వ భూములు, చెరువులు..
- నియోజకవర్గంలో చెరువులకు, నాలాలకు భద్రత కరువు, వరద విపత్తులకు మార్గం..

ఫాక్స్‌సాగర్ నాలాపైనే ఈ అక్రమ నిర్మాణం..

epaperpenpower.in
11 Aug 2025 - Page 1



పెన్ పవర్
2 తెలంగాణ రౌండప్ TELANGANA ROUNDUP పెన్ పవర్ 11 సోమవారం, ఆగస్టు 2025
# కబ్జాల ఊబిలో..! చారిత్రక వారసత్వ సంపద..

-3 పేజీ తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల విలేజ్‌లో 125 ఏళ్ళనాటి (1897–99) చారిత్రక ఫాక్స్‌సాగర్ చెరువు నాలా కబ్జాలపై "విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్" విచారణ ఆమోదకరమే అయినప్పటికీ..! ఒక్క మహిళా అధికారిని టిపిఎస్‌ను మాత్రమే బాధ్యులుగా ఆరోపించడం విమర్శలకు తావిస్తోంది.. అదే సమయంలో గాని, అంతకంటే ముందు, ఆతర్వాత గాని, విధుల్లో ఉన్న డిప్యూటీ కమిషనర్‌లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు (ఏసిపి)..! అత్యంత ముఖ్య విభాగం నీటిపారుదల శాఖ నార్త్ ట్యాంక్ డివిజన్ సహాయ సహకారాలు..! కస్టోడియన్‌గా ఉన్న రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం..! ఇంత మందిపై విజిలెన్స్ విచారణ జరగలేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.. మరోవైపు రాజకీయ పలుకుబడితో నాలాను నలిపేసిన రిటైనింగ్ వాల్ నిర్మాణంలో స్థానికంగా ఓ ప్రజాప్రతినిధి

ఇరిగేషన్ అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుని "రిటైనింగ్ వాల్" పేరుతో ఫాక్స్‌సాగర్ నాలాను కబ్జాదారులకు మేలు చేసేలా కుదించారని ఆరోపణలు లేకపోలేదు..

ఒకప్పుడు వందల అడుగుల వెడల్పు ఉన్న ఫాక్స్‌సాగర్ నాలా నేడు 2030 అడుగుల డ్రెయినేజీగా మారిపోయింది.. మార్వాడి అక్రమ

**కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని సుచిత్ర దారిలో,ఉన్న 1897-99 లో నిర్మించిన ఈ ఫాక్స్‌సాగర్ చెరువు సర్‌ప్లస్ నాలా ఆక్రమణతో పరిసరాలకు ముంపు వాటిల్లే ప్రమాదం ఉంది.. 2022-23 లో జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం అనుమతుల్లో 100 ఫీట్ల వెడల్పుతో ఉన్నట్లు స్కెచ్‌ప్లాన్ నిబంధనలు ఉల్లంఘించి "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టగా.. దానికి ఎదురుగానే నాలా బఫర్ జోన్‌లో రిటైనింగ్ వాల్ అనుకుని, మార్వాడి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వివాదాస్పదంగా తయారైంది.. ఈ విషయాన్ని పలుమార్లు పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన వార్తా కథనంతో డిప్యూటీ కమిషనర్, ఏసిపి, టిపిఎస్ దృష్టికి తీసుకెళ్ళగా.. 2024 ఆగష్టు 16న ఏసిపి సాయిబాబా, టిపిఎస్ ప్రభావతి సీజ్ చేసి ఫోటోలు తీసుకున్నప్పటికీ.. నిర్మాణం పూర్తిచేయడం గమనార్హం.. తప్పుచేసే ప్రతి టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇలాంటి విజిలెన్స్ విచారణలు జరిపితే..! చెరువు నాలాలు రక్షించవచ్చని పలువురు అభిప్రాయం తెలిపారు..**



ఈ అక్రమ నిర్మాణానికి కూతవేటు దూరంలోనే ఫాక్స్‌సాగర్ నాలా బఫర్ జోన్‌కి ప్రహరీగోడ, రూము నిర్మాణం..

నిర్మాణం పూర్తిగా నాలాపైనే ఉందని, అధికారుల చేతివాటానికి నిదర్శనం 2018 జాయింట్ సర్వే నివేదిక.. ఆ సర్వేలో జారీచేసిన స్కెచ్ మ్యాప్‌లో 100 అడుగుల నాలాగా స్పష్టతను ఇచ్చారు..ఆ వెడల్పులోనే, "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్ నిర్మాణం ఉండగా.. దానికి ఎదురుగానే రాజకీయ అండతో ఉన్న మార్వాడి వ్యాపారి2024 ఏప్రిల్ నుంచి, ఏకంగా ఫాక్స్‌సాగర్ నాలాపైనే అక్రమ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాడు. ఈ అంశంపై 'పెన్ పవర్' దినపత్రికలో 3040 వరుస కథనాలు వచ్చాయి... ఇరిగేషన్ నార్త్ ట్యాంక్ డివిజన్ (బుద్ధభవన్, సికింద్రాబాద్) కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులకు అన్నీ తెలిసినా పర్యవేక్షణ శూన్యం.. చివరికి జీహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు కూడా చేతులు కలిపి అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేయించారు..

## విజిలెన్స్ విచారణలో.. సంచలన ఆరోపణలు..

నాలాలు, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులే నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలకు మరో బలమైన ఆధారం బయటపడింది.. కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్ జీడిమెట్ల గ్రామ పరిధిలోని "ఫాక్స్‌సాగర్ సర్‌ప్లస్ నాలా బఫర్ జోన్‌లో" చేపట్టిన అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోలేకపోయినందుకు, జీహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ సర్కిల్లో అప్పటి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శ్రీమతి ప్రభావతిపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా శాఖాగత విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (విజిలెన్స్-2) శాఖ +.నా.౯.చీశీ.14 (తేదీ: 02-01-2026)ను విడుదల చేసింది.. విజిలెన్స్ నివేదిక ఏం చెబుతోంది..? విజిలెన్స్ విభాగం సమర్పించిన రిపోర్ట్ నెం.27 (18-02-2025) ప్రకారం.. మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల సర్వే నెం.234, ఫాక్స్ సాగర్ సర్‌ప్లస్ నాలా బఫర్ ల్యాండ్‌లో స్పష్టంగా నిషేధిత ప్రాంతమైన బఫర్ జోన్‌లోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, వాటిని అడ్డుకునే బాధ్యత కలిగిన టౌన్ ప్లానింగ్ అధికారి తగిన చర్యలు తీసుకోలేదని నివేదిక పేర్కొంది.. బఫర్ జోన్ నిర్మాణాలపై విజిలెన్స్ నివేదికలో నమోదు చేసిన వివరాల ప్రకారం.. పార్కింగ్ ప్రాంతంలో షటర్స్ నిర్మాణం, జనరేటర్ రూమ్ నిర్మాణం, వాచ్‌మన్ గది నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, బోర్‌వెల్ తవ్వకం కాంపౌండ్ వాల్ నిర్మాణం ఇవన్నీ నాలా బఫర్ జోన్‌లోనే జరిగినప్పటికీ, ప్రారంభ దశలోనే వాటిని నిలిపివేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందని ప్రభుత్వ అభిప్రాయం వ్యక్తం చేసింది.. రూల్ 20 కింద అధికారిక విచారణఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991- రూల్ 20 ప్రకారం, సంబంధిత అధికారిపై ఫార్మల్ డిపార్ట్‌మెంటల్ ఎన్‌క్వైరీ నిర్వహించాలని నిర్ణయించింది..

## రాతపూర్వక వివరణకు ఆదేశాలు..

15 రోజులలోపు రాతపూర్వక వివరణ సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఆరోపణలను అంగీకరించని అంశాలపై మాత్రమే విచారణ జరుగుతుందని, గడువు లోపల వివరణ ఇవ్వకపోతేలభ్యమయ్యే రికార్డులు, ఆధారాలను పరిగణలోకి తీసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

తెలంగాణ సివిల్ సర్వీసెస్ (కండక్ట్) రూల్స్, 1964 రూల్ 24ను ప్రస్తావిస్తూ,ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా రాజకీయ లేదా బయటి ప్రభావాన్ని ఉపయోగించేందుకు ప్రయత్నిస్తే,అది తీవ్ర నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. జీహెచ్ఎంసి కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు.. ఈ ఉత్తర్వుల ప్రతిని అధికారికి అందజేసి అదే తేదీతో కూడిన అంగీకార రసీదు తీసుకుని వెంటనే ప్రభుత్వానికి పంపాలని స్పష్టంగా పేర్కొంది.. ఈ విషయంలో జాప్యం వహిస్తే తీవ్రంగా

పరిగణిస్తామని హెచ్చరించింది.. ప్రజల్లో ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు ఎన్నో.. ఫాక్స్‌సాగర్ నాలా బఫర్ జోన్‌లో ఇన్ని నిర్మాణాలు జరిగే వరకు అధికారులు ఏం చేశారు..? అక్రమ నిర్మాణాల వెనుక ఎవరి సిఫార్సులు ఉన్నాయి..? ఇదే ప్రాంతంలో ఇంకా ఇలాంటి ఉల్లంఘనలు ఇంకెన్ని దాచిపెట్టారు..? చారిత్రక ఫాక్స్ సాగర్ నాలా కబ్జాలపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది..

# కార్తీకదీపం సరే... ముందు బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోండి

**హైదరాబాద్ , జనవరి 23, పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. ఈరోజు మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన... వ్యక్తిగత హననం జరుగుతోందని కేటీఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు.కేసీఆర్ కుటుంబం అలీబాబా-420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ స్టువర్ట్‌పురం దొంగల బ్యాచ్‌లా మారిందన్నారు. ఆరనీకుమా ఈ కార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోవాలని సెటైర్లు వేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యాస్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా తీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు.

కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్‌ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బీజేపీ నేతలపై ఉన్న ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని, అలాంటప్పుడు సినిమా వాళ్ల ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సినీ తారల ఫోన్లు ట్యాప్ చేయడం వెనుక ఉద్దేశం ఏంటని నిలదీశారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు.

కల్వకుంట్ల కవితను తాను ఎప్పుడూ చెల్లెలుగానే గౌరవిస్తానని, ఆమె ఇప్పటికైనా నిజాలు మాట్లాడుతున్నందుకు స్వాగతిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.

# పెట్టుబడుల వేటలో రేవంత్

**హైదరాబాద్ , జనవరి 23, పెన్ పవర్:** ఏ రాష్ట్రానికి అయినా సరే పెట్టుబడులు చాలా అవసరం. ఎందుకంటే పెట్టుబడుల ద్వారానే ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఉద్యోగాలను కల్పించే అవకాశం ఉంటుంది. ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ పెట్టుబడుల కోసమే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి దావోస్ వెళ్లిపోయారుడదావోస్ ప్రాంతంలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన పాల్గొంటున్నారు. తెలంగాణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవెలప్మెంట్, స్పోర్ట్స్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలతో మూడు జోన్ల నమూనాలను దావోస్ వేదికపై ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు విశ్లేషించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సిటీ నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందని శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తంచేశారు.తెలంగాణ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక అద్భుత ఫలితాలను ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ పరిపూర్ణ అనుకూలతలున్నాయని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి దావోస్ వేదికపై పారిశ్రామిక వేత్తలకు తెలిపారు.తెలంగాణ రైజింగ్ పేరుతో ఆయన పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 23 వేల కోట్ల పెట్టుబడిలను పెట్టేందుకు అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. డక్టైల్ ఐరన్ పైపుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా పేరున్న రష్మీ గ్రూపు తెలంగాణ రాష్ట్రంలో 12,500 కోట్ల పెట్టుబడితో స్టీలు ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయనుంది. స్లోవేకియ దేశానికి చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్ సంస్థ 6000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. స్మాల్ మాడ్యూల్ రియాక్టర్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ను తెలంగాణలో ఏర్పాటు చేయబోతోంది.సౌందర్య ఉత్పత్తుల తయారీలో పేరు ఎన్నికల లోరియల్ అనే సంస్థ 3500 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ టెక్ హబ్ ను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతోంది. అమెరికాలో విమానయాన రంగంలో పేరుపొందిన సర్గార్డ్ అనే సంస్థ.. దశలవారీగా 1 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది.. ఇందులో భాగంగా అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. రష్మీ గ్రూప్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 12,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా బీర్లను తయారు చేసే అతిపెద్ద కంపెనీగా పేరు తెచ్చుకున్న ఏబి ఇన్ బెవ్.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తన తయారీ యూనిట్ ను మరింత విస్తరించబోతోంది. దీనికోసం భారీగా పెట్టుబడులు పెట్టబోతోంది. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించబోతోంది. బ్లైజ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు దినకర్ మునగాల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో రీసెర్చ్ డెవలప్మెంట్ సెంటర్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.. త్వరలోనే హెల్త్ కేర్ డయాగ్నస్టిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్, ఆటో మేషన్, ఎనర్జీ ఎఫిషియన్సీ వంటి రంగాలలో పెట్టుబడులు పెడతామని దినకర్ వెల్లడించారు. గత ఏడాది జరిగిన సదస్సులో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. ఈసారి కూడా అదే స్థాయిలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నది.




# రాజకీయ రంగుపులుముకున్న నైనీ కోల్ మైన్స్

**హైదరాబాద్ , జనవరి 23, పెన్ పవర్:** నైనీ కోల్ మైన్స్ టెండర్ల విషయంలో సింగరేణి కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ్టి నుంచి తీసుకోవాల్సిన బిడ్స్ ని రద్దు చేస్తునట్లు ప్రకటించింది. పాలనాపరమైన కారణాలతో టెండర్లు రద్దు చేసినట్లు చెప్పింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో మరోసారి చర్చిస్తామని ఆ తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి అధికారులు తెలియజేశారు.ఇటు నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో సింగరేణి పాలక మండలిని కేంద్ర బొగ్గు గనుల శాఖ ప్రశ్నించింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలక మండలి ఎందుకు చర్చించలేదని అడిగింది. చర్చించి ఉంటే టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని, టెండర్ వేయాలనుకున్న కంపెనీలకు ఎందుకు సైట్ విజిట్ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ అడిగింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో చర్చించి మరోసారి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు సింగరేణి అధికారులు. కాగా.. బొగ్గు బ్లాక్ ల టెండర్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. నైనీ కోల్ మైన్స్ టెండర్స్ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణలో బొగ్గు గనుల టెండర్లపై రాజకీయ వివాదం చెలరేగింది. నైనీ బొగ్గు

గని టెండర్ నోటిఫికేషన్ ప్రభుత్వం రద్దు చేయడంతో ఒక్కసారిగా కోల్ వార్ మొదలైంది. నోటిఫికేషన్ రద్దుపై సీబీఐ విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. సీఎం రేవంత్ కి, బీజేపీకి చీకటి ఒప్పందం జరిగిందని.. అందుకే రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. సీఎం రేవంత్ బావమరిదికి లబ్ది చేకూర్చేందుకే సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన తెచ్చారని హరీశ్ రావు అంటున్నారు. బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు.సింగరేణి చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. బొగ్గు గనుల కేటాయింపులపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గనుల టెండర్లతో వివాదం మొదలైంది. రేవంత్ రెడ్డి బావమరిదికి లబ్ది కలిగించేందుకే తెలంగాణ ప్రభుత్వం టెండర్ల నిబంధనల్లో మార్పులు చేసిందని బీఆర్ఎస్ ఆరోపించింది. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే

కొత్త విధానం తెచ్చి గ్లోబల్ టెండర్లలో పాల్గొంటున్న వారి వివరాలు తెలుసుకుని వారు టెండర్లలో పాల్గొనకుండా చేసి రేవంత్ రెడ్డి బావమరిదికి టెండర్లు దక్కేలా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. అందులో భాగంగానే నైనీ బొగ్గు గనుల కేటాయింపు టెండర్లను భట్టి విక్రమార్క రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.నైనీ బొగ్గు గనుల టెండర్ల రద్దుతో పాటు ఇతర బొగ్గు గనుల కేటాయింపులపై సీబీఐ విచారణకు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ బావమరిది టెండర్ల విషయాన్ని బయటపెట్టినందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు.

## గురుకులాల్లో నాణ్యమైన విద్య, వసతులు: కలెక్టర్ ప్రావీణ్య

**పటాన్‌చెరు, జనవరి 23 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు అదనపు తరగతి గదులను ప్రారంభించారు. రూ.24 లక్షలతో నిర్మించనున్న డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన చేశారు. పాఠశాల భవనానికి రూ.14.5 లక్షలతో మరమ్మత్తులు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు.

## వెంకట్ రావు పటేల్ కుటుంబానికి నాగేష్ శెట్కార్ పరామర్శ

**నారాయణఖేడ్, జనవరి 23 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ నియోజకవర్గం, రుద్రారం గ్రామానికి చెందిన వెంకట్ రావు పటేల్ ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో, ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ శెట్కార్, నారాయణఖేడ్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు సాయిలు పటేల్, పండు, నాగేష్ యాదవ్, సాయిలు తదితరులతో కలిసి మృతుని కుమారుడు వినోద్ పటేల్ ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

## డీసీఎం బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

**మెదక్, జనవరి 23 పెన్ పవర్:** రాత్రి చౌటకూర్ మండలం సూల్తాన్‌పూర్ వద్ద సంగారెడ్డి-నాందేడ్ జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి పిట్లంలోకి వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వ్యాన్‌లోని వస్తువులు రోడ్డుపై పడిపోవడంతో రహదారి మూసుకుపోయి, కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు గంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికుల సహాయంతో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థిగా రత్నమాల ఆనంద్ కుమార్



**కల్వకుర్తి, జనవరి 23 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ రాజకీయాలు వేడెక్కాయి. మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ సతీమణి రత్నమాల 7వ వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. గత రెండు ఎన్నికల్లో చైర్మన్ పదవి చేజారడంతో, ఈసారి రత్నమాలను గెలిపించి పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ వర్గాలు వ్యూహరచన చేస్తున్నాయి.

## వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన పశువైద్యాధికారి

**ఆలంపూర్, జనవరి 23 పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి పురపాలిక పరిధి శాంతినగర్ జిఖ హైస్కూల్ విద్యార్థులతో మండలం పశువైద్యాధికారి డాక్టర్ స్వరూపరాణి శుక్రవారం సమావేశమయ్యారు. రాజ్యాంగంలోని 51o.ఉ విధి ప్రకారం వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని రక్షించాలని, జీవుల పట్ల కరుణ కలిగి ఉండాలని ఆమె సూచించారు. జంతు సంరక్షణ చట్టం గురించి వివరిస్తూ, పండుగలకు జంతువులను వధిస్తే గోరక్షణ చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. పందాలు, పోటీలు నిషేధమని, జంతువులను హింసించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏల్ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, ఓఎస్ రవికిరణ్, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

## నారాయణపేటలో యూత్ కాంగ్రెస్ బైక్ ర్యాలీ


**నారాయణపేట, జనవరి 23 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా యూత్ కాంగ్రెస్ సమావేశం యూత్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జిక్కిడి శివ చరణ్ రెడ్డి, పిసిసి మెంబర్ చిట్టెం అభిజిత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, మరియు ఇతర యువకులు, నాయకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## నేతాజీ ఆశయాలు యువతకు ఆదర్శం: ఎమ్మెల్యే

**జడ్చర్ల, జనవరి 23 పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ చూపిన ధైర్యసాహసాలు, త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. యువత ఆయన ఆశయాలను అందిపుచ్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## బాధితుల వద్దకే పోలీసులు - స్పాట్‌లోనే ఎఫ్ఐఆర్

**హైదరాబాద్, జనవరి 23, పెన్ పవర్:** మేడ్చల్ జిల్లాలోని దుండిగల్ పోలీసులు సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే మొట్టమొదటిసారిగా బాధితుల ఇంటి వద్దకే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి, అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి రికార్డు సృష్టించారు. సాధారణంగా ఏదైనా నేరం జరిగితే బాధితులే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది, కానీ దుండిగల్ పోలీసులు ఈ విధానానికి స్వస్తి పలికి బాధితుల ముంగిటకే సేవలను తీసుకొచ్చారు.దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాగిళ్ళపూర్, గ్రీన్ వుడ్స్ విల్లాలో నివాసముండే తుమ్మలపల్లి నాగేందర్ కృష్ణ చైతన్య తన కుటుంబంతో కలిసి సంక్రాంతి పండుగ కోసం విజయవాడ వెళ్లారు. జనవరి 20న తిరిగి వచ్చి చూడగా, ఇంటి వెనుక తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువా లాకర్ తెరిచి ఉంది. అందులోని రెండు కేజీల వెండి, 10 గ్రాముల బంగారం, రూ. 5 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు వెంటనే డయల్ 100 కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే దుండిగల్ డీఐ ఎం. బాల్ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చే అవసరం లేకుండా, వారి ఇంటి వద్దే ఫిర్యాదును స్వీకరించారు. అనంతరం అక్కడికక్కడే ఆన్‌లైన్ ద్వారా కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీని బాధితులకు అందజేశారు. పోలీసుల ఈ వేగవంతమైన స్పందన చూసి బాధితులతో పాటు స్థానికులు కూడా ఆశ్చర్యపోయారు.తమ విలువైన సొత్తు పోయిందన్న బాధలో ఉన్నప్పటికీ, పోలీసులు




సమయస్ఫూర్తితో వ్యవహరించి ఇంటి వద్దకే వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పట్ల బాధితుడు నాగేందర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసే క్రమంలో సైబరాబాద్ కమిషనరేట్ చేపట్టిన ఈ సరికొత్త విధానంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్య వల్ల బాధితులకు పోలీసులపై నమ్మకం పెరగడమే కాకుండా, దర్యాప్తు ప్రక్రియ కూడా వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# మేడారంలో తొలి ఘట్టం.. మండమెలిగే




**వరంగల్ , జనవరి 23, పెన్ పవర్:** మేడారం మహాజాతరకు సరిగ్గా వారం రోజుల ముందు నిర్వహించే తొలిఘట్టం మండమేలిగే పండుగ మహా వైభవంగా జరిగింది. ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ఆ కార్యక్రమం నిర్వహించారు. దృష్టశక్తుల చూపు మేడారం వైపు పడకుండా దిగ్బంధం చేసి కోడిపిల్లను బలిచ్చి ఊరుకట్టు నిర్వహించారు. మాఘశుద్ధ పంచమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకతో మేడారం జాతర ప్రారంభమైనట్టే భావిస్తారు. మండమెలిగే పండుగ నుంచి సరిగ్గా వారం రోజులకు అమ్మవార్లు వనం నుండి జనంలోకి వస్తారు.మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర సమీపిస్తోంది. జనవరి 28 నుండి 31వ తేదీ వరకు మాఘశుద్ధ పున్నమి వెన్నెల్లో సమ్మక్క సారక్క దేవతల గద్దెలపై కొలువు దేరే గడియలు ఆసన్నం అవుతున్నాయి. మహా జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు ఆదివాసీలు ఆచార సాంప్రదాయాల ప్రకారం నిర్వహించే మండమెలిగే పండుగ ముగిసింది. ఈ సందర్భంగా సమ్మక్క సారక్క పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. మేడారంలో సమ్మక్క తల్లి, కన్నెపల్లిలో సారలమ్మ. పూనుగొండ్లలో పగిడిద్దరాజు, కొండాయిలో గోవిందరాజు ఆలయాల్లో ఆదివాసీలు పూజలు నిర్వహించారు.

మండమెలిగే వేడుకలో ఆదివాసీ ఆచార సాంప్రదాయాల ప్రకారం మేడారం పొలిమేరల్లో పూజారులు దిష్టి తోరణాలు కట్టారు. కోడిపిల్లను బలిచ్చి ఊరు చుట్టూ తోరణాలు కట్టడం వల్ల ఎలాంటి దుష్టశక్తులు దరి చేరవని ఇక్కడి పూజారుల విశ్వాసం.మేడారం పొలిమేరల్లో మామిడి, తునికి ఆకులతో తోరణాలు కట్టారు. ఊరు చుట్టూ చలిగంజి, అంబలితో కట్టు పోస్తారు. ఆ తరువాత సమ్మక్క సారలమ్మకు సంబంధించిన పూజా సామగ్రిని మేడారం గద్దెలపైకితీసుకొచ్చి పూజలు నిర్వహిస్తారు. పసుపు, కుంకుమలతో పూజలు చలపయ్య మొక్కులు సమర్పిస్తారు. ఆ తరువాత పూజారులంతా. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి, పూజా కార్యక్రమాలు చేసి కొత్త వస్త్రాలతో గద్దెలను అలంకరిస్తారు. ఈ తంతు నిర్వహించడం ద్వారా జాతరకు అంకురార్పణ జరిగినట్లు బావిస్తారు. పూజలు పూర్తయిన తర్వాత జాగారాలు కూడా చేపడుతారు. ఈ సందర్భంగా ఇవ్వాల రాత్రి నుండి రేపు తెల్లవారుజాము వరకు అమ్మవారి గద్దెల వద్దకు భక్తులు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు.మండెమెలిగే పండుగతో జాతర ప్రారంభమైనట్టేనని భావిస్తారు. పుట్టమట్టితో అలికి ముగ్గులు కూడా వేశారు. సమ్మక్క- సారలమ్మ ఆయుధాలు, గజ్జెలు, కత్తులు, కుంకుమ భరిణెలు, ఇతర పూజా సామగ్రిని శుద్ధి చేస్తారు. అనంతరం మేడారం లోని సమ్మక్క ప్రధాన పూజారి ఇంటి నుంచి డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమలతో మేడారం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు.. అక్కడి నుంచి సమ్మక్క గుడికి వెళ్లి గిరిజన ఆడపడుచులు పూజలు చేస్తారు. ఆ తరువాత గ్రామ బొడ్రాయికి శుద్ధ జలంతో అభిషేకాలు చేశారు.

# వైభవంగా నాగోబా ఆలయంలో పూజలు

**ఆదిలాబాద్: పెన్ పవర్:** ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లోని నాగోబా ఆలయంలో ఆ ఆదిశేషుడికి అంగరంగ వైభవంగా పూజలు కొనసాగుతున్నాయి. జాతర లో మూడో రోజున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భారి సంఖ్యలో భక్తులు పోటెత్తడంతో క్యూ లైన్ లన్ని కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జాతరలో భాగంగా ఈ రోజు ప్రజా దర్బార్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన దేవాదాయ శాఖ మంత్రి కొనడా సురేఖ కు పూర్ణ కుంబ స్వాగతం పలుకగా ,,, నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించరు మంత్రి. ఆనంతరం దర్బార్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఆదివాసీలు సమ్మక్క, సారలమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసుల అభ్యువృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఇఒప్పతికె నాగోబా ఆలయ అభివృద్ధికి నిర్మల్ సభలో 22 కోట్లను కేటాయిస్తామని సియం.రేవంత్ రెడ్డి ప్రకటించారని,, త్వరలోనే ఆలయ అభివృద్ధికి నిదులను కేటాయిస్తామని తెలిపారు. నాగోబా ఆలయం వద్ద భక్తులకు మెరుగైన సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనతో పాటు ఆలయ పరిసరాల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగించనున్నట్లు తెలిపారు. నాగోబా చరిత్ర తరతరాలకు ఆదర్శం అన్నారు. నాగోబా పూజారులకు ధూప, దీప, నైవేద్యం పథకం కింద నాగోబా ఆలయంలో పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందికి ప్రభుత్వం తరఫున వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దేవాలయంలో

సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన సంప్రదాయ దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. 1942 నుంచి కొనసాగుతున్న నాగోబా దర్బార్ ప్రధాన ఉద్దేశ్యం ఆదివాసీల అర్జీల పరిష్కారమేనని అన్నారు. ఆదివాసుల నుంచి వచ్చిన ప్రతి అర్జీలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. అటవీ భూముల సమస్యలు, పోడు భూముల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. దర్బార్ కార్యక్రమంలో ఆదివాసీలు చేసిన సాంప్రదాయ నృత్యాలు అందరిని అలరించాయి...

# మంత్రులకు మున్సిపల్ టెన్షన్ ఇంచార్జ్ మంత్రులకు సెగ

**కరీంనగర్, జనవరి 23, పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలపై సీరియస్ ఫోకస్ పెట్టింది అధికార హస్తం పార్టీ. మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడమే టార్గెట్‌గా పావులు కదుపుతోంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల బాధ్యులను ప్రకటించింది పార్టీ. మున్సిపల్ ఎన్నికలు జరగనున్న 15 పార్లమెంట్ నియోజకవర్గాలకు 15 మంది మంత్రులను ఇంచార్జ్‌లను నియమించారు సీఎం రేవంత్. నియోజకవర్గాల వారీగా మంత్రులు సన్నాహక సమావేశాలు పెట్టాలని సూచించారు ముఖ్యమంత్రి.అయితే ఇంచార్జ్ మంత్రులకు అప్పుడే సెగ మొదలైంది. అధికార పార్టీ తరఫున పోటీ కోసం తీవ్రస్థాయిలో పోటీ ఉందని మంత్రుల దృష్టికి వచ్చింది. కొత్త, పాత కాంగ్రెస్ నేతలు టిక్కెట్ల కోసం వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారు. ఈ క్రమంలోనే గాంధీభవన్‌లో జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం రసాభాసాగా మారింది. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వర్సెస్ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మధ్య ఇప్పటికే ఉప్పు-నిప్పులా ఉన్న వ్యవహారం కాస్త..సన్నాహక సమావేశం సాక్షిగా మరోసారి దుమారం రేగింది.ఏకంగా సంజయ్ ఉన్న మీటింగ్‌కు తాను హాజరుకాబోనని సమావేశం నుంచి బయటికి వచ్చి రచ్చ చేశారు మాజీమంత్రి జీవన్‌రెడ్డి. ఈ పరిస్థితుల్లో అభ్యర్థుల ఎంపిక మంత్రులకు పెద్ద సవాల్‌గా మారింది. పోటీ చేయనున్న ప్రతి స్థానానికి ఆరుగురు పేర్లతో లిస్ట్ రెడీ చేయాలని మంత్రులను పీసీసీ చీఫ్, సీఎం ఆదేశించారు. అయితే ఒక్కో స్థానం నుంచి ఇరవై మందికిపైగా ఆశావహులు ఉండటంతో తలలు పట్టుకుంటున్నారు నేతలు.మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే వర్గం, ఎంపీ వర్గం, డీసీసీ అధ్యక్షుడి వర్గం, పీసీసీ వర్గం, ఇంచార్జ్ మంత్రి వర్గం, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మంత్రి వర్గం అంటూ డజన్ల మంది ఆశావహులు టికెట్ రేసులో ఉన్నారు. ఇక ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా ఉంది. జగిత్యాల, పటాన్ చెరు, గద్వాల్, బాన్సువాడ వంటి చోట్ల ఎవరికి టికెట్ రాకపోయినా మిగతా వర్గాల వాళ్లతో కలిసి..పార్టీ టికెట్ ఇచ్చిన వారికి వ్యతిరేకంగా పనిచేసేలా క్లాషెస్ ఉన్నాయట. దీంతో మంత్రులకు కొత్త భయం పట్టుకుందట.పంచాయతీ ఎన్నికల్లో తక్కువ స్థానాలు వచ్చిన చోట పార్టీ నేతల తప్పిదాలపై సీఎం రేవంత్ బాధ్యులపై సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి మిస్టేక్ జరిగినా తమపై ఎఫెక్ట్ పడుతుందని మంత్రులు ఆందోళన చెందుతున్నారట. గతంలో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు..లోకల్ పోరులో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఇద్దరు మంత్రులు మారెప్ప, మాగంటి బాబులు రాజీనామా చేశారు. దీంతో ఇప్పుడు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ బాధ్యతలు తీసుకున్న మంత్రులకు ఈ ఎన్నికలు డూ ఆర్ డై అన్నట్లుగా మారాయట.పార్టీ ఇచ్చిన టార్గెట్ రీచ్ అయ్యేందుకు కష్టపడి పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నప్పటికీ, టికెట్ కోరుతున్న ఆశావహుల సంఖ్యను చూసి నేతలందరూ తలలు పట్టుకుంటున్నారట. ఒక్కో స్థానానికి డజను మంది నేతలు టికెట్ కోసం ట్రై చేస్తుండటం..మరోవైపు గ్రూప్ వార్ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక అతిపెద్ద సమస్యగా మారిందట. ఇక టికెట్ ఎంపిక కోసం కమిటీ వేస్తున్నామని, అభ్యర్థుల ఎంపిక బాధ్యత పూర్తిగా కమిటీ చూసుకుంటుందని పీసీసీ చీఫ్ ప్రకటించారు. అయితే కొత్తగా ప్రకటించిన ఇంచార్జ్ మంత్రులు మాత్రం అభ్యర్థుల ఎంపిక తమతో కాదని చేతులెత్తేస్తున్నట్లు టాక్.మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని హస్తం నేతలు భావిస్తున్నప్పటికీ ఆశావహుల పోటీ, గ్రూప్ తగాదాలు పార్టీకి నష్టంగా మారే ప్రమాదముందట. పంచాయతీ ఎన్నికల్లో రెబల్స్ వల్లే హస్తం పార్టీ అనుకున్న టార్గెట్ ను రీచ్ కాలేదంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికల్లో వర్గపోరుకు చెక్ పెట్టి టికెట్ కేటాయింపులు ఎలా చేస్తుందో చూడాలి మరి

**సంజయ్ కే ప్రియారిటీ**

గత అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి డాక్టర్ సంజయ్ ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ మారారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో అధికార పార్టీలో చేరిపోయారు. అప్పట్లో డాక్టర్ సంజయ్ చేరికను జీవన్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. తన ఇలాఖాలో ఎమ్మెల్యే సంజయ్‌ను ఎలా చేర్చుకుంటారంటూ పార్టీ పెద్దలను నిలదీశారు. ఒకనొక దశలో పార్టీనుంచి బయటకు వెళ్లిపోతానంటూ హైకమాండ్ పెద్దలకు వార్నింగ్ ఇచ్చారు. చివరకు పార్టీ నేతలు రంగంలోకి దిగి.. సర్దిచెప్పడంతో వెనక్కి తగ్గారు. కానీ కొద్దిరోజులుగా మాత్రం ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. అందుకే మరోసారి డాక్టర్ సంజయ్‌ను జీవన్ రెడ్డి టార్గెట్ చేసినట్టు ప్రచారం సాగుతోంది..

ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ఫైట్ ఇద్దరి మధ్య మంటలు రాజేస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనంటూ ప్రకటించుకున్న డాక్టర్ సంజయ్ కుమార్.. కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ ఎలా ఇస్తారంటూ జీవన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. అసలు కాంగ్రెస్ పార్టీతో ఎమ్మెల్యే సంజయ్ కి సంబంధమే లేదని ఆయనే అంటున్నారు. కేవలం జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసమే తాను ముఖ్యమంత్రితో కలిసి పనిచేస్తున్నాను అని ఎమ్మెల్యే చెబుతున్నారు. అలాగే తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నట్టు అఫిడవిట్ కూడా సమర్పించారు. అలాంటప్పుడు ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎలా అవుతారంటూ ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలల్లో జోక్యాన్ని సహించేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలలో అభ్యర్థులకు బీఫామ్ ఇవ్వడానికి సంజయ్ ఎవరంటూ ప్రశ్నించడం హాట్ టాపిక్ అవుతోంది. ఇక్కడితోనే ఈ వ్యవహారాన్ని జీవన్ రెడ్డి వదిలిపెట్టలేదు. అసలు జగిత్యాల మున్సిపల్ లో ఏం జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. తాజాగా జగిత్యాలలోని బీట్ బజార్ లో ఉన్న వ్యవసాయ సమీకృత వెజ్- నాన్ వెజ్ మార్కెట్లో ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్ నిల్వ ఉంచిన సిమెంట్, ఇసుకలను ఎలా నిల్వ చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇది సమీకృత మార్కెటా లేక ఒక కాంట్రాక్టర్ గోదామా అని మండిపడ్డారు. గతంలో కేటీఆర్ చేతులమీదుగా మార్కెట్ ను ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎమ్మెల్యే రాజ్యమే నడుస్తోంది. అప్పుడు ఆయన ఎమ్మెల్యే ఇప్పుడు కూడా ఆయనే ఎమ్మెల్యే.. అభివృద్ధి ప్రదాత చేస్తున్న అభివృద్ధి ఇది.. ఇదే నా అభివృద్ధి అని ప్రశ్నిస్తున్నారు.. అయితే జీవన్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకే ఇబ్బందిగా మారుతోంది. ఆయన తీరు సీఎం రేవంత్ రెడ్డితో పాటు.. సిట్టింగ్ ఎమ్మెల్యేను ఇబ్బంది పెట్టేలా కనిపిస్తోంది. దాంతో జీవన్ రెడ్డికి చెక్ పెట్టాలని ఎమ్మెల్యే సంజయ్ వర్గం కోరుతున్నట్టు తెలుస్తోంది. కానీ జీవన్ రెడ్డి మాత్రం.. తన తీరు మార్చుకోవడం లేదు. గతంలోనే మంత్రిగా, ఎంపీ, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా అనేకమార్లు అవకాశం ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ జగిత్యాలలో ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారు. అయినప్పటికీ ఆయన ఓడారు. ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు జరిగితే.. నిజామాబాద్ ఎంపీగా అవకాశం కల్పించారు. అక్కడ ఓడిపోయారు. ఇప్పటికి డజన్‌కు పైగా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు దక్కాయి. ఇన్ని అవకాశాలు ఎవరికి దక్కలేదు. అయినప్పటికీ.. కన్నతల్లి లాంటి సొంత పార్టీపై విషం చిమ్మితే ఎలా అని పార్టీ హైకమాండ్ సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి.. జగిత్యాల లీడర్ పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. 75 ఏళ్ల వయసులో ఇంత చాదస్థం ఇంత చాదస్థం అవసరమా అని ప్రశ్నించినట్టు టాక్ వినిపిస్తోంది. మొత్తంమీద మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని లైట్ తీసుకోమంటూ పార్టీ నుంచి ఆదేశాలు వచ్చాయని తెలుస్తోంది. ఇకమీదట జీవన్ రెడ్డిని పూర్తిగా పక్కన పెట్టాలంటూ జగిత్యాల నేతలకు కూడా సూచించారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పలుమార్లు అవకాశాలు దక్కాయి.. భవిష్యత్తులో చాన్స్ ఇద్దామని పార్టీ పెద్దలు భావించారు. కానీ ఆ మాత్రం ఓపిక లేకపోతే ఎట్టా అని పార్టీ హైకమాండ్ ప్రశ్నించిందట. ఇయితే ఇన్నాళ్లు ఎమ్మెల్యే సంజయ్ ను విమర్శించొద్దని హెచ్చరించినా ఆయన మాత్రం తగ్గడం లేదు. దాంతో ఆయనకు చెక్ పెడితేనే జగిత్యాలలో కాంగ్రెస్ కు భవిష్యత్తు అని టీపీసీసీ వర్గాలు సైతం అభిప్రాయానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మొత్తానికి పెద్దాయన చాదస్థం వీడి.. పార్టీ లైన్‌లో పనిచేస్తారా.. లేక మారేది లేదు అన్నట్టుగా వ్యవహరిస్తారా అనేది తెలియాలంటే మాత్రం కొద్దిరోజులు ఆగాల్సిందే..

# ఫోన్ ట్యాపింగ్ కేసు: గులాబీ బాస్‌కు నోటీసులు?

**హైదరాబాద్, జనవరి 23, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం కీలక మలుపులు తిరుగుతోంది. దర్యాప్తు సంస్థ తన విచారణ పరిధిని విస్తరిస్తుండటంతో, తదుపరి నోటీసులు ఎవరికి అందబోతున్నాయనే అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్ తో పాటు ఆయన కుమార్తె కవితల చుట్టూ ఈ విచారణ తిరిగే అవకాశం ఉందన్న వార్తలు రాజకీయ సెగను పెంచుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకోవడంతో బీఆర్ఎస్ లో గుబులు మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు సొంత పార్టీ నేతల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలపై సిట్ లోతుగా విచారణ జరుపుతోంది. ఇప్పటికే పలువురు ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు జైలులో ఉండగా, రాజకీయ నాయకుల ప్రమేయంపై సిట్ దృష్టి సారించింది. ఇటీవలే బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. ట్యాపింగ్ వ్యవహారంలో పట్టుబడిన అధికారులతో ఆయనకు ఉన్న సంబంధాలు, ఆ సమయంలో జరిగిన పరిణామాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. హరీశ్ రావు విచారణ అనంతరం, తదుపరి లక్ష్యం ఎవరనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తదుపరి దశలో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. గతంలోనే తన ఫోన్ ట్యాపింగ్ అవుతోందని, తన వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లిందని కవిత పలుమార్లు ఆరోపణలు చేశారు. ఇప్పుడు కూడా ఆమె తన ఆరోపణలకు కట్టుబడి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆమెను బాధితురాలిగా పరిగణించి వాంగ్మూలం తీసుకుంటారా? లేక ఈ వ్యవహారంలో ఆమెకు తెలిసిన ఇతర సమాచారం కోసం విచారిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ కవితను విచారిస్తే, అది కేసును మరిన్ని కొత్త కోణాల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది. ఈ కేసులో అత్యంత హాట్ టాపిక్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు అందబోతున్నాయనే ప్రచారం. ఫోన్ ట్యాపింగ్ వంటి అత్యంత సున్నితమైన వ్యవహారం అప్పటి ముఖ్యమంత్రికి తెలియకుండా జరిగే అవకాశం లేదని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే అరెస్టయిన పోలీస్ అధికారులు ఇచ్చిన వాంగ్మూలాల్లో "పైస్థాయి ఆదేశాల" గురించి ప్రస్తావించినట్లు



వార్తలు వస్తున్నాయి. ఆ 'పైస్థాయి' ఎవరనేది నిరూపించే పనిలో సిట్ ఉంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ హాజరయ్యారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా ఆయనను విచారణకు పిలిస్తే, బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన మొదలయ్యే అవకాశం ఉంది. ఒకవేళ కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిస్తే తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలపై రాజీ లేని పోరాటం చేస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చూస్తోంది. దీనిని పూర్తిగా 'రాజకీయ కక్ష సాధింపు' చర్యగా బీఆర్ఎస్ అభివర్ణిస్తోంది. విచారణల పేరుతో తమ పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నారని గులాబీ నేతలు ఆరోపిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కేవలం అధికారులకే పరిమితం కాకుండా, రాజకీయ అగ్రనేతల గడప తట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకవేళ కేసీఆర్, కవితలకు నోటీసులు అందితే, అది తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక కీలక మలుపు అవుతుంది. సిట్ సేకరించిన ఆధారాలు ఎంత బలంగా ఉన్నాయనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంపై మరో అప్డేట్.. రూల్స్‌లో మార్పులు చేసిన ప్రభుత్వం.. ఇకపై మహిళలు..

**హైదరాబాద్, జనవరి 23, పెన్ పవర్:** మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి మహిళలు జీరో టికెట్ పొందేందుకు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డులు లాంటి ప్రభుత్వ గుర్తింపు ధృవీకరణ పత్రాలను చూపించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు మహిళల ఆధార్ కార్డులను చెక్ చేసి కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తున్నారు. అయితే ఆధార్ కార్డుల్లో పాత ఫోటోలు ఉండటంతో మహిళలను గుర్తించడం కండక్టర్లకు కష్టతరంగా మారింది. దీంతో కండక్టర్లు, మహిళల మధ్య వాగ్వాదాలు జరుగుతున్న సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. దీనికి చెక్ పెట్టి మహిళలు సులభతరంగా బస్సుల్లో ప్రయాణించేందుకు కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్దమైంది. ఇందుకోసం మహిళలకు ప్రత్యేక ఐడీ కార్డులను ఇవ్వనుంది.త్వరలో రాష్ట్రంలోని మహిళలందరికీ మహాలక్ష్మి ఐడీ కార్డ్‌లను పంపిణీ చేయనుంది. మహిళలు బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం పొందేందుకు ఇవి ఒక ఐడీ కార్డులా ఉపయోగపడతాయి. ఈ కార్డులపై మహిళ ఫోటోతో పాటు పేరు, గ్రామం, మండలం, జిల్లా వంటి అడ్రస్ వివరాలు పొందుపర్చి ఉంటాయి. అలాగే ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు అత్యాధునిక చిప్ ఉంటుంది. కండక్టర్ల వద్ద ఉండే మెషిన్‌తో స్మార్ట్ కార్డులపై ఉండే చిప్‌ను స్కాన్ చేయగానే ప్రయాణ వివరాలు నమోదవుతాయి. దీని వల్ల మహిళలు ఆధార్ కార్డును చూపించాల్సిన అవసరం లేదు. తమ దగ్గర ఆధార్ కార్డును క్యారీ చేయాల్సిన పని ఉండదు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా సులువుగా మహిళలు ప్రయాణం చేయవచ్చు.ప్రతీ ఒక్క వ్యక్తికి ఆధార్ ప్రత్యేక నెంబర్ ఉన్నట్లుగానే.. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రతీ మహిళకు ఒక 16 అంకెల విశిష్ట నెంబర్‌ను కేటాయిస్తారు. కార్డు ముందు భాగంలో మహిళ ఫొటో, అడ్రస్ వివరాలు ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల తయారీ ఇప్పటికే ప్రారంభమవ్వగా.. త్వరలో ముద్రణ పూర్తి కానుంది. కార్డుల తయారీ కోసం రూ.75 కోట్ల నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రంలోని 1.5 కోట్ల మంది మహిళలకు కార్డులు అందించనున్నారు. తొలుత 5 లక్షల కార్డులను పైలట్ ప్రాజెక్ట్ కింద జారీ చేయనుండగా.. ఆ తర్వాత మిగతా లబ్దిదారులకు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి అందరీ వివరాలు గతంలో సేకరించింది. ఈ వివరాల ఆధారంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు లబ్దిదారులను ఎంపిక చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది

## 4వ డివిజన్ లో పీహెచ్సీని ప్రారంభించిన మంత్రి

**ఖమ్మం, జనవరి 23పెన్ పవర్:** ఖమ్మం 4వ డివిజన్ ఖానాపురం బాలాజీ నగర్ లో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైద్యులు రోగులను తల్లి బిడ్డలను ఆప్యాయంగా చూసినట్లు చూడాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక వసతులతో పాటు పచ్చదనం కూడా ఉండాలని, ఖమ్మం నగరం విద్య, వైద్య రంగాల్లో అగ్రభాగాన నిలవాలని ఆకాంక్షించారు. ఖమ్మం నగరాన్ని క్లీన్ గ్రీన్ స్మార్ట్ నగరంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

## రోడ్డు భద్రతా నియమాలపై ఎమ్మెల్యే ప్రతిజ్ఞ

**వైరా, జనవరి 23 పెన్ పవర్:** వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ, రహదారి నిబంధనలు పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. శుక్రవారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్ వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాహనదారులతో రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిజ్ఞ చేయించిన ఎమ్మెల్యే, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

**సత్తుపల్లి, జనవరి 23 పెన్ పవర్:** పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణం వెంగళరావు నగర్ కాలనీలో లబ్ధిదారులు వర్గుటి సుధాకర్, భాగ్యలక్ష్మి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని గృహప్రవేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ: పాలేరులో సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**పాలేరు, జనవరి 23 పెన్ పవర్:** ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల గ్రామంలో పాలేరు నియోజకవర్గ పరిధిలో రెండు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి సతీష్, ఉపసర్పంచ్ దావుద్, జిల్లా నాయకులు బండి జగదీష్, గడ్డం వెంకన్నతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు ఈ చెక్కులు అందజేశారు.

## నర్సంపేటలో నేతాజీ జయంతి: బీజేపీ నివాళులు

**నర్సంపేట, జనవరి 23 పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ మాట్లాడుతూ, "స్వాతంత్ర్యం అంటే అడిగి తీసుకునే బిక్ష కాదు.. పోరాడి సాధించుకునే హక్కు" అని నేతాజీ మాటలను గుర్తు చేశారు. "మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వేచ్ఛనిస్తాను" అనే నినాదం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మంత్రంలా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమం ఉమ్మడి వరంగల్ జిల్లా, నర్సంపేటలో జరిగింది.

## మేడారం జాతరలో హెలికాప్టర్ సందడి: మంత్రి సీతక్క ప్రారంభం

**ములుగు, జనవరి 23 పెన్ పవర్:** ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర కోసం హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దానసరి అనసూయ (సీతక్క) ప్రారంభించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతర అభివృద్ధి చెంది, ఇప్పుడు భక్తులు హెలికాప్టర్లలో వచ్చే స్థాయికి చేరుకోవడం సంతోషకరమని మంత్రి తెలిపారు. గతంలో ఎడ్ల బండ్లపై వచ్చేవారని, కాలక్రమేణా కార్లు, బస్సులు, ఇప్పుడు హెలికాప్టర్లు అందుబాటులోకి వచ్చాయని ఆమె పేర్కొన్నారు.

## వరద కాలువ పనులు ఆపడం కాంగ్రెస్ అసమర్థత: చల్లా ధర్మారెడ్డి

**పరకాల, జనవరి 23 పెన్ పవర్:** వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ వరద కాలువలు బలోపేతం చేసే పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం దురదృష్టకరమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన కాలువను పరిశీలించి, పరిశ్రమల శాఖ ద్వారా రూ.160.92 కోట్ల పరిపాలనా ఆమోదం పొంది, టెండర్లు పిలిచి పనులు ప్రారంభించినా, నిధుల కొరతతో ఆగిపోవడం కాంగ్రెస్ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. గత రెండు వర్షాకాలాల్లో పార్కు మునిగిపోవడం, నిధులు లేక పనులు ఆగిపోవడం ఆందోళనకరమన్నారు.

## కొడుకులు సాకడం లేదని ఊరికి ఆస్తి రాసిచ్చిన వెంకటేశ్వర్

**వరంగల్ వెస్ట్, జనవరి 23 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో, గ్రామస్థుల సేవలకు కృతజ్ఞతగా పురోహితులు నాగిళ్ల వెంకటేశ్వర్ తన 4.38 ఎకరాల భూమిని గ్రామపంచాయతీకి దానం చేశారు. తన వృద్ధాప్యంలో కుమారులు పట్టించుకోకపోవడంతో, గ్రామస్థులు తన బాగోగులు చూసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు గ్రామపెద్దల సమక్షంలో ఆయన భూమిని దానం చేశారు.

## అక్షర శక్తి కాలమానిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు

**వర్ధన్నపేట, జనవరి 23 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలో శుక్రవారం రోజున వర్ధన్నపేట శాసనసభ సభ్యులు కే.ఆర్. నాగరాజు చేతుల మీదుగా అక్షర శక్తి కాలమానిని ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి ఆవాల రాధికా రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘు చందర్, బిల్లా రవీందర్, కుర్ల మోహన్, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు రొడ్డ దయాకర్, అక్షర శక్తి రిపోర్టర్ సుధమల్ల శ్రీనివాస్, మడికొండ ఎస్.హెచ్.ఓ పుల్యాల కిషన్, అంకుష్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు 4 క్యాంపులు, బస్సు సర్వీసులు ప్రారంభం

**భూపాలపల్లి, జనవరి 23 పెన్ పవర్:** మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం భూపాలపల్లి డిపో పరిధిలో 4 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఆమంచ ఇందు తెలిపారు. భూపాలపల్లి, కాటారం, కాళేశ్వరం, సిరోంచ లలో ఈ క్యాంపులు ఏర్పాటు చేశారు. భూపాలపల్లి క్యాంపు 25వ తేదీ నుండి, మిగిలిన క్యాంపుల నుండి 26వ తేదీ నుండి బస్సు సర్వీసులు నడుస్తాయని ఆయన పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

## నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతి



**ఆదిలాబాద్, జనవరి 23 పెన్ పవర్:** శుక్రవారం ఆదిలాబాద్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కన్వీనర్ నిఖిల్ మాట్లాడుతూ, యువత నేతాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ రాళ్లబండి మహేందర్తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ టికెట్ ఇవ్వకుంటే వేరే దారి.. కౌన్సిలర్ అభ్యర్థుల ఒత్తిడి!!

**బోథ్, జనవరి 23పెన్ పవర్:** అధికార కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్ టికెట్లు ఆశిస్తున్న అభ్యర్థుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. టికెట్ దక్కకపోతే ఇతర పార్టీల వైపు చూస్తామని కొందరు పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ మున్సిపాలిటీలలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. కొందరు సీనియర్ కాంగ్రెస్ సభ్యులు, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా టికెట్ల విషయంలో ఇతర పార్టీల వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది.

## నిర్మల్ పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

**నిర్మల్, జనవరి 23పెన్ పవర్:** నిర్మల్ పట్టణంలోని పాఠశాలలో వసంత పంచమి వేడుకలు జనవరి 23, 2026న ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు వేద పండితులచే అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల జోనల్ ఇంచార్జ్‌లు నగేశ్, శిరీష చిన్నారులకు స్లేట్ కిట్లు అందించి, వారి జీవితం జ్ఞానం, సంస్కృతి, ఆనందంతో ప్రకాశించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ అర్చన, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించిన హోంగార్డులు

**ముథోల్, జనవరి 23పెన్ పవర్:** వసంత పంచమి సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన మంచిర్యాల జిల్లాకు చెందిన తిరుపతి అనే భక్తుడు శుక్రవారం క్యూలైన్‌లో అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. విధుల్లో ఉన్న హోంగార్డులు ఇంద్రకరణ్ రెడ్డి, గణేష్, నారాయణ వెంటనే స్పందించి సీపీఆర్ చేసి, ప్రథమ చికిత్స అందించి, ఆసుపత్రికి తరలించారు. హోంగార్డుల సత్వర స్పందన, బాధ్యతాయుతమైన సేవలను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

## చొప్పదండి జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహణ



**చొప్పదండి, జనవరి 23పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు చిన్నారులకు అక్షర శ్రీకారం చుట్టగా, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. చొప్పదండితో పాటు పలు జిల్లాల నుండి వచ్చిన భక్తులు అక్షరాభ్యాసాలు చేసుకున్నారు.

## నలంద ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం: సురభి నవీన్ కుమార్ శుభాకాంక్షలు

**కరీంనగర్, జనవరి 23(పెన్ పవర్:** వసంత పంచమి సందర్భంగా కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలోని ప్రెస్టేజ్ పార్కు వద్ద నలంద ఇంటర్నేషనల్ అఖాఅ డే ఒ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్, స్కూల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి, బిజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సుభాష్ చంద్రబోస్ జయంతి: యువతకు స్ఫూర్తిగా నిలవాలని బీఎంఎస్ పిలుపు

**మానకొండూరు, జనవరి 23పెన్ పవర్:** కరీంనగర్ పట్టణంలోని సుభాష్ నగర్ లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అందరికీ పరాక్రమ్ దివస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, యువకులందరూ సుభాష్ చంద్రబోస్ ను ఆదర్శంగా తీసుకోవాలని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి తోర్త శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆయన జీవితం, దేశభక్తి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు.

## మానకొండూరులో నేతాజీకి ఎమ్మార్వో సురేఖ ఘన నివాళి

**హుజూరాబాద్, జనవరి 23పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మార్వో సురేఖ నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 'నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్ ను నిర్మించారని, ఈ స్వాతంత్ర్యం కోసం ఆయన కీలక పాత్ర పోషించారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, ఆర్ఐలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 188 మెడల్స్ అందజేత

**సిరిసిల్ల, జనవరి 23పెన్ పవర్:** వీర్నపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఆర్మీ జవాన్ గంగావత్ శ్రీకాంత్ 188 మెడల్స్ ను వితరణ చేశారు. ఈ మెడల్స్ ను సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్ కుమార్, ఎస్సై వేముల లక్ష్మన్ చేతుల మీదుగా హైస్కూల్ హెచ్ ఎం శ్రీనివాస్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, ఉప సర్పంచ్ జక్కుల నరేష్, సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు భగవంత్, సంజీవ్, గోరెమియ, దేవా లక్ష్మి, నాయకులు నవీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై లక్ష్మణ్‌ను సర్పంచ్ ఫోరం సన్మానించింది

**వేములవాడ, జనవరి 23పెన్ పవర్:** వీర్నపల్లి మండల కేంద్రంలో స్థానిక ఎస్సై వేముల లక్ష్మణ్‌ను సర్పంచ్ ఫోరం అధ్యక్షులు సామల్ల దేవరాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి సత్కరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ పొన్నం దేవరాజ్, నాయకులు పాల్గొన్నారు.

## నేతాజీ ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం



**మేడ్చల్, జనవరి 23పెన్ పవర్:** మేడ్చల్ డివిజన్లోని రాయిలాపూర్ గ్రామంలో, మేడ్చల్ పట్టణంలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సముద్రాల హంస కృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'మరణం లేని మహానుభావుడు మన నేతాజీ అని సమాజాన్ని చైతన్యపరిచి, ఆలోచనా విధానాన్ని మార్చిన గొప్ప నేత అన్నారు. సివిల్ సర్వీసెస్‌లో మొదటి స్థానం పొందినా, దేశ సేవకై ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప వ్యక్తి' అని కొనియాడారు. ఆంగ్లేయుల పాలనలో భయాన్ని జయించి, ప్రజలను ఉత్తేజపరిచిన నేతాజీ స్ఫూర్తిని నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మిర్చి మాములుగా లేదుగా ఎర్రబంగారమేనా...



**హైదరాబాద్ పెన్ పవర్:**
గుంటూరు మార్కెట్‌కు మొత్తం 61,000 బస్తాల కొత్త మిర్చి చేరింది. ఇందులో నాన్-ఏసీ 40,000 నుంచి 45,000 బస్తాలు, ఏసీ 15,000 నుంచి 16,000 బస్తాలు వచ్చినట్లు తెలుస్తోంది. మార్కెట్‌కు వచ్చిన సరుకులో, ముఖ్యంగా ఏసీ శాంపిల్స్‌లో తేజా రకాలు అధికంగా కనిపించాయి, ఇది ఆ రకాల ధరలపై ప్రభావం చూపింది.

**రకాల వారీగా మిర్చి ధరల వివరాలు:**

తేజా రకాలు: తేజా, షార్కు తేజా, రోమి 26 వంటి తేజా సెగ్మెంట్ రకాల ధరలలో గురువారం కాస్త స్లో అయినట్లు కనిపించింది. భారీగా సరుకు రావడం వల్ల ఈ రకాలపై ఒత్తిడి పడింది. కొత్త తేజా రకాలు గరిష్టంగా రూ. 19,000 పలికాయి. ఏసీ తేజా రకాలు రూ. 18,500 నుంచి రూ. 19,000 లోపు అమ్ముడయ్యాయి. షార్కు తేజా, రోమి రకాలు రూ.17,000 లోపే పలికాయి.

కర్నూల్ డీడీ, నాటు, సీడ్ రకాలు: తేజా రకాల మినహా, ఇతర రకాల మార్కెట్ స్థిరంగా, డిమాండ్‌తో కొనసాగింది. కర్నూల్ డీడీ 341 రకం గరిష్టంగా రూ. 25,000 పలికింది, కనిష్టంగా రూ16,000 క్వింటా అమ్ముడయ్యాయి. మధ్యస్థ రకాలకు రూ.16,000 నుండి రూ.20,000 వరకు ధరలు నమోదయ్యాయి. సీడ్ రకాలకు డిమాండ్ తగ్గకుండా, మార్కెట్ బాగానే ఉంది. నెంబర్ ఫైవ్ కొత్త మిర్చి రకాలు రూ.16,000 నుంచి రూ. 23,000 వరకు, నాణ్యతను బట్టి రూ.23,500 నుండి రూ.24,000 వరకు పలికాయి.

బ్యాడిగి రకాలు: 355 బ్యాడిగి కొత్త రకాలు రూ.16,000 నుంచి రూ.22,000 వరకు అమ్ముడయ్యాయి. సింజెంటా బ్యాడిగి కొత్త మిర్చి రకాలు రూ.15,000 నుంచి రూ.21,000 వరకు పలికాయి.

ఇతర ప్రధాన రకాలు: 2043 ఈ రకం మార్కెట్ బాగానే ఉంది. నాణ్యత ఉన్న మిర్చి లభ్యత తక్కువగా ఉండటంతో, మంచి నాణ్యతకు రూ.30,000 పైన, ఏసీ రకాలకు రూ.35,000 వరకు ధరలు నమోదయ్యాయి. సాధారణ క్వాలిటీ రూ.30,000 నుంచి రూ.32,000 వరకు పలికింది.

బంగారం: కొత్త మిర్చి రకాలు రూ.15,000 నుంచి రూ.20,000 వరకు అమ్ముడయ్యాయి. ఏసీ రకాలు రూ.19,500 నుంచి రూ20,000 వరకు పలికాయి.

బుల్లెట్: ఈ రకం కూడా బంగారం రకం వలె రూ.15,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. ఏసీ రకాలు రూ.19,500 నుంచి రూ.20,000 వరకు అమ్ముడయ్యాయి.

273 కుబేరా: నాణ్యతను బట్టి రూ.20,000 నుంచి రూ.21,000 వరకు, ఒరిజినల్ నాణ్యత రూ.22,000 వరకు పలికింది. ఏసీ రకాలు రూ.20,000 నుంచి రూ.21,000 వరకు పలికాయి.

నాటు రకాలు: రూ.21,000 నుంచి రూ.22,000 వరకు అమ్ముడయ్యాయి. 334 రకం కూడా నాణ్యతను బట్టి రూ.22,000 వరకు పలికింది.

ఆర్మూర్: ఈ రకం రూ.17,000 నుండి రూ.17,500 వరకు అమ్ముడై, అమ్మకాలు బాగానే ఉన్నాయి. కొత్తవి రూ.17,500 వరకు పలికాయి, బుధవారం రూ.18,000 కూడా జరిగింది. ఏసీ రకాలు రూ.16,500 నుంచి రూ.17,500 వరకు పలికాయి.

క్లాసిక్: ఈ రకం రూ.17,000 పరిధిలో మార్కెట్ నడుస్తోంది.

108 వన్: కొత్తవి రూ.15,000 నుంచి రూ.16,000 నుంచి ప్రారంభమై, నాణ్యతను బట్టి రూ.23,000 వరకు, గరిష్టంగా రూ.23,500 వరకు పలికాయి.

నాందేడ్ సీడ్ రకాలు: రూ.15,000 నుంచి రూ.16,000 పరిధిలో ఉన్నాయి.

ఎల్లో మిర్చి:నాణ్యమైన డీలక్స్ రకాలు రూ.48,000 నుంచి రూ.49,000 వరకు అద్భుతంగా అమ్ముడయ్యాయి.

తాలు రకాలు: కొత్త తాలు, డీడీ తాలు, 341 తాలు, నెంబర్ ఫైవ్ తాలు వంటి రంగు తాలు రూ.15,000 వరకు పలికాయి. మెత్త తాలు రూ.10,000 నుంచి రూ.11,000 వరకు, మంచి రంగు తాలు రూ.13,000 నుండి రూ.15,000 వరకు పలికాయి. తేజా తాలు రంగు తాలు రూ.12,500 పరిధిలో అమ్ముడయ్యాయి. 334 తాలు రూ.10,000 పైన మంచి ధరలు పలికాయి. మొత్తం మీద, గుంటూరు మార్కెట్‌కు భారీగా సరుకు రావడంతో, ముఖ్యంగా తేజా రకాలపై కొంత ఒత్తిడి పెరిగి ధరలు మందగించాయి. అయితే, నాణ్యతను బట్టి ఇతర సీడ్, బ్యాడిగి, నాటు రకాలు స్థిరంగా మంచి ధరలు పలికాయి. మార్కెట్ నాణ్యతపై ఆధారపడి నడుస్తుందని అర్థమవుతుంది. అనేక మిర్చి వెరైటీలు ఇప్పటికే క్వింటాలుకు రూ.25,000 మార్కును దాటాయి. మిర్చి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోవడం. నల్లి, ఇతర తెగుళ్ల కారణంగా వేసిన పంట దిగుబడి కూడా ఆశాజనకంగా లేకపోవడమే. కొత్త పంట మార్కెట్‌లోకి వస్తున్నప్పటికీ, ధరలు నిరంతరం పెరుగుతున్నాయి, ఇది ప్రస్తుత ధోరణి కొనసాగుతుందని సూచిస్తుంది. చాలా వెరైటీలకు తదుపరి లక్ష్యం రూ.30,000 గా ఉంది. ఇప్పటికే పసుపు మిర్చి క్వింటాలుకు రూ.44,000 చేరుకుంది, ఇది రూ.70,000 కు వెళ్లినా ఆశ్చర్యపోనవసరం లేదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది తక్కువ మంది రైతులు మాత్రమే సాగుచేస్తున్నారు. కోల్డ్ స్టోరేజీలలోని స్టాక్ సుమారు 20 రోజులలో ఖాళీ అయిపోయే అవకాశం ఉంది. వ్యాపారస్తులు సరుకు కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. రైతులు మంచి ధర వస్తుందని ఆశించి కోల్డ్ స్టోరేజీల నుంచి సరుకును బయటకు తీయడం లేదు. గత వారం రోజులుగా, అన్ని రకాల మిర్చి ధరలు ప్రతిరోజూ పెరుగుతూనే ఉన్నాయి. కోల్డ్ స్టోరేజీల నుంచి సరుకు బయటకు రావాలంటే ధరలు మరింత పెంచడం తప్ప వేరే మార్గం లేదు. మంచి క్వాలిటీ సరుకు అంతా కోల్డ్ స్టోరేజీలలోనే ఉంది. కొత్తగా వచ్చే పంట మొదటి కోతలు కాబట్టి, అంత నాణ్యత ఉండదు. రాబోయే రోజుల్లో చైనాకు ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంది, వ్యాపారస్తులు సుపీరియర్, డీలక్స్ క్వాలిటీల కోసం పోటీపడుతున్నారు. దీంతో ధర పెరిగే అవకాశాలే ఎక్కువ ఉన్నాయన్నది నిపుణులు అంచనా.

# ఇక పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు..



**హైదరాబాద్, జనవరి 23, పెన్ పవర్:**
తెలుగు రాష్ట్రాల్లో జరగాల్సిన అనేక వివాహ వేడుకలు, శుభకార్యాలు, ఫంక్షన్‌లకు మూఢం కారణంగా బ్రేక్ పడింది. అయితే, ఇప్పుడు మళ్లీ శుభగడియలు తరుముకొస్తున్నాయి. దాదాపు మూడు నెలల విరామం తరువాత తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ పెండ్లిళ్ల బాజాలు మోగబోతున్నాయి. నవంబర్ నెల నుంచి మూఢాల కారణంగా శుభ ముహూర్తాలు లేకుండా పోయాయి. శుక్ర మౌఢ్యమి ఈనెల 17న ముగియడంతో తెలుగు రాష్ట్రాల్లో మూడు నెలల తరువాత పెళ్లిళ్లు, రిసెప్షన్లతో కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి. మన పంచాగాల ప్రకారం.. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి శుభముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయి. 19, 20, 21, 24, 25, 26తేదీలు వివాహాలకు అనుకూలంగా ఉన్నాయి. 19, 20, 21 తేదీల్లో గృహ ప్రవేశాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఫిబ్రవరి 21వ తేదీన ఎక్కువ పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆ రోజు పంచమి మరీ మంచి ముహూర్తం కావడం, అలాగే వీకెండ్ కావడం కారణంగా భారీ సంఖ్యలో వివాహాలకు ముహూర్తాలను నిర్ణయించుకున్నట్లు పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల తరువాత మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై వరకు అన్నీ మంచి రోజులే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. మార్చి నెలలో 4, 5, 6, 7, 8, 11, 12, 13, 14, 20, 21, 25, 29 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అదేవిధంగా ఏప్రిల్ నెలలో 1 నుంచి 8వ తేదీ వరకు.. ఆ తరువాత 10, 11, 12, 21, 25, 26, 28, 29, 30 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. మే నెలలో 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13 తేదీల్లో.. జూన్ నెలలో 19, 20, 21, 24, 25, 26, 27, 28 తేదీల్లో, జులై నెలలో 1, 2, 3, 5, 8, 9 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల నుంచి మార్చి, ఏప్రిల్, మే, జూన్ , జులై నెలల్లో కూడా వరుసగా శుభ ఘడియలు ఉండటంతో పురోహితులు, వెడ్డింగ్ ప్లానర్లు, క్యాటరర్ల డైరీలు పూర్తిగా నిండిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న పరిస్థితి నెలకొంది.

ఫంక్షన్ హాళ్లు, పురోహితులు, క్యాటరింగ్ సర్వీసుల రేట్లు ఆకాశాన్నంటడంతో వధూవరుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదికి ప్రస్తుత ఏడాదికి ధరలు విపరీతంగా పెరిగాయి. పురోహితుల దగ్గర నుంచి క్యాటరింగ్ వాళ్లు, డెకరేషన్స్, పెండ్లి సామాగ్రి, కూరగాయలు, మాంసం ధరలు భారీగా పెరిగాయి. ఇక ప్రధానమైన మ్యారేజ్ ఫంక్షన్ హాల్స్ ధరలు భగ్గుమంటున్నాయి. చిన్నచిన్న ఫంక్షన్ హాళ్లు సైతం లక్షల్లో చెల్లించాల్సిందే.. ఇక పెద్ద ఫంక్షన్ హాల్స్ అయితే.. రూ. 10లక్షల నుంచి రూ. 13లక్షలకు తక్కువకు రానిపరిస్థితి. పెళ్లిళ్లు, గృహప్రవేశాలతో పాటు ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలో శుభకార్యాలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి కుటుంబాలు పెరిగిన ధరలతో ఆందోళన చెందుతున్నారు.

# బాలికా దినోత్సవం వెలుగులు నింపేనా!

జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న నిర్వహించబడుతుంది. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ఈ బాలికా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో జాతీయ బాలికా దినోత్సవంను ప్రారంభించడం జరిగింది.సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. వాటిలో భాగమే జాతీయ బాలికా దినోత్సవం. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. సమాజంలో మహిళల హోదాను ప్రోత్సహించటానికి జరుపు కుంటారు. బాలికలు సాధారణంగా వారి జీవితంలో ఎదుర్కొనే వివిధ రకాల సాంఘిక వివక్ష, లైంగిక దోపిడీని నివారించడం అత్యవసరం. సమాజంలో మహిళల ప్రాదాన్యత, భాగస్వామ్యం గురించి అవగాహన పెంచడానికి, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వివిధ రాజకీయ, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు బాధ్యులు, సమాన విద్య, ప్రాథమిక స్వేచ్ఛ కోసం వివిధ కార్యక్రమాల ద్వారా వివరించడం జరుగుతుంది.బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిలపట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడల్సెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాఫ్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది. చిన్నారులపై లైంగిక వేధింపులు నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్త శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. దేశంలో నానాటికీ అడపిల్లల సంఖ్య తగ్గిపోతూ, కొనసాగితే చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందనేది కాదన లేని వాస్తవం. ఇదే కాక ప్రపంచంలో జరుగుతున్న బాల్య వివాహాల్లో 40% పైగా భారతదేశం లోనే జరుగుతున్నాయని ఇటీవలే యూనిసెఫ్ గణాంకాలను వెల్లడించింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యాత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నా

రు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. ఆడపిల్లలకి తప్పనిసరి అవసరమైన భద్రత, సాంకేతిక విజ్ఞానాన్ని సేవల్ని అందుబాటులో వుంచాలి. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయ పడు తున్నది. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది.సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి. బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ

**అమరావతి, జనవరి 23, పెన్ పవర్:** ప్రపంచ పెట్టుబడుల సదస్సులో ఏపీ సత్తా చాటుతోంది. పెద్ద ఎత్తున పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తోంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రత్యేక బృందం ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు హాజరైంది. మంత్రి నారా లోకేష్ సైతం ఈ బృందంలో ఉన్నారు. అయితే మన దేశం నుంచి పది రాష్ట్రాలు పెవిలియన్లు ఏర్పాటు చేశాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు పోటీపడ్డాయి. కానీ అందులో ఏపీ ముందు వరుసలో నిలవడం విశేషం. చంద్రబాబు నేతృత్వంలో దావోస్ పర్యటన ఏపీ పారిశ్రామిక చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం అని టాక్ నడుస్తోంది. ముఖ్యంగా ఆర్ఎంజెడ్ గ్రూపు లక్ష కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. అయితే లక్ష కోట్లు అనేది సంఖ్యా మాత్రమే కాదు. లక్షలాదిమంది యువత కలలను సాకారం చేసే ఒక భరోసా. విశాఖను డిజిటల్ రాజధానిగా, రాయలసీమను లాజిస్టిక్స్ హబ్ గా మార్చబోతున్న ఈ ప్రాజెక్టులు.. రాష్ట్ర జిడిపి ని పరుగులు పెట్టిస్తాయి అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. దేశంలో ఏపీని అగ్రగామిగా, పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయి.ప్రముఖ రియల్ ఎస్టేట్ దిగ్గజంగా ఆర్ఎంజెడ్ ఉంది. ఏపీలో దాదాపు లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే దేశంలో లక్షమందికి ఉద్యోగాలు అందించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వంతో ఆర్ఎం జెడ్ ఒప్పందాలు కూడా చేసుకుంది. రాబోయే ఐదు,ఆరు సంవత్సరాల్లో మూడు ప్రధాన రంగాల్లో ఈ పెట్టుబడులు రానున్నాయి. విశాఖపట్నంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ హబ్ గా, డేటా సెంటర్ క్లస్టర్ గా మార్చేందుకు.. రాయలసీమలో ఇండస్ట్రియల్,, లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు ఆర్ ఎం జెడ్ ముందుకు రావడం విశేషం.

విశాఖలోని కాపులుప్పాడ ఐటీ పార్కులు 50 ఎకరాల విస్తీర్ణంలో.. పది మిలియన్ చదరపు అడుగుల భారీ జిసిసి పార్కును ఆర్ఎంజెడ్ అభివృద్ధి చేయనుంది. ఇది అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలను ఆకర్షించడమే కాకుండా.. ఉత్తరాంధ్రలో ఐటి ఎకో సిస్టంను సమూలంగా మార్చి వేయనుంది. భవిష్యత్తు తరాల కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సేవలు అందించేందుకు గాను.. విశాఖ పరిసరాల్లో 1 గిగావాట్ సామర్థ్యంతో భారీ హైపర్ స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్ను ఏర్పాటు చేయనున్నారు. 500 నుంచి 700 ఎకరాల్లో విస్తరించే ఈ ప్రాజెక్టు గ్రీన్ ఎనర్జీ ఆధారంగా పనిచేయనుంది.

మరోవైపు రాయలసీమలో ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు చేసేందుకు కూడా ఆర్ఎం జెడ్ ముందుకు వచ్చింది. టేకులపల్లి వద్ద వెయ్యి ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటు కానుంది. దీనివల్ల తయారీ, రవాణా రంగాల్లో వేల సంఖ్యలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

మరోవైపు మూడో రోజు ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశం అవుతూ వస్తున్నారు చంద్రబాబు. దావోస్ లోని ఏపీ లాంజ్ లో చంద్రబాబుతో ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, సీఈఓ ఆదిత్య మిట్టల్ సమావేశం అయ్యారు. మంత్రులు నారా లోకేష్ తో పాటు టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్ భారీ ఉక్కు కర్మాగార పురోగతిపై చర్చించారు. తొలి దశలో దాదాపు 60 వేల కోట్ల రూపాయలతో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చారు. వివిధ దశల్లో ఉన్న అనుమతులు, భూ సేకరణ వంటి వాటిపై చర్చించారు. ఫిబ్రవరి 15 తేదీలోగా అన్ని అనుమతులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థ తమారా లీజర్ సీఈవో సృష్టి సిబులాల్ తో కూడా చంద్రబాబు సమావేశమయ్యారు. పర్యాటక రంగ ప్రాజెక్టులకు సంబంధించి చర్చించారు. ప్రధానంగా పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోనూ.. కోనసీమ, గండికోట,, అరకు, లంబసింగి వంటి ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్చించారు. దీనిపై తమారా లీజర్ సమస్త సానుకూలంగా స్పందించింది. ఎకో టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పింది.

మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు కాలిబో ఏఐ అకాడమీ, వట్టికూటి ఫౌండేషన్ ముందుకు వచ్చింది. విశ్వవిద్యాలయాల స్థాయిలో ప్రత్యేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందించేందుకు కూడా సీఎం ప్రతిపాదించారు. విశాఖపట్నంలోని మధురవాడ ఐటి సెజ్ లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కాలిబో సంస్థను చంద్రబాబు ఆహ్వానించారు. మొత్తానికి అయితే ప్రపంచ పెట్టుబడుల సదస్సులో తన హవా చాటుతోంది ఆంధ్రప్రదేశ్.

# పాదయాత్ర 2.0 పైనే ఆశలు

**కడప, గుంటూరు, జనవరి 23, పెన్ పవర్:** ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అని చంద్రబాబు, పవన్ అంటున్నారు. ఆ ముగ్గురిది ఫెవికోల్ బంధమని వైసీపీ కూడా చెప్తోంది. ఫ్యాన్ పార్టీ మాత్రం అధినేత మీదే భరోసా పెట్టి ముందుకెళ్తోంది. జగన్ పాదయాత్ర చేస్తారు..తిరిగి అధికారంలోకి వస్తామంటూ ధీమాగా ఉన్నారు వైసీపీ లీడర్లు. ఈ సారి జగన్ చేయబోయే పాదయాత్ర నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని అంటున్నారు. ఏపీ మొత్తాన్ని కవర్ చేసేలా..2019కి ముందు చేపట్టిన పాదయాత్రకు మించి రూట్ మ్యాప్ రెడీ చేస్తున్నామని చెప్పుకొస్తున్నారు. జగన్ కూడా ఎన్నికలకు ఏడాదిన్నర ముందు పాదయాత్ర చేస్తానని..ఎన్నికల వరకు జనంలోని ఉంటానని ప్రకటించేశారు.ఎలక్షన్స్‌కు ముందు చేయబోయే పాదయాత్రపై జగన్ ఇప్పుడెందుకు ప్రకటన చేసినట్లు అన్న చర్చ జరుగుతోంది. మళ్లీ వైసీపీనే పవర్‌లోకి వస్తుందని..క్యాడర్, లీడర్లకు ధైర్యం నూరిపోస్తున్న అధినేత..కావాలనే పాదయాత్రపై హింట్ ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సేమ్‌టైమ్ అటు క్రెడిట్ వార్‌లోనూ ఓ అడుగు ముందుండే ప్రయత్నం చేస్తున్నారు జగన్. విశాఖ గూగుల్ డేటా సెంటర్ నుంచి లేటెస్ట్‌గా భూసర్వే దాకా అంతా తానే చేశానని..కానీ సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నారంటూ చెప్పుకుంటూ వస్తున్నారు.పాదయాత్రలకు తెలుగు స్టేట్స్ పెట్టింది పేరు. పాదయాత్రలు చేసి ఎంతో మంది అధికారంలోకి వచ్చారు. 2003లో అప్పటి ఉమ్మడి ఏపీ పీసీసీ ప్రెసిడెంట్ హోదాలో వైఎస్సార్ భారీ పాదయాత్ర చేసి..2004లో ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే పాదయాత్ర సెంటిమెంట్ తెలుగు నాట పవర్ ఫుల్ అని.. ఆ తర్వాత పాదయాత్ర చేసిన నాయకులు నిరూపించారు. 2013 అక్టోబర్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు పాదయాత్ర చేసి..2014లో ఏపీలో సీఎం అయ్యారు. ఇక 2017లో నాటి ఏపీ విపక్ష నేత వైఎస్ జగన్ ఏకంగా 3500 కిలోమీటర్లపైన పాదయాత్ర చేపట్టి 2019 ఎన్నికల్లో బంపర్ విక్టరీ కొట్టి సీఎం అయ్యారు.2023 జనవరిలో యువ నేత లోకేష్ పాదయాత్ర చేపట్టి..కూటమి బంపర్ విక్టరీకి తనవంతు తోడ్పాటు అందించారు. ఇలా రెండు దశాబ్దాలకు పైగా ఏపీ పాలిటిక్స్‌లో పాపులర్ అయిన పాదయాత్రలతో నేతలు కాళ్లు అరిగేలా పవర్‌లోకి వచ్చారు. ఇప్పుడు మళ్ళీ జగన్ వంతు వచ్చింది. లేటెస్ట్‌గా నేతల సమావేశంలో మాట్లాడుతూ మరో ఏడాదిన్నరలో పాదయాత్ర చేపడతానని ప్రకటించారు.పాదయాత్ర 2.౦ జగన్‌ను తిరిగి పవర్‌లోకి తెస్తుందా లేదా అన్నదే అతిపెద్ద చర్చ. తెలుగు రాజకీయాల్లో ఒకసారి పాదయాత్ర చేసిన వారు మరోసారి పాదయాత్ర చేపట్టలేదు. రెండోసారి పాదయాత్ర అనేది జగన్‌తోనే మొదలయ్యే అవకాశం ఉంది. వైఎస్సార్ కానీ చంద్రబాబు కానీ ఒకేసారి పాదయాత్ర చేశారు. లోకేష్ కూడా ఆ లోటు తీర్చుకున్నారు. అయితే మొదటిసారి పాదయాత్ర చేస్తే ఆ క్రేజ్, హైప్ ఒక లెవెల్‌లో ఉంటుంది. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన వారు..అప్పటివరకు అధికారం చేపట్టకుండా ప్రతిపక్షంలో ఉన్నవారు పాదయాత్ర చేస్తే ఆ మ్యాజిక్కే వేరేగా ఉంటుంది.జగన్ విషయానికి వస్తే ఐదేళ్లు పాటు సీఎంగా పనిచేశారు. ఆయన పాలన ఏమిటో ప్రజలు చూశారు. వైసీపీ హయాంలో తీసుకున్న పలు నిర్ణయాలే 2024లో జగన్ ఓటమికి కారణమయ్యాయన్న టాక్ ఉంది. మరి ఈసారి ప్రజల్లోకి వెళ్లి జనాలకు జగన్ ఏం చెప్తారు? జనాలను ఎలా అట్రాక్ట్ చేయబోతున్నారు? వైసీపీ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలు ప్రశ్నిస్తే జగన్ ఎలా రియాక్ట్ అవుతారు? అనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. గతానికి మించి కొత్త హామీలు ఇవ్వాలి. స్పీచ్ దగ్గర నుంచి బాడీ లాంగ్వేజ్ దాకా అన్నీ మార్చేయాలి. తీరా ఎన్ని చేసినా ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై అనుకున్న స్థాయిలో వ్యతిరేకత రాకపోతే మాత్రం జగన్ అంచనాలు తలకిందులు అయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి సవాళ్ల నేపథ్యంలో జగన్ పాదయాత్ర విజయతీరాలకు చేరుస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది.ఒకవేళ జగన్ పాదయాత్ర చేస్తే పొలిటికల్ సినారియో ఎలా ఉంటుందనేది బిగ్ డిబేట్‌గా ఉంది. 2019 ఎన్నికలే ఎజెండాగా ఆయన చేసిన పాదయాత్రకు అప్పట్లో ప్రజల మద్దతు బానే లభించింది. ఇప్పుడు కూడా అలాగే ప్రజల్లోకి వెళ్లి పబ్లిక్ పల్స్ తెలుసుకోవాలనే ఉద్దేశంతో జగన్ ఉండొచ్చు. కానీ జగన్ 2019 ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్ర చేసినప్పుడు ఉన్న పరిస్థితులు వేరు. ఇప్పుడున్న పొలిటికల్ సిచ్యువేషన్స్ ఇంకా వేరు. 2014లో జగన్ ఓడిపోయారనే సింపతీ 2019 ఎన్నికల్లో ఆయనకు కలిసి వచ్చింది.పవర్‌లోకి వస్తే నవరత్నాలు ఇస్తామని చెప్పి..రాజన్న రాజ్యం తీసుకొస్తామన్న నమ్మకం కలిగించడంలో అప్పుడు సక్సెస్ అయ్యారు. పైగా ఆ నాటి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ సెపరేట్‌గా పోటీ చేశాయి. ఓట్లు చీలిపోయి జగన్‌కు కలిసి వచ్చింది. 2024లో కూడా జగన్ ఆ మూడు పార్టీలు కలవకూడదని కోరుకున్నారు. కానీ ఏదైతే జరగొద్దని జగన్ అనుకున్నారో అదే జరిగింది. కూటమిగా ఏర్పడి పోటీ చేసి పవర్‌లోకి వచ్చాయి

ఆ మూడు పార్టీలు.రాబోయే ఎన్నికల్లో కూడా ఆ ముగ్గురు కలిసే పోటీ చేస్తామంటున్నారు. ఆ మూడు పార్టీల మాటలు, చేతలు కూడా అదే డైరెక్షన్‌లోనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో..2018లో జగన్ చేసిన పాదయాత్రతో పోలిస్తే.. రాబోయే రోజుల్లో చేయబోయే పాదయాత్ర ఎంతవరకు సక్సెస్ అవుతుందనేదే డిస్కషన్ పాయింట్. జగన్ పాదయాత్ర చేస్తే చంద్రబాబు సర్కార్‌పై దుమ్మెత్తిపోయడం తప్ప కొత్తగా చెప్పేదేం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఇప్పటికే ప్రజలు వైసీపీ పాలనను చూశారని..జగన్ కొత్తగా చెప్పేదేమి లేదని..ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితి కూడా లేదంటున్నారు. ఏది ఏమైనా ఫస్ట్ టైమ్ జగన్ వేసిన బాణం గురి తగిలింది. రెండోసారి కూడా తగిలితే రికార్డు బ్రేక్ అవుతుంది. మరి జగన్ పాదయాత్ర 2.౦ ఎంత వరకు సక్సెస్ అవుతుందో చూడాలంటే వేచి చూడాల్సిందే.

# పవన్ లో రెండో కోణం



**విజయవాడ, జనవరి 23, పెన్ పవర్:** తనను నమ్ముకున్న వారి కోసం పవన్ కళ్యాణ్ఎంత దాకైనా ముందుకు వెళ్తారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. ఆయన తీరు ఒకేలా ఉంటుంది. అయితే తాజాగా ఆయన పార్టీ కోసం పని చేసే వారిని గుర్తు పెట్టుకొని మరి కలుస్తున్నారు. డిప్యూటీ సీఎం గానే సాదాసీదాగా వెళ్తూ కలుస్తున్నారు. మొన్నటికి మొన్న ఇప్పటం గ్రామంలో సరస్వతమ్మను కలిశారు. ఇప్పుడు తాజాగా కృష్ణాజిల్లాలోని కృత్తివెన్ను గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త చందు వీర వెంకట వసంత రాయులు కుటుంబాన్ని కలిశారు. వారి కష్టాలను తెలుసుకున్నారు. వారికి కొంత మొత్తంలో ఆర్థిక సాయం చేయడమే కాకుండా.. ప్రభుత్వం తరఫున కూడా భరోసా కల్పించారు. పవన్ చర్యలు ఇప్పుడు ఆకట్టుకుంటున్నాయి. సొంత పార్టీ శ్రేణులు గుర్తించుకుంటున్నాయి.జనసేన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ప్లీనరీ నిర్వహించుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డు తగిలింది. వారికి సరైన వేదిక కూడా దొరకనివ్వలేదు. ఈ క్రమంలో ఇప్పటం గ్రామస్తులు ముందుకు వచ్చి ప్లీనరీ నిర్వహణకు అవసరమైన భూమిని అందించారు. అక్కడ ప్లీనరీ సక్సెస్ అయ్యింది. దానిని మనసులో పెట్టుకొని రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటం గ్రామస్తులను అప్పటి వైసిపి ప్రభుత్వం ఇబ్బంది పెట్టింది. ఆ సమయంలో గ్రామస్తులను పరామర్శించారు పవన్. ఈ క్రమంలో గ్రామానికి చెందిన సరస్వతమ్మ అధికారంలోకి వస్తే పవన్ కళ్యాణ్ ను కలవాలని కోరింది. ఆమె కోరిక మేరకు ఇటీవల పవన్ కళ్యాణ్ ఆ గ్రామానికి వెళ్లారు. సరస్వతమ్మను కలిశారు.తాజాగా కృతివెన్ను గ్రామానికి వెళ్లారు పవన్ కళ్యాణ్. చందు వీర వెంకట వసంత రాజులు అనే వ్యక్తి జనసేన లో చాలా యాక్టివ్ గా ఉండేవారు. జనసేన అధికారంలోకి రావాలని పూజలు కూడా చేసేవారు. అప్పట్లో ఫేమస్ అయ్యారు కూడా. అయితే ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. జనసేన సభ్యత్వం ఉండడంతో బీమాకు సంబంధించిన పరిహారం దక్కింది. అయితే ఆయనలో అభ్యుదయ భావాలు అధికం. ఆయన చనిపోయినప్పటికీ కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. రాయులు ఆరుగురికి అవయవ దానం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ తానే స్వయంగా ఆ కుటుంబాన్ని పరామర్శిస్తానని చెప్పారు. తన పర్యటనను గోప్యంగా ఉంచారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సాయం కూడా చేశారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇస్తానని కూడా హామీ ఇచ్చారు. అయితే గోప్యంగా ఉంచినా వేలాదిమంది అభిమానులు తరలివచ్చారు. అయితే పవన్ చర్యలు సామాన్యులను సైతం ఆకట్టుకుంటున్నాయి.

# వేటుకు వేళాయెరా...

**విజయవాడ, జనవరి 23, పెన్ పవర్:** ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హాజరుపై స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు అనుసరిస్తున్న వ్యూహం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు కారణం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సభకు హాజరుకాకుండా ప్రజాధనాన్ని జీతభత్యాల రూపంలో తీసుకోవడం నైతికంగా తప్పని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే నో వర్క్ – నో పే అనే నినాదాన్ని స్పీకర్ గట్టిగా వినిపిస్తున్నారు. సభకు రాకుండానే హాజరు పట్టికలో సంతకాలు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ విచారణ జరుపుతుండటం చూస్తుంటే, వైసీపీ ఎమ్మెల్యేలను ఇరుకున పెట్టడానికి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉన్నట్లు కనిపిస్తోంది.రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. ఒక సభ్యుడు వరుసగా 60 పని దినాల పాటు సభాపతి అనుమతి లేకుండా సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటించే అధికారం స్పీకర్‌కు ఉంటుంది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పదేపదే ఈ '60 రోజుల నిబంధన'ను గుర్తు చేయడం వెనుక వ్యూహాత్మక ఆలోచన కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి ఈ గడువు ముగిసే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం ద్వారా, ప్రతిపక్షానికి కోలుకోలేని దెబ్బ తీయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.సాధారణంగా ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తే ప్రజల్లో సానుభూతి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే, ఇక్కడ ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం, రాజ్యాంగ ఉల్లంఘన అనే రెండు అంశాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. సభకు రాకుండా జీతాలు తీసుకోవడం ప్రజలను మోసం చేయడమేనని, ఓట్లేసిన ప్రజల సమస్యలను సభలో వినిపించకపోవడం రాజ్యాంగ ద్రోహమని ప్రచారం చేయడం ద్వారా ప్రజా వ్యతిరేకత రాకుండా జాగ్రత్త పడుతోంది. ప్రజల్లో ఈ అంశంపై చర్చ మొదలైతే, అనర్హత వేటును ప్రజలే సమర్థిస్తారనేది ప్రభుత్వ అంచనా. ఎథిక్స్ కమిటీ విచారణ ఈ ప్రక్రియలో అత్యంత కీలకంగా మారింది. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోయినా, వారి పేరుతో సంతకాలు ఎలా జరిగాయనే అంశంపై ఫోరెన్సిక్ విచారణకు కూడా వెనుకాడబోమని ప్రభుత్వం సంకేతాలిస్తోంది. ఒకవేళ దొంగ సంతకాలు జరిగినట్లు నిరూపితమైతే, అది కేవలం అనర్హతకే పరిమితం కాకుండా క్రిమినల్ చర్యలకు కూడా దారి తీయవచ్చు. ఇది వైసీపీ ఎమ్మెల్యేలను నైతికంగా ఆత్మరక్షణలో పడేసే అవకాశం ఉంది.వైసీపీ కూడా ఈ పరిణామాలను గమనిస్తూనే ఉంది. ప్రభుత్వం వేటు వేసే వరకు వేచి చూడటం కంటే, వ్యూహాత్మకంగా రాజీనామాలు చేసి మళ్ళీ ప్రజా క్షేత్రంలోకి వెళ్లడం మేలని ఆ పార్టీలోని కొందరు నేతలు భావిస్తున్నారు. అయితే, అనర్హత వేటు పడితే దాన్ని కోర్టుల్లో సవాలు చేసే వెసులుబాటు ఉంటుంది కానీ, ప్రజల దృష్టిలో మాత్రం ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం చాలా తెలివిగా రాజ్యాంగబద్ధత అనే అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. వచ్చే అసెంబ్లీ సమావేశాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక మలుపు కానున్నాయి. స్పీకర్ కార్యాలయం నుండి వెలువడే నిర్ణయాలు రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాలకు ఉపఎన్నికలను అనివార్యం చేసేలా కనిపిస్తున్నాయి. ప్రజా సమస్యలపై పోరాడటానికి సభను వేదికగా చేసుకోని పక్షంలో, రాజ్యాంగం కల్పించిన అధికారాలను ఉపయోగించి గట్టి నిర్ణయాలు తీసుకోవడానికి ప్రభుత్వం ఏమాత్రం వెనకాడబోమని స్పష్టం చేస్తోంది.

# స్టీల్ ప్లాంట్ ఫ్యూచర్ పై మేఘాలు

**విశాఖపట్టణం, జనవరి 23, పెన్ పవర్:** విశాఖపట్నంలో ఉన్న ఉక్కు కర్మాగారం భవిష్యత్తుపై మరోసారి అనిశ్చితి మేఘాలు కమ్ముకున్నాయి. కర్మాగారం ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న సమయంలో యాజమాన్యం మూడోసారి స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని ప్రకటించడం కార్మికుల్లో భయాందోళనలను పెంచింది. గతంలో రెండు విడతలుగా అమలు చేసిన ఈ పథకం వల్ల అనుభవం ఉన్న అనేక మంది ఉద్యోగులు సంస్థను వీడాల్సి వచ్చింది. ఇప్పుడు మరో విడతలో వందల సంఖ్యలో ఉద్యోగులను తగ్గించాలన్న యోచనతో ముందుకు రావడం కార్మిక వర్గాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది.ఈ ఉక్కు కర్మాగారాన్ని నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ శాశ్వత ఉద్యోగుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ వ్యయాన్ని నియంత్రించాలనే దిశగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. అయితే ఇది కేవలం ఖర్చు తగ్గింపు చర్య కాదని, క్రమంగా ప్రైవేటీకరణకు దారితీసే వ్యూహమనే అనుమానాలు బలపడుతున్నాయి. ఉద్యోగ భద్రతపై నమ్మకం కోల్పోతున్న కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పథకాన్ని అంగీకరిస్తున్నారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని ఆదుకోవడానికి భారీ పునరుజ్జీవ ప్యాకేజీ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. ముడి సరుకు కొరత, నిధుల లేమి కారణంగా ఉత్పత్తి స్థాయి తగ్గిపోయింది. దీనివల్ల ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందకపోవడం, పండుగల సమయంలో కూడా ప్రోత్సాహకాలు లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. భవిష్యత్తుపై నమ్మకం లేక యువ అధికారులు కూడా సంస్థను విడిచిపెట్టాలని భావించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.ఇటీవల కర్మాగారంలోని అనేక విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచినట్లు వార్తలు రావడం కలకలం రేపింది. కీలక విభాగాలు కూడా ఈ జాబితాలో ఉండటంతో భద్రత, నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ప్రైవేటీకరణ లేదని హామీలు ఇస్తూనే మరోవైపు ఇలాంటి చర్యలు తీసుకోవడం గందరగోళానికి దారి తీస్తోంది. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుతో కొన్ని విభాగాల్లో ప్రమాదాలు పెరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి.తెలుగు ప్రజల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కు ను కాపాడాలనే డిమాండ్ మరింత బలపడుతోంది. కొందరు నిపుణులు సెయిల్లో విలీనం చేయడం ద్వారా సంస్థను నిలబెట్టవచ్చని సూచిస్తున్నా, ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం రాలేదు. అనుభవజ్ఞులైన ఉద్యోగులను వదులుకోవడం వల్ల దీర్ఘకాలంలో ఉత్పత్తి, నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తేనే ఈ కర్మాగారం భవిష్యత్తు భద్రమవుతుందన్న అభిప్రాయం విస్తృతంగా వ్యక్తమవుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# భారతదేశ అణుశక్తి పితామహుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** హోమీ జహంగీర్ భాభా (1909–1966) భారతదేశ శాస్త్ర రంగానికి, అణుశక్తి అభివృద్ధికి అత్యంత విలువైన సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త. ఆయన భారతదేశాన్ని అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషించి, "భారత అణుశక్తి పితామహుడు"గా గుర్తింపు పొందారు. హోమీ జహంగీర్ భాభా 1909 అక్టోబర్ 30న ముంబైలో ఒక సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించారు. తండ్రి జెహంగీర్ హోర్ముస్‌జీ భాభా, ఒక ప్రముఖ న్యాయవాది. తల్లి మిహర్‌బాయి, కళలపట్ల గొప్ప ఆసక్తి కలిగి ఉండేవారు. కుటుంబం విద్యకు ప్రాముఖ్యతనిచ్చింది, ఇది భాభా వ్యక్తిత్వం అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించింది.భాభా చిన్నతనం లోనే శాస్త్రానికి ఆసక్తి కనబరిచారు. కుటుంబం నుంచి వచ్చిన ప్రోత్సాహంతో, ఇంజినీరింగ్ విద్య కోసం ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయానికి వెళ్లారు.భాభా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రాన్ని అభ్యసించి, భౌతిక శాస్త్ర రంగంలో అద్భుతమైన పరిశోధనలు చేపట్టారు. భాభా–హీట్లర్ సిద్ధాంతం: కాస్మిక్ రేడియేషన్‌పై ఆయన చేసిన అధ్యయనాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. భౌతిక శాస్త్రంలో చేసిన ఈ పరిశోధనలు, ప్రతిభను ప్రదర్శించడంతో పాటు, భవిష్యత్తులో ఆయనకు మార్గదర్శకంగా నిలిచాయి. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత భాభా దేశంలోని శాస్త్ర అభివృద్ధికి పెద్ద అడుగు వేశారు.1945లో ఆయన టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌ను స్థాపించారు. ఇది శాస్త్రవేత్తల కోసం పరిశోధన కేంద్రంగా మారింది.ఎఈఖీ ను భౌతిక శాస్త్రం, అణు శక్తి, మరియు ఖగోళ శాస్త్రంలో ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చేశారు.1948లో స్థాపించబడిన ఆటామిక్ ఎనర్జీ కమిషన్కు భాభా అధ్యక్షత వహించారు. ఈ కమిషన్ ద్వారా భారతదేశం శాంతియుత అవసరాల కోసం అణుశక్తిని వినియోగించుకోవడం ప్రారంభించింది. ట్రాంబేలో ఆయన ఆధ్వర్యంలో అణు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయబడింది. ఇది తర్వాత భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్గా పునర్నామీకరించబడింది. భాభా భారతదేశాన్ని అణుశక్తి రంగంలో గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దే దిశగా పనిచేశారు. ఆయన ప్రతిపాదించిన త్రిస్థాయి ప్రణాళికలో యురేనియం, థోరియం వంటి శక్తి వనరుల వినియోగం ప్రధానంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, మరియు పరిశ్రమల అభివృద్ధిలో అణుశక్తిని వినియోగించేందుకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు. విదేశీ ఆధారాన్ని తగ్గించి, స్వదేశీ శక్తి, మరియు సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యతనిచ్చారు. భాభా శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా ఒక సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా ప్రసిద్ధి చెందారు. ఆయనకు సంగీతం, చిత్రలేఖనం, మరియు కళలపై ప్రత్యేక ఆసక్తి ఉంది. భాష పట్ల ఆయనకు ఉన్న ఆసక్తి ఆయనను ఆంగ్లం, ఫ్రెంచ్, మరియు ఇతర భాషల్లో నిపుణుడిగా మార్చింది. 1966 జనవరి 24న స్విట్జర్లాండ్‌లో జరిగిన విమాన ప్రమాదంలో భాభా మరణించారు. ఆయన మరణం భారత శాస్త్రరంగానికి తీరని నష్టం. ఆయన స్థాపించిన సంస్థలు భారతదేశ శాస్త్ర రంగానికి కీలక కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. హోమీ జహంగీర్ భాభా భారతదేశ శాస్త్రరంగంలో తారగా నిలిచారు. ఆయన కలలైన అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధి భారతదేశాన్ని ప్రపంచంలో ప్రధాన స్థానంలో నిలిపింది. భాభా శ్రద్ధ, పట్టుదల, దూరదృష్టి భారత శాస్త్ర రంగానికి మార్గనిర్దేశం చేస్తూ, దేశ అభివృద్ధికి చిరస్థాయిగా ప్రేరణనిస్తుంది. "హోమీ జహంగీర్ భాభా పేరు భారత శాస్త్రరంగ చరిత్రలో సుదీర్ఘకాలం వెలుగొందుతుంది."

# కేరళలో మూడు అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించిన మోడీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరువనంతపురం : ప్రధాని నరేంద్ర మోడీ కేరళ తిరువనంతపురంలో ఒక ప్యాసింజర్ రైలుతోపాటు మూడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. వీటితోపాటు తిరువనంతపు రంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తిరువనంతపురం మేయర్‌గా ప్రమాణస్వీకారం చేసిన తన చిరకాల స్నేహితుడు పి.పి రాజేష్‌కు మోడీ శుభాకాంక్షలు తెలిపారు. కేరళ అభివృద్ధికి కేంద్ర చేస్తున్న ప్రయత్నాలు ఊపందుకున్నాయని, కేరళలో రైలు కనెక్టివిటీ నేడు బలోపేతం అయిందని ప్రధాని అన్నారు. తిరువనంతపురంను స్టార్టప్ హబ్‌గా మార్చేందుకు కేంద్రం తీసుకున్న చొరవ గురించి కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈరోజు మోడీ పిఎం స్వానిధి క్రెడిట్ కార్డును ప్రారంభించారు. లక్ష మంది లబ్దిదారులకు పిఎం స్వానిధి రుణాలను ఈ సందర్భంగా మోడీ పంపిణీ చేశారు. కాగా, ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరరు విజయన్, గవర్నరు రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌లు హాజరయ్యారు. నాగర్‌కోయిల్– మంగళూరు, తిరువనంతపురం– తాంబరం, తిరువనంతపురం–చర్లపల్లిలో మధ్య ప్రయాణించే మూడు అమృత్ భారత్ రైళు ,, త్రిసూర్– గురువాయూర్ మధ్య నడిచే ప్యాసింజర్ రైలును ఈ కార్యక్రమంలో మోడీ ప్రారంభించారు.



## 'ఇండోర్'లో మరోసారి కలుషిత నీరు పంపిణీ..
# తొమ్మిదిమంది ఆస్పత్రిపాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** 'స్వచ్ఛ నగరం'గా అవార్డులు పొందిన మధ్యప్రదేశ్‌లోని 'ఇండోర్'లో మరోసారి కలుషిత నీటితో ప్రజలు ఆస్పత్రి పాలయ్యారు. ఇండోర్ జిల్లాలోని మోవ్ తహసీల్‌లో కలుషిత నీరు తాగడంతో తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారని అధికారులు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి పట్టి బజామ్ మరియు చందర్‌మార్గ్ ప్రాంతాల్లో కలుషిత నీటి కారణంగా సంక్రమించే వ్యాధుల కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.ఇండోర్ కలెక్టర్ శివం వర్మ మోవ్‌కుచేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, బాధిత ప్రాంతాల్లోని నివాసితులతో మాట్లాడారని ఒక అధికారి తెలిపారు. తొమ్మిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మరి కొందరు ఇళ్లలో కోలుకుంటున్నారని అన్నారు.కొందరు ఆరోగ్య శాఖ సిబ్బంది సంఘటనా స్థలంలో పర్యటిస్తున్నట్లు చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (సిఎంహెచ్ఓ) ఒక ప్రకటనలో తెలిపారు. ఇండోర్ మెడికల్ కాలేజీ నుండి ఒక బృందం మరియు ఇతర వైద్య నిపుణులను కూడా ఆ ప్రాంతానికి పంపుతున్నామని అన్నారు. ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోందని అన్నారు. గత నెలలో, ఇండోర్‌లోని భగీరత్‌పుర ప్రాంతంలో అనేకమంది కలుషిత నీటితో అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. కలుషిత నీరు ఇప్పటివరకు 25మంది ప్రాణాలను బలిగొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, ఐదునెలల బాలుడు సహా ఏడు మరణాలు నమోదయ్యాయని మధ్యప్రదేశ్ ప్రభుత్వం 2026,జనవరి 15న హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది.

# పొగాకు, నికోటిన్ ఉత్పతులపై ఒడిశా బ్యాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజారోగ్యాన్ని కాపాడటానికి ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పొగాకు, నికోటిన్ ఉత్పత్తులపై ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. పొగాకు, నికోటిన్ కలిగిన అన్ని ఆహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకేజీ, నిల్వ, రవాణా, పంపిణీ లేదా, అమ్మకాలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధిస్తూ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. పొగాకు, నికోటిన్ ఉత్పత్తులతోపాటుగా, గుట్కా, పాన్‌మసాలలను బ్యాన్ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకనుగుణంగా ప్రజారోగ్యం దృష్ట్యా ఒడిశా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఒడిశా ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పొగాకు వాడకం వల్ల డిపెండెన్స్ సింద్రోమ్, నోరు, అన్నవాహిక, కడుపు, ప్యాంక్రియాటిక్, మూత్రపిండాల క్యాన్సర్ వస్తుంది. ఒడిశా వయోజన జనాభాలో 42 శాతం మంది పొగలేని పొగాకును ఉపయోగిస్తున్నారు. ఇది జాతీయ సగటు కంటే రెట్టింపు అని గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే తెలిపింది. అందుకే పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధిస్తున్నట్లు ఒడిశా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ పేర్కొంది.

# ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో వర్షం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. ఆకాశం దట్టంగా మబ్బులు పట్టి చీకటి అలుముకుంది. వర్షం, పొగ మంచు కారణంగా ఢిల్లీలో వాతావరణం మరింత చల్లగా మారిపోయింది. భారత వాతావరణ విభాగం (ఐఎండి) ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గాలివేగం గంటకు 40?60 కిమీ వరకు చేరే అవకాశం ఉంది. పశ్చిమ దిశ నుండి వచ్చే వాతావరణంలో అవంతారాలు (వెస్టర్న్ డిస్టబెన్స్) కారణంగా ఈ ఆకస్మిక వర్షానికి కారణమని ఐఎండీ స్పష్టం చేసింది. దీని ప్రభావంతో ఉత్తర భారతదేశంలో వర్షం, మంచు, చలి ఉంటుందని తెలిపింది. హిమాలయ పర్వత రాష్ట్రాలలో భారీ వర్షాలు, మంచు పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. జనవరి 27 వరకు వర్ష సూచన ఉందని ఐఎండి తెలిపింది. శు క్రవారం ఉదయం నుంచే ఢిల్లీలో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో వర్షం కురుస్తోంది. అంతేకాక, గణతంత్ర దినోత్సవం సందర్భంగా కర్తవ్య పథ్ వద్ద జరుగుతున్న రిహార్సల్ కార్యక్రమానికి కూడా అంతరాయం ఏర్పడింది.

# నైజీరియాలో ఆకలి కేకలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈశాన్య నైజీరియాలో హింస ప్రమాదకర స్థాయికి చేరిన నేపథ్యంలో దాదాపు పది లక్షల మంది ఆహారం అందక ఆకలితో అలమటించే పరిస్థితి తలెత్తింది. తమకు తక్షణ ఆర్థిక సాయం అందని పక్షంలో బాధిత నైజీరియన్లకు ఆహారం, లభించని విపత్కర పరిస్థితులు తలెత్తుతాయని ఐక్యరాజ్యసమితి ఆహార కార్యక్రమ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సంవత్సరం 3.5 కోట్ల మంది నైజీరియన్లు తీవ్ర ఆకలి ముప్పును ఎదుర్కోబోతున్నారని ఐరాస సంస్థ తెలిపింది. ఇంత పెద్ద స్థాయిలో ఆకలి తాండవించే పరిస్థితి నైజీరియాలో ఇంతకు ముందెన్నడూ తలెత్తలేదు. ప్రమాదకర హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో నిధులు లేక ఐరాస సంస్థ తన ఆహార సహాయాన్ని వచ్చే నెల నుంచి 72 వేల మందికి పరిమితం చేయనుంది. గత సంవత్సరం కష్ట కాలంలో ఈ సంస్థ 13 లక్షల మందికి ఆహారం అందించింది. ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమ సంస్థ 2015 నుంచీ ఈశాన్య నైజీరియాలో అన్నార్తులకు ఆహార సరఫరాలో పాల్గొంటోంది. అయితే ఇటీవలి కాలంలో నిధుల లేమితో బాధపడుతున్న ఈ సంస్థ సాయాన్ని గణనీయంగా తగ్గించేసింది. నైజీరియాలో తాజాగా తలెత్తిన హింసాకాండ 35 లక్షల మందిని వారి ఆవాసాలు వదిలి పారిపోయేలా చేసింది. ఉత్తర రాష్ట్రాల్లో ఆహార సరఫరాకు ఆటంకం ఏర్పడి పౌష్టికాహార లేమి సంక్షోభ స్థాయికి చేరుకుంది.

## అథావలే అడ్డగోలు వ్యాఖ్యలు
# ప్రజాస్వామికమంటూ కేరళ ఎల్‌డిఎఫ్ ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర మంత్రి రాందాస్ అథావలే కొత్త వివాదానికి తెరలేపారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో చేరాల్సిందిగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఆహ్వానించారు. ఎన్‌డిఎలో చేరితే రాష్ట్రానికి మరిన్ని కేంద్ర నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌డిఎతో చేతులు కలపడం విప్లవాత్మక అడుగు అవుతుందని అథావలే ప్రకటించారు. దీని ద్వారా కేరళకు నిధుల ప్రవాహం పెరుగుతుందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ నుంచి 'పెద్ద ప్యాకేజీ' లభిస్తుందని అన్నారు. నూతన ఏర్పాటు కింద కేరళ ముఖ్యమంత్రిగా పినరయి కొనసాగవచ్చునని చెప్పారు. అథావలే ప్రకటనపై అధికార ఎల్‌డిఎఫ్ తీవ్రంగా మండిపడింది. ఇలాంటి పిలుపులు అప్రజాస్వామికమని ధ్వజమెత్తింది. అథావలే వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ ఖండించారు. ఆ వ్యాఖ్యలు అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఇలాంటి చర్యలు భారత సమాఖ్య వ్యవస్థకు అవమానకరమని అన్నారు. రాజ్యాంగ సూత్రాలపై ఆర్‌ఎస్‌ఎస్ జరుపుతున్న అతిక్రమణలను ఇవి ప్రతిబింబిస్తున్నాయని. అథావలే ప్రకటన నయా ఫాసిజం వైపు అడుగులు వేస్తున్నట్లు ఉన్నదని వ్యాఖ్యానించారు. కేరళ రాజకీయ చరిత్రపై కేంద్ర మంత్రికి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలతో సిపిఎం దీర్ఘకాల సైద్ధాంతిక పోరాటం సాగిస్తోందని గుర్తు చేశారు. మతతత్వంపై రాజీ పడబోమని గోవిందన్ స్పష్టం చేశారు. మత వైఖరిని ప్రదర్శించే వారిని సిపిఎం వ్యతిరేకిస్తుందని చెప్పారు. మతతత్వం అంటే ఏమిటో, లౌకికవాదం అంటే ఏమిటో పార్టీకి స్పష్టత ఉన్నదని అన్నారు. మతతత్వ వ్యతిరేకతే సిపిఎం హాల్‌మార్క్ అని గోవిందన్ వ్యాఖ్యానించారు. మతతత్వం గురించి ఎవరు ఎంత గొప్పగా చెప్పినా పార్టీ దానిని అంగీకరించదని స్పష్టం చేశారు.

## గేట్ వేయకపోవడంతో ఘోర ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** జార్ఖండ్‌లో ఓ రైల్వే గేట్ వద్ద ఒళ్లు గగుర్పొడిచే ప్రమాదం చోటు చేసుకుంది. గేట్ వేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టమూ సంభవించలేదు. ఆ యాక్సిడెంట్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.ఝార్ఖండ్‌లోని దేవ్‌ఘర్ జిల్లాలోని నవాదిహ్ రైల్వే క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ జామ్ కారణంగా ఓ భారీ ట్రక్కు. రైలు పట్టాలపై నిలిచిపోయింది. అదే సమయంలో ఆ ట్రాక్ గుండా గోండా–అసన్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చింది. ముందు భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రక్కు ముందుకు వెళ్లలేక ట్రాక్ పైనే నిలిచిపోయింది. దీంతో ఆ రైలు, ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. లోకో పైలెట్ త్వరగా స్పందించి రైలు వేగాన్ని తగ్గించారు. దీంతో ట్రక్కును ఢీకొట్టిన రైలు అక్కడే ఆగిపోయింది.ఈ ప్రమాదంలో ట్రక్కు పూర్తిగా దెబ్బతింది

# అమెరికాలో 5 ఏళ్ల బాలుడి అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఐదేళ్ల బాలుడిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకోవడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. మిన్నసోటా రాష్ట్రంలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎఅఇ) ఏజెంట్లు ఈ చర్యకు పాల్పడగా, ఈ ఘటనపై రాజకీయంగా పెద్ద దుమారం రేగింది. బాలుడిని 'ఎర'గా వాడుకున్నారని పాఠశాల అధికారులు ఆరోపిస్తుండగా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (ఆఉఊ) ఈ ఆరోపణలను ఖండించింది. ఈ ఘటనపై అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇండియా టుడే' కథనం ప్రకారం "లియామ్ రామోస్ ఇంకా పసివాడు. అతడిని ఐస్ ఏజెంట్లు ఎరగా వాడటం దారుణం. ఇది నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది" అని ఆమె అన్నారు. అయితే, ఈ ఆపరేషన్‌ను ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమర్థించారు. చట్టాన్ని అమలు చేస్తున్న అధికారులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. మంగళవారం కొలంబియా హైట్స్‌లో 5 ఏళ్ల లియామ్ రామోస్, అతడి తండ్రి ఏడ్రియన్ ఏరియాస్‌ను వారి ఇంటి వద్ద ఐస్ ఏజెంట్లు అదుపులోకి తీసుకున్నారు. ఏజెంట్లు బాలుడి చేత ఇంటి తలుపు తట్టించి, లోపల ఎవరైనా ఉన్నారేమోనని చూశారని, ఇది బాలుడిని ఎరగా వాడటమేనని స్కూల్ సూపరింటెండెంట్ జెనా స్టెన్‌విక్ ఆరోపించారు. కానీ, బాలుడి తండ్రి పారిపోవడానికి ప్రయత్నించాడని, ఆ సమయంలో బాలుడి భద్రత కోసమే తమ అధికారులు అతడితో ఉన్నారని డీహెచ్ఎస్ వాదిస్తోంది. ప్రస్తుతం తండ్రీకొడుకులిద్దరినీ టెక్సాస్‌లోని డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వారిని అదుపులోకి తీసుకున్నారని కుటుంబ న్యాయవాది తెలిపారు. గత రెండు వారాల్లో ఈ స్కూల్ డిస్ట్రిక్ట్ నుంచి ఐస్ ఏజెంట్ల చేతికి చిక్కిన నాలుగో విద్యార్థి లియామ్ కావడం గమనార్హం.

# ట్రంప్ 'శాంతి' బోర్డుపై ఎలాన్ మస్క్ సెటైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (చిఇఈ) సదస్సులో పాల్గొన్న ఆయన, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన 'బోర్డ్ ఆఫ్ పీస్'పై (శాంతి బోర్డు) వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బ్లాక్‌రాక్ సీఈఓ లారీ ఫింక్‌తో కలిసి ఒక ప్యానెల్ చర్చలో పాల్గొన్న మస్క్, ట్రంప్ 'శాంతి బోర్డు' గురించి విన్నప్పుడు, అది 'శాంతి' (ఖవజీఇవ) కాదేమో, బహుశా 'ముక్క' (ఖతివఇవ) అనుకున్నానని చమత్కరించారు. "గ్రీన్‌లాండ్‌లో ఒక ముక్క, వెనిజులాలో ఒక ముక్క అన్నట్లుగా నాకు వినిపించింది" అని వ్యాఖ్యానించారు. గాజా కాల్పుల విరమణ ప్రణాళికను పర్యవేక్షించేందుకు ట్రంప్ ఈ బోర్డును ఏర్పాటు చేయగా, ఇప్పుడు దాని పరిధిని విస్తరిస్తున్నారు. ఇదే చర్చలో భవిష్యత్తులో రోబోలు సమాజాన్ని పూర్తిగా మార్చేస్తాయని మస్క్ జోస్యం చెప్పారు. మానవ శ్రమ అవసరం తగ్గిపోతుందని, వస్తువులు, సేవల లభ్యత విపరీతంగా పెరుగుతుందని అన్నారు. ఒకానొక దశలో మనుషుల కంటే రోబోల సంఖ్యే ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. వృద్ధులను, పిల్లలను చూసుకోవడానికి ప్రతి ఒక్కరికీ రోబో అవసరమవుతుందని, వచ్చే ఏడాది చివరికల్లా టెస్లా రోబోలను ప్రజలకు అమ్మడం ప్రారంభిస్తుందని ప్రకటించారు. గతంలో దావోస్ సదస్సును 'ప్రజలు కోరుకోని, ఎన్నుకోబడని ప్రపంచ ప్రభుత్వం' అంటూ తీవ్రంగా విమర్శించిన మస్క్, ఇప్పుడు అదే సదస్సుకు హాజరుకావడం గమనార్హం. ట్రంప్‌కు మద్దతుదారుగా ఉంటూనే, ఆయనతో గతంలో విభేదించి మళ్లీ సయోధ్య కుదుర్చుకున్న నేపథ్యంలో మస్క్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# దానితో మాకేం సంబంధం?




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌లాండ్ స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలతో తమకేమీ సంబంధం లేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. గ్రీన్‌లాండ్ వ్యవహారం తమకు సంబంధించింది కాదని అన్నారు. గ్రీన్‌లాండ్‌కు ఏం జరుగుతుందో తమకెందుకని రష్యా జాతీయ భద్రతా మండలి సమావేశం సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. అయితే గ్రీన్‌లాండ్ పట్ల డెన్మార్క్ అవలంబించిన కఠిన వైఖరిని పుతిన్ ప్రశ్నించారు. 'వాస్తవానికి గ్రీన్‌లాండ్‌ను ఓ కాలనీగా డెన్మార్క్ పరిగణించింది. అమానుషంగా కాకపోయినా కఠినంగా వ్యవహరించింది. కానీ అది వేరే సంగతి. దానిపై ఎవరికైనా ఆసక్తి ఉన్నదా అని నా అనుమానం. గ్రీన్‌లాండ్‌తో మాకేమీ సంబంధం లేదు. సమస్యను వారిలో వారే పరిష్కరించుకుంటారని అనుకుంటున్నాను' అని చెప్పారు. 1867లో అమెరికాకు అలాస్కాను కేవలం 7.2 మిలియన్ డాలర్లకు విక్రయించామని, ఇప్పుడు దాని విలువ 158 మిలియన్ డాలర్లు అని పుతిన్ చెప్పారు. అలస్కాతో పోలిస్తే గ్రీన్‌లాండ్ విస్తీర్ణం కొంత ఎక్కువ ఉండవచ్చునని, అలస్కాను అమెరికా కొనుగోలు చేసిన సమయంలో గ్రీన్‌లాండ్ ధర 200 మిలియన్ డాలర్ల నుంచి 250 మిలియన్ డాలర్లు ఉండవచ్చునని తెలిపారు. కాగా గ్రీన్‌లాండ్ వ్యవహారంతో తమకేమీ సంబంధం లేదని పుతిన్ చెబుతుండగా ట్రంప్ వాదన మరోలా ఉంది. ఒకవేళ తాను గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోకపోతే చైనా, రష్యాల నుంచి దానికి ముప్పు ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## కెనడాకు పంపిన ఆహ్వానాన్ని వెనక్కి తీసుకున్న ట్రంప్


**హైదరాబాద్ పెన్ పవర్:** కెనడా ప్రధాని మార్క్ కార్నీ దావోస్ వేదికగా ట్రంప్ 'గ్రీన్‌లాండ్' సుంకాలను తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గాజా శాంతి మండలిలో చేరాలని కెనడాకు పంపిన ఆహ్వానాన్ని ట్రంప్‌వెనక్కి తీసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో తన నిర్ణయాన్ని వెలువరించారు. ఇప్పటివరకు ఏర్పాటైన ప్రతిష్టాత్మక బోర్డులలో గాజా శాంతి మండలి కూడా ఒకటని తెలిపారు. దావోస్‌లో ఇటీవల నిర్వహించిన సమావేశంలో కార్నీ మాట్లాడుతూ.. అమెరికా ఆధిపత్యంలో ప్రపంచం పరివర్తన వైపు కాకుండా విచ్ఛిన్నం వైపు వెళ్తుందన్నారు. ఒకప్పుడు భాగస్వామ్య దేశాల శ్రేయస్సు కోసం చేసుకున్న ఆర్థిక ఒప్పందాలను ఇప్పుడు పైస్థానంలో ఉన్నవారు ఆయుధంగా ఉపయోగించుకుంటు న్నారన్నారు. బలవంతులు తమ సొంత ప్రయోజనాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ.. అసమానమైన వాణిజ్య నియమాలను అమలుచేస్తున్నారని మండిపడ్డారు. ఇంతకాలం భౌగోళిక పరిస్థితులు, ప్రపంచదేశాలతో పొత్తులు మాత్రమే దేశ శ్రేయస్సు, భద్రతకు హామీ ఇస్తాయని నమ్మేవాళ్లమని.. ఆ నమ్మకాలు ఇక ఎప్పటికీ తిరిగి రావన్నారు.

## అమెజాన్‌లో రెండో విడత ఉద్యోగాల తొలగింపునకు సన్నాహాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది. మొత్తం 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తగ్గించుకోవాలన్న లక్ష్యంలో భాగంగా వచ్చే వారం రెండో విడత తొలగింపు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా దాదాపు 15,000 మందిని తొలగించే అవకాశం ఉందని సమాచారం. ఈ లేఆఫ్స్ ప్రభావం అమెజాన్ వెబ్ సర్వీసెస్ , రిటైల్, ప్రైమ్ వీడియో, హ్యూమన్ రిసోర్సెస్ విభాగాలపై పడనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ ప్రణాళికల్లో మార్పులు ఉండొచ్చని కూడా పేర్కొన్నాయి. గతేడాది అక్టోబర్‌లో అమెజాన్ సుమారు 14,000 మంది ఉద్యోగులను తొలగించింది. వారికి కల్పించిన 90 రోజుల గడువు సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో మంగళవారం నుంచే కొత్త లేఆఫ్స్ ప్రక్రియ మొదలుకావచ్చని అంచనా వేస్తున్నారు. గత తొలగింపుల సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరుగుదలే కారణమని కంపెనీ అంతర్గతంగా తెలిపింది. అయితే, సీఈఓ ఆండీ జెస్సీ మాత్రం ఇది ఆర్థిక లేదా ఏఐ ప్రేరేపిత నిర్ణయం కాదని, కంపెనీలో పెరిగిన బ్యూరోక్రసీని, అనవసరమైన లేయర్లను తగ్గించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మొత్తం 30,000 ఉద్యోగాల కోత పూర్తయితే, ఇది అమెజాన్ మూడు దశాబ్దాల చరిత్రలోనే అతిపెద్ద తొలగింపు అవుతుంది. 2022లో కంపెనీ సుమారు 27,000 మందిని తొలగించింది. ఈ 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగుల్లో దాదాపు 10శాతం అయినప్పటికీ, సంస్థ మొత్తం 15.8 లక్షల మంది ఉద్యోగులతో పోలిస్తే ఇది చాలా తక్కువ.

## భవిష్యత్తు బంగారం ‘వెండి’నే టెక్నాలజీ యుగంలో తిరుగులేని శక్తిగా వైట్



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వెండి కేవలం ఒక ఆభరణంగానో లేదా పెట్టుబడిగానో మాత్రమే కాకుండా, అంతకు మించిన కీలక పాత్రను పోషిస్తోందని ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకి విశ్లేషించారు. గతంలో వెండిని కేవలం డబ్బుకు ప్రత్యామ్నాయంగా మాత్రమే చూసేవారని, కానీ ఇప్పుడు అది ఒక “స్ట్రక్చరల్ మెటల్”గా రూపాంతరం చెందిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ వెండికి ఉండే డిమాండ్ ఊహించని రీతిలో పెరుగుతోందని, ఇది ముమ్ముందు ఆర్థిక మార్కెట్లలో పెను మార్పులకు దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమల పరంగా చూస్తే, వెండి వినియోగం ఇప్పుడు అడ్డూఅదుపు లేకుండా విస్తరిస్తోంది. ముఖ్యంగా పర్యావరణ హితమైన ఇంధన వనరుల తయారీలో, అంటే సోలార్ ప్యానెల్స్‌లో వెండి వినియోగం అత్యంత కీలకంగా మారింది. దీనితో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్‌ఫోన్లు మరియు సెమికండక్టర్ల తయారీలో వెండికి మరే ఇతర లోహం సాటిరాదు. ఎలక్ట్రిక్ వాహనాల (ఇఎ) రంగం పుంజుకుంటున్న తరుణంలో, వాటి బ్యాటరీలు మరియు సర్క్యూట్లలో వెండి వాడకం పెరగడం వల్ల ఈ లోహానికి భవిష్యత్తులో కొరత ఏర్పడే అవకాశం కూడా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత శతాబ్దంలో జరిగిన పారిశ్రామిక విప్లవం సమయంలో ఇనుము ఏ విధంగానైతే దేశాల పురోగతిని నిర్దేశించిందో, ప్రస్తుత డిజిటల్ మరియు టెక్ యుగంలో వెండి అదే స్థాయి ప్రాధాన్యతను సంతరించుకుందని కియోసాకి పోల్చారు. ఇనుము లేకుండా అప్పట్లో భవనాలు, యంత్రాల నిర్మాణం ఎలా సాధ్యం కాలేదో, ఇప్పుడు వెండి లేకుండా హైటెక్ పరికరాల తయారీ అలాగే అసాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వెండిని కేవలం విలువైన లోహంగా కాకుండా, ఆధునిక ప్రపంచ నిర్మాణానికి పునాదిగా భావించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. పెట్టుబడిదారుల దృక్కోణంలో చూస్తే, రాబోయే రోజుల్లో వెండి ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. పారిశ్రామిక అవసరాలు పెరగడం మరియు భూగర్భంలో వెండి నిల్వలు పరిమితంగా ఉండటం వల్ల దీని విలువ బంగారాన్ని మించి వృద్ధి చెందే అవకాశం ఉంది. అందుకే స్మార్ట్ ఇన్వెస్టర్లు వెండిని ఒక దీర్ఘకాలిక ఆస్తిగా పరిగణించాలని, ఇది కేవలం సంపదను కాపాడటమే కాకుండా టెక్నాలజీ అభివృద్ధిలో భాగస్వామిగా మారుతుందని కియోసాకి తన విశ్లేషణలో వెల్లడించారు.

## అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్లు: దావోస్‌లో ఎలాన్ మస్క్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ దావోస్ కేంద్రంగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్) కార్యక్రమంలో తొలిసారిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను మస్క్ ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), రోబోల భవిష్యత్తు గురించి మాట్లాడిన ఎలన్ మస్క్.. ఈ సాంకేతికతలు త్వరలో మనం జీవించే, పని చేసే విధానాన్ని మారుస్తాయి. ఏఐ భూమ్మీద ఉన్న మానవుల కంటే తెలివైనదిగా మారగలదని, ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు, పరిశ్రమలను పునర్నిర్మించగలదని అన్నారు.

ఈ సందర్భంగా.. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత డేటా సెంటర్‌లను అంతరిక్షంలో నిర్మించవచ్చని మస్క్ అన్నారు. ప్రస్తుతం, ఏఐ వ్యవస్థలకు భారీ మొత్తంలో ఎనర్జీ, కూలింగ్ అవసరం, వీటిని భూమిపై అందించడం కష్టం. అంతరిక్షంలో అన్నివేళలా లభించే సూర్యకాంతి, నేచురల్ కూలింగ్‌తో ఏఐ కంప్యూటర్లు మరింత చౌకగా, ప్రభావవంతంగా పనిచేయగలవని మస్క్ అభిప్రాయపడ్డారు. చాలామంది శాస్త్రవేత్తలు ఇది ఇప్పటికీ భవిష్యత్తుకు సంబంధించినదని చెబుతున్నప్పటికీ, మరో కొన్ని సంవత్సరాలలో ఇది జరగవచ్చని నమ్ముతున్నట్టు మస్క్ తెలిపారు. తన కంపెనీలు ‘ఆప్టిమస్’ అనే హ్యూమనాయిడ్ రోబోట్ల తయారీలో వేగంగా పురోగతి సాధిస్తున్నాయని మస్క్ స్పష్టం చేశారు. ఈ రోబోట్లను నిజ జీవితంలో ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఫ్యాక్టరీలలో పనిచేయడం, దుకాణాలలో సహాయం చేయడం లేదా సాధారణ రోజువారీ పనులు చేయడం వంటి మనుషుల పనులను చేయడానికి ఆప్టిమస్‌ను నిర్మిస్తున్నాం. ఈ రోబోట్లు త్వరలోనే రోజువారీ జీవితంలోకి వస్తాయని, ప్రజలకు వారి రోజువారీ పనులలో సహాయపడతాయని వెల్లడించారు.

## అనంత్ అంబానీ పేరుతో రూ. 14 కోట్ల స్పెషల్ వాచ్

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ లగ్జరీ వాచ్‌ల తయారీ సంస్థ జాకబ్ అండ్ కో సరికొత్త వాచ్‌ను విడుదల చేసింది. దీని ఖరీదు సుమారు 1.5 మిలియన్ డాలర్లు, అంటే మన కరెన్సీలో ఏకంగా రూ.13.7 కోట్లు ఉంటుంది. ఒపెరా వంతారా గ్రీన్ కామో పేరుతో తెచ్చిన ఈ వాచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఈ వాచ్‌ను రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, నీతా అంబానీల చిన్న కుమారుడు అనంత్ అంబానీ గుజరాత్‌లో నిర్వహిస్తున్న వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం వంతారాకు అంకితమిస్తూ రూపొందించారు. దీని ధర కోట్లలో ఉన్నప్పటికీ, వన్యప్రాణుల సంరక్షణకు గుర్తుగా తీసుకురావడం అంతకు మించి విలువైనదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఒపెరా వంతారా గ్రీన్ కామో కేవలం సమయాన్ని మాత్రమే సూచించదు, ఇది ఒక కథను చెబుతుందని జాకబ్ అండ్ కో కంపెనీ అభిప్రాయపడింది. డిజైన్ పరంగా ఈ వాచ్ డయల్ మధ్యలో చేత్తో చిత్రించిన అనంత్ అంబానీ అతిచిన్న బొమ్మ ఉంటుంది. దానికి ఇరువైపులా చిన్న సైజ్ సింహం, బెంగాల్ పులి శిల్పాలు ఉన్నాయి. ఇక, ఈ వాచ్ కేస్, డయల్‌పై డెమంటాయిడ్ గార్నెట్‌లు, సఫోరైట్‌లు, ఆకుపచ్చ నీలమణి, తెల్లటి వజ్రాలతో సహా మొత్తం 21.98 క్యారెట్ల బరువున్న 397 రత్నాలను పొదిగారు. ఈ రత్నాలు కళాత్మకంగా డయల్, కేస్ చుట్టూ ఒక చిన్న అటవీ ప్రకృతి దృశ్యంలా డిజైన్ చేసినట్టు కంపెనీ వెల్లడించింది.

# తెలుగు సినిమా స్వర్ణయుగ రారాణి

**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణకుమారి (మార్చి 6, 1933 – జనవరి 24, 2018) పాత తరం సినిమా కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 25 సంవత్సరాలకు పైగా 150 పై చిలుకు చిత్రాల్లో నటించారు. మూడు జాతీయ పురస్కారాలు, రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు అందుకున్నారు. సావిత్రికి సమకాలీన నటి అయిన ఆమె షావుకారి జానకికి సొంత చెల్లెలు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్,, కృష్ణ, శివాజీ గణేశన్ వంటి దిగ్గజాలతో ఆమె అనేక సినిమాల్లో నటించారు. పశ్చిమ బెంగాల్ లోని నైహతిలో ఓ తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో 1933లో జన్మించారు కృష్ణ కుమారి. వెంకోజి రావు, సచీ దేవి ఆమె తల్లిదండ్రులు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి వీరి స్వస్థలం. వేదాంతం జగన్నాథ శర్మ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ఒకసారి ఆమె తల్లితో సహా స్వప్న సుందరి సినిమా చూడడానికి వెళితే అక్కడకి సౌందరరాజన్ గారి అమ్మాయి భూమాదేవి కూడా వచ్చింది. సినిమా హాల్లో కృష్ణ కుమారిని చూసిన ఆమె నవ్వితే నవరత్నాలు సినిమా కోసం అమా యకంగా కనిపించే కథా నాయిక కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. తర్వాత రోజే వారు కృష్ణ కుమారి ఇంటికి వచ్చి తల్లిదండ్రుల అను మతి తీసుకొని ఆమెకు ఆ పాత్ర నిచ్చారు. అలా తెలుగు సినిమా తెరకు 1951 లో నిర్మించిన నవ్వితే నవరత్నాలు సినిమా ద్వారా పరిచయం అయ్యా రు. కానీ దానికంటే ముందు మంత్ర దండం అనే సినిమా విడుదలైంది. తొలి చిత్రంలో నటిస్తుండగానే ఆమెకు 14 సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పటికి ఆమె వయసు కేవలం 16 ఏళ్ళు మాత్రమే. తర్వా త 1953లో తాతినేని ప్రకాశరావు యన్.ఎ.టి.వారి పిచ్చి పుల్లయ్యలో కథానాయిక వేషం వేయించారు. అందులో మంచి నటన ప్రదర్శించిన కృష్ణకుమారికి పినిశెట్టిగారి పల్లె పడుచు, బంగారు పాప వంటి మంచి చిత్రాలతో పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జానపద చిత్రాల కథానాయికగా, అభినయ రాజకుమారిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి కృష్ణకుమారి. అసమాన నటన తో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసిన ఆమె తెలుగు చిత్రసీమలో విలక్షణ నటిగా తనకంటూ ప్రత్యేకతను చాటు కున్నారు. తరువాత ఇలవేల్పు, జయ విజయ, అభిమానం, దేవాం తకుడు మొదలైన చిత్రాలలో వివిధ కథానాయకుల సరసన నటించినా, తన నటనకు గుర్తింపుతెచ్చిన చిత్రా లు కె.ప్రత్యగాత్మగారి భార్యాభర్తలు (1961), కులగోత్రాలు (1962). 1963లో లక్షాధికారి, బందిపోటు, ఎదురీత, కానిస్టేబుల్ కూతురు చిత్రాల్లో వైవిధ్యం ఉన్న పాత్రలు వేశారు. ప్రభుత్వ బహుమతి పొందిన జగపతీ పిక్చర్స్ వారి అంతస్థులులో నాయికగా నటిం చారు. 1967-68 మధ్య కాలంలో ఉమ్మడి కుటుంబం, భువన సుందరి కథ, రహస్యం, చిక్కడు దొరకడు, స్త్రీ జన్మ వంటి చిత్రాలలో వైవిధ్యమున్న పాత్రలు పోషించారు. వరకట్నంలో నాయికగా గ్లామరస్ పాత్ర తర్వాత చిత్రాలు తగ్గి 1970 దశాబ్దంలో కొన్ని చిత్రాలలో నటించ గలిగారు. సుమారు రెండు దశాబ్దాల నట జీవితంలో ఆమె సుమారు 150 సినిమాలలో నటించారు. వాటిలో ఎక్కువగా తెలుగు సినిమాలైతే, 15 కన్నడ చిత్రాలు, కొన్ని తమిళ భాషా చిత్రాలు. మూడు భాషల చిత్రా ల్లోనూ ఆమే స్వయంగా డబ్బింగ్ చెప్పు కోవడం విశేషం. ఆమె ఆనాటి నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, కాంతారావు, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్, అందరు మహా నటులతోను నటించి మెప్పించారు. కాంతారావుతో కలిసి 28 జానపద చిత్రాల్లో నటించారు. 1963 లో కృష్ణ కుమారి 16 సినిమాల్లో కథానాయి కగా నటించారు. ఒక్క ఏడాదిలో అత్యధిక సినిమాల్లో కథానాయికగా నటించడంలో ఆమె రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. ఇందు కోసం ఆమె మూడు నెలలపాటు మూడు షిఫ్టులు ఖాళీ లేకుండా పనిచేశారు. బాలీవుడ్ లో కిశోర్ కుమార్ తో ఒకే ఒక సినిమాలో కథానాయికగా నటించారు. అప్పటికి హిందీ చిత్ర పరిశ్రమలో కృష్ణకుమారి పేరుతో వేరే నటి ఉండటంతో రతి అనే పేరుతో పరిచయం అయినారు. వద్దంటే పెళ్లి, గంగా గౌరీ సంవాదం, సతీ సుకన్య, రమా సుందరి, జయ విజయ, పెళ్లి కానుక, దేవాంత కుడు, వినాయక చవితి, ఇరుగు పొరుగు, అగ్గిపిడుగు, మర్మయోగి, ఉమ్మడి కుటుంబం, లక్షాధికారి, బందిపోటు, బంగారు భూమి, గుణవంతుడు, జేబుదొంగ, యశోద కృష్ణ, దేవదాసు, నేరము శిక్ష, మానవుడు దానవుడు, భార్య బిడ్డలు, తల్లా పెళ్లామా, శ్రీకృష్ణావ తారం, అంతస్తులు, గుడి గంటలు, డాక్టర్ చక్రవర్తి, చదువుకున్న అమ్మా యిలు ఎదురీత, కులగోత్రాలు, భార్యాభర్తలు, శభాష్‌రాజా, దీపా వళితో పాటు పలు సినిమాలు ఆమె నటనా ప్రతిభకు తార్కా ణాలుగా నిలిచాయి. ఇండియన్ ఎక్స్ ప్రెస్ మాజీ ఎడిటర్, స్క్రీన్ మేగజైన్ వ్యవ స్థాపకులు, బిజినెస్ మాన్ అయిన కర్ణాటకకు చెందిన అజయ్ మోహన్ కైతాన్ ను కృష్ణ కుమారి పెళ్లి చేసు కున్నారు. ఆమెకు చిన్నప్పటి నుండి భానుమతి అంటే చాలా ఇష్టం. ఆమెతో కలిసి కులగోత్రాలు, పుణ్య వతి సినిమాల్లో నటించినప్పుడు ఎంతో థ్రిల్ ఫీలయ్యానని, మహా నటి సావిత్రి తనను స్వంత చెల్లెల్లా చూసుకొనేదని చేపుతుండే వారు. ఆమెకు మూడుసార్లు జాతీయ అవార్డులు, రాష్ట్రస్థాయిలో నంది అవార్డులు వచ్చాయి. ఆమె కాంచన మాల, సావిత్రి, ఎన్టీయార్ అవార్డులు గెలుచుకున్నారు. బ్రిటన్ లోని బర్మింగ్ హాం సంస్థ వారి లైఫ్ టైం అచీవ్‌ట్ అవార్డు పొందారు. కృష్ణ కుమారి 2018, జనవరి 24 ఉదయం బెంగుళూరులో అనారోగ్యంతో మరణించారు.

# విద్యతోనే మానవతా విలువలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రతి సంవత్సరం జనవరి 24న జరుపుకునే అంతర్జాతీయ విద్యా దినోత్సవం విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించేందుకు, ప్రపంచానికి చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రత్యేకమైన రోజు. ఈ దినోత్సవాన్ని 2018 డిసెంబరు 3న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించింది. ప్రజల శ్రేయస్సు, సమానత్వం, శాంతి, అభివృద్ధి వంటి మానవతా విలువల సాధనకు విద్య ముఖ్యమైన సాధనంగా నిలుస్తుందని ఈ దినోత్సవం చాటిచెబుతుంది. విద్య అంటే కేవలం పుస్తకాలు చదవడం లేదా పట్టాలు పొందడమే కాదు. ఇది వ్యక్తి జీవితానికి విలువలను, సామాజిక బాధ్యతలను, విజ్ఞానాన్ని అందించే సాధనం. విద్య వ్యక్తి వ్యక్తిత్వాన్ని మెరుగుపరచి సమాజంలో సాంకేతికత, ఆర్థిక, మరియు సామాజిక రంగాలలో దోహదం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విద్యా లేమి పేదరికానికి కారణమైతే, విద్య అనేది దాని పరిష్కారానికి ప్రధాన మార్గం. లింగ వివక్ష లేకుండా బాలురు, బాలికలందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పిస్తుంది. గౌరవం, సహనం, సహకారం వంటి విలువలను బోధించడంతో, అది శాంతియుత సమాజాల నిర్మాణానికి తోడ్పడుతుంది. అంతర్జాతీయ విద్యా దినోత్సవం పలు ప్రధాన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తుంది: పిల్లలు, యువతలు, పెద్దవారికి కూడా సమాన విద్యావకాశాలను కల్పించడం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యను నాణ్యంగా మార్చడం. చిన్న వయస్సు నుంచే బాలికలకు కూడా సమాన విద్యను అందించేందుకు శ్రద్ధ చూపడం. విద్యా వ్యవస్థలను మెరుగుపరచి సమాజానికి సేవ చేయడంలో వాటి సామర్థ్యాన్ని పెంచడం. యునెస్కో నివేదికలు సూచించినట్లుగా, ఇంకా 244 మిలియన్ల మంది పిల్లలు, యువత ప్రాథమిక విద్యకు దూరంగా ఉన్నారు. ముఖ్యంగా పేద దేశాల్లో బాలికలు విద్యకు దూరమవుతున్నారు. పేదరికం, నిరుద్యోగం, మరియు సామాజిక అసమానతలు విద్య లేకపోవడం వల్ల మరింత పెరుగుతున్నాయి. అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అనేక సంస్థలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు విశేష కార్యకలాపాలు నిర్వహిస్తాయి. విద్యకు సంబంధించిన సమస్యలపై మరియు పరిష్కార మార్గాలపై చర్చించబడుతుంది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారి ప్రతిభను ప్రదర్శిస్తారు. పేద పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం, వారి కోసం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. విద్యా హక్కు గురించి ప్రజలలో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తారు. 2030 దిశగా లక్ష్యాలు :అందరికీ నాణ్యమైన విద్యను అందించడం. పేదరికం మరియు లింగ అసమానతలను తగ్గించడం. సాంకేతికత ద్వారా విద్య: ఇ-లెర్నింగ్ మరియు ఆన్‌లైన్ విద్యా విధానాలను ప్రోత్సహించడం. విద్యా పునాదులను బలపరచడం ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించడం. అంతర్జాతీయ విద్యా దినోత్సవం విద్యకు ఉన్న విశేషమైన ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. ఈ దినం మనకు ఒక గుర్తు ? ప్రతి ఒక్కరికీ విద్య అందించే కర్తవ్యాన్ని గుర్తించడం. విద్య అనేది కేవలం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు మార్గదర్శిగా నిలుస్తుంది. “విద్య అంధకారాన్ని తొలగించే దీపం, జ్ఞానాన్ని వెలిగించే కాంతి.” అందుకే, ప్రతి ఒక్కరం విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, ఆ వెలుగును ప్రపంచమంతా విస్తరించాలనే దిశగా ముందుకు సాగుదాం.

## సైయెంట్ లాభం రూ.92 కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ లిమిటెడ్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.1,848.5 కోట్ల ఆదాయంపై రూ.91.8 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.1,926.4 కోట్లు, నికర లాభం రూ.122.3 కోట్లుగా ఉంది. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో నికర లాభం 24.9% తగింది. కొత్త లేబర్ కోడ్ అమలు కోసం రూ.42.3 కోట్లు కేటాయించడం, సంస్థ లాభాలపై ప్రభావం చూపింది. సెమీ కండక్టర్ రంగంలో బలోపేతం: సైయెంట్ డిజిటల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) విభాగ ఆదాయం ఏడాది వ్యవధిలో రూ.1,397.5 కోట్ల నుంచి రూ.1,488.3 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో ఆదాయం రూ.5341.3 కోట్లు, నికర లాభం రూ.373.1 కోట్లుగా ఉన్నాయి. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.545.12 కోట్లు, నికర లాభం రూ.445.3 కోట్లుగా ఉన్నాయి. భవిష్యత్తు వృద్ధిని దృష్టిలో పెట్టుకుని, సెమీకండక్టర్ల రంగంలో తన ఉనికిని బలోపేతం చేసుకునేందుకు కైనెటిక్ టెక్నాలజీస్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేసేందుకు రూ.836.6 కోట్లతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. నిర్వహణాపరమైన మార్పుల్లో భాగంగా నార్వే శాఖతో పాటు సైయెంట్ ఇజ్రాయెల్ ఇండియా లిమిటెడ్‌నూ మూసివేస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. క్లిష్టమైన స్థూల ఆర్థిక పరిస్థితుల్లోనూ, కంపెనీ వృద్ధి పథంలోనే ఉందని సైయెంట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ బొదనపు తెలిపారు. తమ నగదు నిల్వలు, లాభదాయకత భవిష్యత్తు వృద్ధికి భరోసానిస్తున్నాయని పేర్కొన్నారు. డీఈటీ విభాగంలో కొత్త నాయకత్వం వృద్ధిని నడిపిస్తోందని, ఈ త్రైమాసికంలో 8 కొత్త ఒప్పందాలు సాధించామని కంపెనీ సీఈఓ సుకమల్ బెనర్జీ తెలిపారు.

## 78 శాతం క్షీణించిన ఇండిగో లాభాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**గత నెలలో పెద్ద ఎత్తున విమానాలను రద్దు చేసిన నేపథ్యంలో ఎయిర్‌లైన్ కంపెనీ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ డిసెంబర్ త్రైమాసికంలో భారీగా లాభాలను కోల్పోయింది.

గురువారం కంపెనీ ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో రూ. 549.1 కోట్ల లాభాలను పేర్కొంది. ఇది గతేడాది వచ్చిన రూ. 2,448.8 కోట్ల లాభాలతో పోలిస్తే ఏకంగా 78 శాతం క్షీణత కావడం గమనార్హం. కేంద్రం ప్రభుత్వం తెచ్చిన కొత్త లేబర్ కోడ్స్, డిసెంబర్‌లో కంపెనీ ఎదుర్కొన్న విమాన సేవల్లో అంతరాయం వల్ల కంపెనీ లాభాలకు గండిపడింది. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, కొత్త లేబర్ కోడ్స్ అమలు చేసేందుకు రూ. 969 కోట్లు, గత నెలలో ఏర్పడిన కార్యకలాపాల అంతరాయం వల్ల మరో రూ. 577 కోట్లు ఖర్చు చేశామని ఇండిగో తెలిపింది. తద్వారా ఈ త్రైమాసికంలో కంపెనీకి రూ. 1,546 కోట్ల భారం పడింది. ఇక, ఈ త్రైమాసికంలో ఇండిగోకు రూ. 24,540.6 కోట్ల ఆదాయాన్ని వెల్లడించింది. ఇది గతేడాది వచ్చిన రూ. 22,992.8 కోట్లతో పోలిస్తే పెరిగింది.

## ఇరాన్ దిశగా అమెరికా సైన్యం: మరోసారి ట్రంప్ హెచ్చరికలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆందోళనకారులను అణచివేస్తోన్న ఇరాన్‌పై సైనిక చర్యకు సిద్ధమైన అమెరికా.. చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ దేశంలో ఉద్రిక్తతలు చల్లారకపోవడంతో ఇరాన్ పాలకులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. ఇప్పటికే ఇరాన్ చుట్టూ భారీ నౌకాదళాన్ని మోహరించామని.. అమెరికాలోని అతిపెద్ద సైన్యం ఆ దేశం వైపు కదులుతోందని పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఆ దేశానికి ఎలాంటి నష్టం జరగకూడదని తాను భావిస్తున్నప్ప టికీ ఇంకా ఉద్రిక్తతలు సద్దుమణగట్లేవన్నారు. అక్కడి పరిస్థితులను తాము నిశితంగా పరిశీలి స్తున్నామని, ఇక ముందు ఏం జరుగుతుందో వేచి చూద్దామన్నారు. అధ్యక్ష భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని వందల మంది నిరసనకారులకు విధించిన ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి వల్ల అక్కడి అధికారులు రద్దు చేసిన విషయా న్ని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ విషయంలో తాను కల్పించుకోకపోయి ఉంటే ఇరాన్‌లో 800 మందికి పైగా నిరసనకారులు తమ ప్రాణాలు కోల్పోయేవారని.. వారి ఉరిశిక్షలను తాను ఆపానని తెలిపారు. వారిని ఉరితీస్తే ఇరాన్‌పై తీవ్ర చర్యలు తీసుకుంటానని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవ ర్గం వెనక్కి తగ్గిందన్నారు. కాగా, రాబోయే రోజుల్లో అమెరికాకు చెందిన అతిపెద్ద విమాన వాహక నౌక, ఇతర సైనిక దళాలు పశ్చిమాసియాకు చేరుకోనున్న ట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో గత వారం ఆసియా-పసిఫిక్ ప్రాంతం నుంచి విమాన వాహక నౌక ‘యూఎస్ఎస్ అబ్రహం లింకన్’ సహా పలు యుద్ధనౌకలు ముందుకు కదిలినట్లు పేర్కొన్నా యి. వీటితోపాటు అదనపు వైమానిక రక్షణ వ్యవస్థలను కూడా పశ్చిమాసియాకు పంపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైట్‌హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## టారిఫ్‌ల కంటే కాలుష్యమే భారత్‌కు అతిపెద్ద ముప్పు

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత ఆర్థికవ్యవస్థకు వాణిజ్య సుంకాల కంటే కాలుష్యమే అతిపెద్ద ప్రమాదకారిగా ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) మాజీ ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ హెచ్చరించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్) కార్యక్రమంలో మాట్లాడిన ఆమె.. కాలుష్యం నిశ్శబ్దంగా భారత దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి అత్యంత తీవ్రమైన ప్రమాదాలలో ఒకటిగా మారుతోందన్నారు. దేశంలో కాలుష్యం క్లిష్టమైన సవాలు, భారత ఆర్థికవ్యవస్థపై దాని ప్రభావం ఇప్పటివరకు విధించిన సుంకాల ప్రభావం కంటే చాలా ఎక్కువగా ఉండనుంది. కాలుష్యం చాలా ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. ఇది కార్మికుల ఉత్పాదకతను తగ్గిస్తుంది, ఆరోగ్య సంరక్షణ ఖర్చులను పెంచుతుంది. మొత్తంగా ఆర్థిక కార్యకలాపాలను నెమ్మదినడం ద్వారా వృద్ధిపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని వివరించారు. సాధారణంగా టారిఫ్ ప్రజా, రాజకీయ అంశాల్లో కీలకం అయినప్పటికీ, పర్యావరణ నష్టం శాశ్వత, విస్తృత ఆర్థిక ప్రభావం చూపుతుందనే విషయాన్ని గుర్తించాలని, కాబట్టి కాలుష్యంపై ఎక్కువ శ్రద్ధ అవసరమని ఆమె తెలిపారు. భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై, మౌలిక సదుపాయాలను నిర్మించడంలో పురోగతి సాధిస్తున్నప్పటికీ, కాలుష్యం తీవ్రమైన ఆందోళనగా ఉంది, ముఖ్యంగా పెద్ద నగరాల్లో దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# ప్రైవసీ.. ప్రాధాన్యతలు యువతలో మారుతున్న ధోరణి

ప్రైవసీ ప్రతీ వ్యక్తి గోప్యత వంటివి వ్యక్తుల జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. వ్యక్తిగత జీవితం, అభిప్రాయాలు, కుటుంబ వ్యవహారాలు, అలవాట్లు వంటి విషయాల్లో చాలా మంది సరిహద్దులు పాటించేవారు. కొన్ని విషయాలను బయటకు చెప్పకపోయేవారు. కానీ ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడం, సోషల్ మీడియా హవా పెరగడంతో ప్రైవసీలోనూ సడలింపులు స్టార్ట్ అయ్యాయి. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా తక్కువ మంది అనేక విషయాల్లో గోప్యత అంత ముఖ్యమైందని భావించడం లేదు. అత్యంతక వ్యక్తిగతమైన విషయాల్లో తప్ప అన్నింటిలోనూ గోప్యతను పాటించాలని చాలామంది అనుకోవడం లేదు. ఆధునిక యువతలో ధోరణి క్రమంగా పెరుగుతోంది. ప్రైవసీ ఇప్పుడు పూర్తిగా అంతర్ధానం కాలేదు. కానీ ఆటోమేటిక్‌గా మారిపోయింది. మనం స్మార్ట్‌ఫోన్‌లలో స్క్రోల్ చేస్తూ, స్వైప్ చేస్తూ, స్మార్ట్ డివైస్‌లతో మాట్లాడుతుండగా, టెక్నాలజీ మన గురించి మనకు తెలియకుండానే ఎక్కువ సమాచారాన్ని సేకరిస్తోంది. ప్రస్తుతం ఇది యాక్టివ్‌గా ఉందని నిపుణులు అంటున్నారు. ఇలాంటి ట్రాకింగ్ కొన్ని సార్లు డిస్టోపియన్ నవలలాగా అనిపిస్తుంది. రోజువారీ జీవితంలో మనల్ని ట్రాక్ చేసే 10 నిజమైన మార్గాలు ఉన్నాయి. ఇవి సోషల్ మీడియా, సెర్చ్ ఇంజిన్‌లు, ఈమెయిల్‌లు, యాప్‌లు, కుకీలు, మొబైల్ డివైస్‌లు, వై-ఫై, సర్వైలెన్స్ కెమెరాలు, ఆన్‌లైన్ షాపింగ్, హోమ్ డివైస్‌లు వంటివి.

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల విషయానికి ఫేస్‌బుక్ సహా పలు ఇతర వేదికలు కూడా మన రాజకీయ ఆలోచనలు, వయసు, స్నేహితుల లోకేషన్లు, ఉపయోగిస్తున్న డివైస్‌లు వంటి సమాచారాన్ని ట్రాక్ చేసి, వ్యక్తిగతీకరించిన యాడ్‌లు చూపిస్తాయి. సెర్చ్ రిజల్ట్‌లలో గూగుల్ వంటి ఇంజిన్‌లు మన సెర్చ్ క్వెరీలు, క్లిక్ చేసిన యాడ్‌లు, వీడియోలు, ఇమేజ్‌లు, లింక్‌లను స్టోర్ చేస్తాయి. అయితే అన్నీ ట్రాక్ చేస్తాయని కాదిక్కడ. సోషల్ మీడియా వేదికల్లో ప్రైవసీ ఉంటుందని గుడ్డిగా నమ్మాల్సిన అవసరం లేదనే విషయాన్ని గుర్తించాలి. ఈమెయిల్‌లలో థర్డ్-పార్టీ కంపెనీలు/యాప్‌లు అంతర్లీనంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఎప్పుడు ఏం క్లిక్ చేశాం. ఏం ఓపెన్ చేశాం. ఏ డివైస్ ఉపయోగించాం విషయాలను మన స్థానాన్ని ట్రాక్ చేస్తాయి. యెల్ప్, టిండర్, స్నాప్‌చాట్ వంటివి యాప్‌లు ఇందుకు చక్కటి ఉదాహరణ. ఇవి లొకేషన్ యాక్సెస్ అడిగినప్పుడు ఏం అవుతుందిలే అని అందరూ యాక్సెస్ చేస్తుంటారు. కానీ అవి మనం ఎక్కడున్నామో తెలుసుకుంటాయి. కుకీలు సైట్‌లు మన మునుపటి విజిట్‌లు, ప్రాధాన్యతలు గుర్తుంచుకుని యాడ్‌లు టార్గెట్ చేస్తాయి. అయితే బ్రౌజర్‌లలో వీటిని డిసేబుల్ చేయవచ్చు కూడా.



మొబైల్ డివైస్‌లు సెన్సార్‌ల ద్వారా ఫిజికల్ ఉపయోగాలు, లైట్, టెంపరేచర్ వంటి పర్యావరణ కారకాలు, కాల్ రికార్డులు, జీపీఎస్ ద్వారా లొకేషన్‌ను ట్రాక్ చేయడం వంటివి చేస్తాయి. పబ్లిక్ వై-ఫైలు అన్‌సెక్యూర్డ్‌గా ఉంటే హ్యాకర్లు మన డివైస్‌లను యాక్సెస్ చేసి సోషల్ సెక్యూరిటీ, క్రెడిట్ కార్డ్ వివరాలు తీసుకోవచ్చు. సర్వైలెన్స్ కెమెరాలు ప్రపంచవ్యాప్తంగా 245 మిలియన్లు ఇన్‌స్టాల్ అయి మానిటరింగ్ చేస్తున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ మన షాపింగ్ హ్యాబిట్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని రివీల్ చేసి టార్గెటెడ్ యాడ్‌లను ఆన్‌లైన్

వేదికల్లో ప్రదర్శిస్తుంది. హోమ్ డివైస్‌లు గూగుల్ హోమ్, అలెక్సా వంటివి క్వెరీలు, సంభాషణలను రికార్డ్ చేస్తాయి. వీటిని యాక్సెస్ చేసి డిలీట్ చేయవచ్చు. డిలీట్ చేయకుంటే ప్రైవసీ రిలేటెడ్ ఇష్యూస్ కూడా తలెత్తవచ్చు. మొత్తానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్న ఈ రోజుల్లో ప్రైవసీ గురించి పెద్దగా పట్టింపులు లేకపోవడం, నార్మలైజ్ అనుకోవడం వంటి అభిప్రాయంతో ఉన్నవారికి సమస్య ఏం లేదు. ప్రతీ విషయాన్ని గోప్యతగా భావించేవారికి మాత్రం స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా వేదికలు కూడా భద్రతను కల్పించలేవమో!!

# ఈ కిటికీలుంటే కరెంట్, ఏసీ అక్కర్లేదు



ఇంట్లో, ఆఫీసులో కరెంట్ పోగానే వెలుతురు కోసం కిటికీలు తీస్తుంటాం. మరి బయటినుంచి విపరీతమైన చలిగాలి, భారీ వర్షం, వేసవిలో వేడిగాలులు వీస్తుంటే ఒక్క కిటికీ కూడా ఓపెన్ చేసేందుకు ధైర్యం చేయలేం కదా. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు సైంటిస్టులు సరికొత్త విండో టెక్నాలజీని డెవలప్ చేశారు. కరెంట్ లేకపోయినా ఇళ్లంతా వెలుతురు ఉండేలా, వేసవిలో చల్లగాలికోసం కిటీకి తీయకపోయినా ఇళ్లు కూల్‌గా ఉండేలా దక్షిణ కొరియాకు చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త ట్రాన్స్‌పరెంట్ సోలార్ విండో టెక్నాలజీని మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. ఇళ్లపై నిర్మించే సోలార్ ప్లేట్లు ఇంటికి పవర్‌ను అందిస్తుండగా ఇకపై నేరుగా కిటికీల నుంచి కరెంట్ లైట్ల వలే కాంతి ప్రసరివంచేలా సోలార్ గ్లాసును రూపొందించారు. ఇవి మధ్యాహ్నం సూర్యరశ్మినుంచి పవర్ సేవ్ చేసుకుని రాత్రిపూట వెలుతురును అందించనున్నాయి. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా పవర్ జనరేట్ చేస్తాయని, ఈ కిటికీల రూపంలో 24 గంటలు ఇంట్లో లైట్లు వెలుగుతూనే ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ వినూత్న ప్రయత్నం ద్వార చిన్న ఇళ్లతోపాటు పెద్ద పెద్ద భవనాల్లోనూ కిటికీల నుంచి లైట్లకు ప్రత్యామ్నాయంగా వెలుతురు అందించగలమని 'కొరియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌డటెక్నాలజీ యూనివర్సిటీ'కి చెందిన ప్రొఫెసర్ జున్ యోంగ్-సియోక్ పరిశోధనా బృందం తెలిపింది.కిటికీలకు సెన్సార్ సిస్టమ్..ఈ ట్రాన్సపరెంట్ సోలార్ విండో.. భవనాన్ని కాంతివంతంగా ఉంచడంతో పెద్దగా లైట్స్ ఆన్ చేసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. సాధారణ కిటికీనుంచి వచ్చే హీట్, చలిని ఈ వీండో రాకుండా అడ్డుకుంటుంది. దీంతో ఏసీ, రూమ్ హీటర్ అవసరం తగ్గుతుంది. ఇంటిపై నిర్మించే సోలార్ ప్యానెల్‌కు ప్రత్యామ్నాయంగా ఇళ్ల కిటికీలు, గోడలు, పైకప్పుల వద్ద వీటిని సెట్ చేసుకోవచ్చు. నెదర్లాండ్స్‌కు చెందిన ఫీసీ అనే కంపెనీ ఇప్పటికే యూరప్‌లోని అధికశాతం ఆఫీసు బిల్డింగుల్లో వీటిని ఇన్‌స్టాల్ చేసింది. ఈ కిటికీలకు కేవలం పవర్‌ను జనరేట్ చేసే సామర్థ్యమే కాకుండా సెన్సార్ సిస్టమ్ క్రియేట్ చేయొచ్చని సైటింస్టులు వెల్లడించారు. ఈ సోలార్ గ్లాసులో ప్రత్యేకమైన సెమీకండక్టర్ మెటిరియల్స్ ఉంటాయి. ఇవి సూర్యరశ్మిలోని ఫోటాన్‌లను ఎలక్ట్రాన్‌లుగా మార్చి కరెంట్‌ను ఉత్పత్తి చేస్తాయి. సోలార్ ప్యానెల్స్‌లాగే ఫోటోవోల్టాయిక్ టెక్నాలజీని వినియోగించి పవర్ జనరేట్ చేస్తాయి. ఇళ్లలోకి వచ్చే వేడిని కంట్రోల్ చేయడం వల్ల ఏపీ బిల్లు ఆదా అవుతుంది. ఇవి భవన నిర్మణంలో భాగమే కాబట్టి ప్రత్యేకంగా ప్లేస్ అవసరం లేదు. అలాగే కొరియాలోని ఇంచియాన్ విశ్వవిద్యాలయానికి చెందిన కొరియన్ శాస్త్రవేత్తలు మొబైల్ ఫోన్లలో అనుసంధానించగల సోలార్ ప్లేట్లను కూడా డెవలప్ చేస్తున్నారు. టైటానియం డయాక్సైడ్, నికెల్ ఆక్సైడ్ వంటి పదార్థాలను ఉపయోగించి మొబైల్‌కు చార్జింగ్ అందించేలా సోలార్ ప్లేట్లపై ప్రయోగాలు చేస్తున్నారు.

# జామకాయ వీరికి యమ డేంజర్



జామపండును పేదవాడి యాపిల్ అని అంటారు. తక్కువ ధరలో దొరికే ఈ పండులో ఉండే పోషకాలు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. అయితే అందరికీ ఈ పండు ఆరోగ్యాన్ని ఇవ్వదు. ఈ సూపర్‌ఫ్రూట్ అందరికీ సరిపడదు అన్న విషయం మీకు తెలుసా..? కొందరిలో ఇది జీర్ణ సమస్యలకు, మరికొందరిలో అలెర్జీలకు కారణమవుతుంది. ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన సూపర్‌ఫ్రూట్స్‌లో జామపండు ఒకటి. కేవలం రుచిలో మాత్రమే కాదు పోషకాల విషయంలోనూ ఇది మేటి. జామపండులో విటమిన్ సి, డైటరీ ఫైబర్, పొటాషియం, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఒక జామపండులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మం ముడతలు పడకుండా కాపాడి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. అధికంగా ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారు మితంగా తీసుకుంటే మేలు జరుగుతుంది. అయితే ఆరోగ్యానికి అమృతంలా పనిచేసే జామపండు.. కొంతమందికి మాత్రం ఇబ్బందులను తెచ్చిపెడుతుంది. జామలో ఫ్రక్టోజ్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. శరీరం గ్రహించగలిగే దానికంటే ఎక్కువ విటమిన్ సి తీసుకున్నప్పుడు అది ప్రేగులలో కిణ్వ ప్రక్రియకు దారితీసి గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా నిద్రపోయే ముందు జామపండు తింటే ఈ సమస్య మరింత పెరుగుతుంది. జామపండు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారికి ఇది మంచిదే. కానీ అతిగా తింటే మాత్రం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు రోజుకు 1-2 చిన్న పండ్లకు మాత్రమే పరిమితం అవ్వడం మంచిది. ఎహా వంటి సున్నితమైన జీర్ణశయాంతర సమస్యలు ఉన్నవారికి జామలోని అధిక ఫైబర్ చికాకు కలిగించవచ్చు. దీనివల్ల కడుపు తిమ్మిరి, విరేచనాలు లేదా అధిక అపానవాయువు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి వారు తొక్క తీసి తినడం లేదా వండిన రూపంలో తీసుకోవడం ఉత్తమం. జామ ఆకులలోని కొన్ని బయోయాక్టివ్ సమ్మేళనాలు సున్నితమైన చర్మం ఉన్నవారికి అలెర్జీని కలిగించవచ్చు. దీనివల్ల చర్మం ఎర్రబడటం, దురద లేదా మంట రావచ్చు. చర్మ సమస్యలు ఉన్నవారు జామను వాడే ముందు నిపుణుల సలహా తీసుకోవాలి. జామపండును ఖాళీ కడుపుతో కాకుండా భోజనంతో పాటు లేదా స్నాక్ లాగా చిన్న భాగాల్లో తీసుకోవడం మంచిది. ఏ పండైనా మితంగా తీసుకున్నప్పుడే అది ఔషధంగా పనిచేస్తుంది. మీకు పైన పేర్కొన్న ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, జామను మీ డైట్‌లో చేర్చుకునే ముందు పోషకాహార నిపుణుడిని సంప్రదించండి.

## గోంగూర గొప్పతనం ఇదే మరీ




శీతాకాలంలో ఆకుకూరలను ఎక్కువగా తీసుకుంటారు. అలాంటి ఆకుకూరలలో గోంగూర ఒకటి. గోంగూరను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. గోంగూరను ఆకుకూరల రాజు అని, ఆంధ్రా మాత అని కూడా అంటారు. దీన్ని ఎలా వండుకున్నా, దాని రుచి ఎల్లప్పుడూ అద్భుతంగా ఉంటుంది. గోంగూర తినడం దాని రుచి కోసమే కాదు.. దీనికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీరు వారానికి రెండు లేదా మూడు సార్లు ఎటువంటి సందేహం లేకుండా గోంగూర తినవచ్చు. గోంగూరలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి: గోంగూరలో మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి. ఇందులో విటమిన్లు సి, ఎ, కె, బి1, బి2, బి9, అలాగే కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, భాస్వరం, కెరోటిన్, ఐరన్, రిబోఫ్లేవిన్, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. రోగనిరోధక శక్తిని పెంచడం: గోంగూర తినడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీనిని తీసుకోవడం వల్ల మన రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. కాలానుగుణ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది జలుబు, దగ్గు, ఫ్లూ నివారిస్తుంది. ఇది సహజ ఔషధంగా పనిచేస్తుంది.రక్తహీనత: గోంగూర తినడం వల్ల రక్తహీనతతో బాధపడేవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. గోంగూర తినడం వల్ల రక్త గణనలు మెరుగుపడతాయి. విటమిన్ కె ,ఐరన్ కంటెంట్ కారణంగా, ఇది రక్తహీనతను నియంత్రించడంలో సహాయపడుతుంది. కళ్ళకు మంచిది: గోంగూర తినడం కళ్ళకు కూడా మంచిది. దీన్ని తినడం వల్ల కంటి సమస్యలు తొలగిపోతాయి. ఏ కంటి సమస్య కూడా మిమ్మల్ని ఇబ్బంది పెట్టదు. చక్కెర నియంత్రణలో ఉంటుంది: మధుమేహం ఉన్నవారు కూడా గోంగూర వల్ల ప్రయోజనం పొందవచ్చు. గోంగూర రక్తంలో ఇన్సులిన్ స్థాయిలను పెంచుతుంది, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రణలో ఉంచుతుంది.

## బ్లూ బెర్రీస్ తింటే ఇన్ని లాభాలా?



మార్కెట్‌లో మనకు ఎన్నో రకాల పండ్లు లభిస్తాయి. కానీ, మనం కొన్ని రకాల పండ్లను చాలా తక్కువగా తింటాం.. అలాంటి అరుదైన పండ్లలో బ్లూబెర్రీస్‌ని తరచూ తినటం వల్ల ఆడవాళ్లకు ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ బ్లూబెర్రీస్ ను తింటే ఇమ్యూన్ సిస్టమ్ బూస్ట్ అవుతుంది. ఇందులో విటమిన్ సి సమృద్ధిగా లభించడం వల్ల ఈ బెనిఫిట్ అందుతుంది. పోషకాహార నిపుణుల ప్రకారం బ్లూబెర్రీస్ లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. వీటిలో ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కే, మాంగనీస్ సమృద్ధిగా లభిస్తుంది. వాటర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. కేలరీస్ కూడా తక్కువే. ఒక బౌల్ బ్లూబెర్రీస్ లో దాదాపు 84 కేలరీలుంటాయి. 15 గ్రాముల కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. బెర్రీస్ లో యాంటీ ఆక్సిడెంట్స్ కూడా సమృద్ధిగా లభిస్తాయి.బ్లూబెర్రీస్ లో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇవి క్యాన్సర్ కారకాలు అలాగే డీఎన్ఏను డేమేజ్ చేసే ఫ్రీ రాడికల్స్ నుంచి బాడీను ప్రొటెక్ట్ చేస్తాయి. ఏజింగ్ సైన్స్ ను తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ ప్రాపర్టీస్ వల్ల ఇదంతా సాధ్యమవుతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి బాడీను ప్రొటెక్ట్ చేయడానికి బ్లూబెర్రీస్ హెల్ప్ చేస్తాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.బ్లూ బెర్రీస్ వల్ల లభించే మరొక ఆరోగ్య ప్రయోజనమిది. బ్లూబెర్రీస్ ను డైట్ లో భాగంగా చేసుకుంటే బ్లడ్ ప్రెజర్ తగ్గుతుంది. దాంతో, హార్ట్ డిసీజ్ రిస్క్ కూడా తగ్గుతుంది. బ్యాడ్ కొలెస్ట్రాల్ ను తగ్గించేందుకు హెల్ప్ చేస్తాయి. దాంతో హార్ట్ డిసీజ్ రిస్క్ కూడా తగ్గుతుంది. బ్రెయిన్ ఫంక్షన్ ను ఇంప్రూవ్ చేసేందుకు బ్లూబెర్రీ హెల్ప్ చేస్తుందట. చర్మంపై ముడతలకు కారణమయ్యే అంశాలే బ్రెయిన్ ఫంక్షన్ పై కూడా ప్రభావం చూపుతాయట. అంతేకాదు..ఆడవారిలో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ (యూటీఐ) లను ప్రివెంట్ చేయడానికి మేలు చేస్తాయి. ఇటువంటి ఇన్ఫెక్షన్స్ మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి కాబట్టి బ్లూబెర్రీస్ వల్ల మహిళలకు ఈ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది అనంటున్నారు. టైప్ 2 డయాబెటిస్ రిస్క్ బ్లూబెర్రీస్ వల్ల తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. వారంలో దాదాపు మూడు సార్లు బ్లూబెర్రీస్ తినటం వల్ల టైప్ 2 డయాబెటిస్ రిస్క్ దాదాపు ఏడు శాతం వరకు తగ్గుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. బ్లూబెర్రీస్ లో ఉండే యాంథోసియానిన్స్ అనేవి ఇన్సులిన్ సెన్సిటివిటీపై అలాగే గ్లూకోజ్ మెటబాలిజంపై ప్రభావం చూపుతాయట.

## ఇంట్లో దోమలు, బొద్దింకలు ఉన్నాయా?



చాలా మంది ఇళ్లల్లో బొద్దింకలు, దోమలు, ఇతర కీటకాలు ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. అయితే వీటిని అరికట్టేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఇది తత్కాలికం మాత్రమే ఉంటుంది. కానీ వీటి నివారణకు ఈ చిట్కాలు పాటిస్తే వెంటనే పరార్ అవుతాయని చెబుతున్నారు. శీతాకాలం రావడంతో ఈగలు, దోమలు, బొద్దింకలు, అనేక ఇతర కీటకాలు తరచుగా ఇళ్లలో కనిపిస్తాయి. ఈ జీవులు బయటి చలి కంటే ఇంటి లోపల వెచ్చదనాన్ని ఇష్టపడతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇవి ఇళ్లలోకి ప్రవేశించి వంటగది, బాత్రూమ్, స్టోర్‌రూమ్‌లు, ఇతర గదులలో కూడా నివాసం ఉంటాయి. అవి ఇళ్ల శుభ్రత, సౌకర్యాన్ని భంగపరచడమే కాకుండా తరచుగా అనారోగ్యానికి కారణమవుతాయి. ప్రజలు తరచుగా వాణిజ్యపరంగా లభించే స్ప్రేలు, కాయిల్స్, రసాయన వికర్షకాలను ఉపయోగిస్తారు. కానీ ఈ పద్ధతులు కీటకాలను తొలగిస్తున్నప్పటికీ, అవి చిన్న పిల్లలు, వృద్ధులు, పెంపుడు జంతువులకు కూడా హానికరం. అయితే స్వదేశీ నివారణ ఈ సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. కొన్ని ట్రిక్స్ ఉపయోగించడం వల్ల వీటి నుంచి ఉపశమనం పొందవచ్చని జ్యోతి తివారీ వివరించారు. ఈ నివారణలు చవకైనవి, ఖరీదైన ఉత్పత్తులు అవసరం లేదు. వీటి నివారణకు ఉపయోగించే వస్తువులు కూడా ఇంట్లోనే సులభంగా లభిస్తాయని చెబుతున్నారు. ఈ వంటకం సహజ పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. ఇది రసాయన రహితంగా ఉంటుంది. అలాగే ఆరోగ్యానికి సురక్షితమైనదిగా పరిగణించవచ్చు. ఈ నివారణను ఉపయోగించడానికి మొదట మీరు ఒక చిన్న మట్టి దీపం లేదా తమలపాకు, ఒక డిస్పోజబుల్ కప్పు, కొన్ని బే ఆకులు, వేప లేదా ఆవ నూనె, పిండిచేసిన కర్పూరం మాత్రలు తీసుకోవాలని ఆయన అన్నారు. ముందుగా కర్పూరం పొడిని డిస్పోజబుల్ కప్పులో పోసి, వేప లేదా ఆవ నూనెతో కలిపి మెత్తని పేస్ట్ లా చేయండి. తరువాత ఒక బే ఆకు తీసుకొని, దానిని సగానికి చీల్చి, మట్టి కుండలో ఉంచండి. ఇప్పుడు కర్పూరం, నూనె మిశ్రమాన్ని అదే ఆకుపై పోయాలి. అన్ని పదార్థాలు సిద్ధమైన తర్వాత మిశ్రమంలో చిన్న నిప్పును వెలిగించి మంటలు అంటుకున్న వెంటనే దాన్ని ఆర్పివేయాలని ఆయన వివరించారు. ఈ పొగ తరువాత బలమైన పొగను విడుదల చేస్తుంది. ఈ పొగలో కర్పూరం, బే ఆకులు, నూనె బలమైన వాసన ఉంటుంది. ఇది ఈగలు, దోమలు, బొద్దింకలు, తేనెటీగలు, కందిరీగలు, ఇతర చిన్న కీటకాలకు చాలా వికర్షకం. ఈ కీటకాలు తక్కువ సమయంలోనే ఇంటి నుండి పారిపోతాయి.

# రీప్లేస్ మెంట్ కష్టమే.. అక్షర్ పటేల్ గాయంతో టీమిండియాకు కొత్త సమస్య



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మరి కొన్ని గంటల్లో రెండో టీ20 ప్రారంభం కానుంది. శుక్రవారం (జనవరి 23) రాయ్‌పూర్ వేదికగా షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియం మ్యాచ్ కు ఆతిథ్యమిస్తుంది. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో తొలి టీ20 మ్యాచ్ లో గెలిచిన టీమిండియా ప్రస్తుతం 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఫస్ట్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ మెరుపు బ్యాటింగ్‌తో గ్రాండ్ విక్టరీ అందుకున్న సూర్యకుమార్ సేన అదే జోరును రాయ్‌పూర్‌లోనూ కొనసాగించి సిరీస్‌లో 20తో ముందంజ వేయాలని చూస్తోంది. మరోవైపు ఇండియాకు ఎలాగైనా షాక్ ఇవ్వాలని న్యూజిలాండ్ బరిలోకి దిగుతోంది. రెండో వన్డేకు ముందు భారత జట్టుకు ఊహించని సమస్య వచ్చి చేరింది. టీమిండియా ఆల్ రౌండర్.. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ రెండో టీ20 ఆడడం అనుమానంగా మారింది. తొలి వన్డేలో బౌలింగ్ వేస్తున్నప్పుడు రిటర్న్ క్యాచ్ అందుకునే క్రమంలో అక్షర్ గాయపడ్డాడు. గాయం కావడంతో ఓవర్ మధ్యలోనే గ్రౌండ్ వదిలి వెళ్ళిపోయాడు. దీంతో మిగిలిన ఓవర్ ను అభిషేక్ శర్మ పూర్తి చేశాడు. రెండో టీ20కి అక్షర్ అందుబాటులో లేకపోతే అతని రీప్లేస్ మెంట్ కష్టంగా మారుతుంది. కుల్దీప్ యాదవ్ జట్టులోకి వస్తే బ్యాటింగ్ డెప్త్ తగ్గుతుంది. ఒకవేళ హర్షిత్ రానాకు అవకాశం ఇస్తే జట్టులో వరుణ్ చక్రవర్తి ఒక్కడే స్పిన్నర్ గా ఉంటాడు. దీంతో ఇప్పుడు అక్షర్ ను రీప్లేస్ చేయడం పెద్ద సవాలుగా మారింది.

**చాశ్రీంశీ =ఘ్మ :బౌూ లో గుజరాత్ గెలుపు బాట**

బ్యాటింగ్ డెప్త్ తగ్గినా స్పిన్ అవసరం కావడంతో రెండో టీ20లో కుల్దీప్ కు ఛాన్స్ దక్కొచ్చు. ఈ ఒక్క మార్పుతోనే టీమిండియా బరిలోకి దిగే అవకాశం ఉంది. అభిషేక్ శర్మతో పాటు సంజు శాంసన్ ఇన్నింగ్స్ ను ఆరంభించనున్నారు. బ్యాకప్ వికెట్ కీపర్ ఇషాన్ కిషాన్ మూడో స్థానంలో ఆడతాడు. నాలుగో స్థానంలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ బ్యాటింగ్ కు వస్తాడు. ఐదో స్థానంలో ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య స్థానానికి ఎలాంటి ఢోఖా లేదు. ఆరో స్థానంలో రింకూ సింగ్.. ఏడో స్థానంలో శివమ్ దూబే ఆడతారు. ఎనిమిదో స్థానంలో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఫిట్ గా లేకపోతే కుల్దీప్ జట్టులోకి రానున్నాడు. వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా,అర్షదీప్ సింగ్ స్పెషలిస్ట్ బౌలర్లుగా కొనసాగుతారు.

# 14వ స్థానంలో ఉన్న స్కాట్లాండ్ వరల్డ్ కప్‌కు క్వాలిఫై.. కారణమిదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, శ్రీలంక సంయుక్తంగా అతిథ్యమిస్తోన్న 2026 టీ20 వరల్డ్ కప్ ఆడకూడదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిర్ణయించుకుంది. దీంతో టీ20 వరల్డ్ కప్ టోర్నీలో బంగ్లా ఆడుతుందా.. లేదా..? అని గత కొద్దిరోజులుగా నెలకొన్న సందిగ్ధానికి తెరపడింది. టోర్నీ నుంచి బంగ్లా వైదొలగడంతో ఆ జట్టు స్థానంలో మరో టీమ్‌ను ఐసీసీ భర్తీ చేయనుంది. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ రావడం దాదాపు ఖరారైంది. అయితే స్కాట్లాండ్ వరల్డ్ ర్యాంకింగ్స్ లో 14 వ స్థానంలో ఉంది. అలాంటి జట్టు వరల్డ్ కప్ కప్ కు అర్హత సాధిస్తుందా అనే అనుమానాలు ఉన్నాయి.

**టార్చ్ లైట్లు**

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో స్కాట్లాండ్ ప్రస్తుతం 14వ స్థానంలో ఉంది. రిచీ బెర్రింగ్టన్ కెప్టెన్సీలోని స్కాట్లాండ్ యూరోపియన్ క్వాలిఫయర్స్ ద్వారా టీ20 ప్రపంచ కప్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు, నెదర్లాండ్స్, ఇటలీ, జెర్సీల తర్వాత నాల్గవ స్థానంలో నిలిచారు. ఐసీసీ ర్యాంకింగ్స్ లో స్కాట్లాండ్ కంటే ముందున్న 13 జట్లు వరల్డ్ కప్ కు క్వాలిఫై అయ్యాయి. ఇండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్,న్యూజిలాండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్,జింబాబ్వే, నెదర్లాండ్స్ టాప్ -13 లో ఉన్నాయి. దీంతో ఆ తర్వాత స్థానంలో స్కాట్లాండ్.. బంగ్లాదేశ్ కు రీప్లేస్ గా రానుంది.

**ఇండియాలో నాలుగు లీగ్ మ్యాచ్ లు:**

భారత్, శ్రీలంక ఆతిథ్య దేశాలుగా 2026, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వ తేదీ వరకు టీ20 వరల్డ్ కప్ జరగనుంది. టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం ఇండియాలో బంగ్లాదేశ్ మొత్తం నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మూడు కోల్‌కతాలో ఒకటి ముంబైలో జరగనుంది. ఫిబ్రవరి 7న వెస్టిండీస్, ఫిబ్రవరి 9న ఇటలీ, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్ తో కోల్‌కతాలో మ్యాచ్ లు ఆడనుంది. ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఇప్పుడు బంగ్లాదేశ్ షెడ్యూల్ ను స్కాట్లాండ్ రీప్లేస్ చేయనుంది.

**అసలేం జరిగిందంటే..?**


ఇటీవల బంగ్లాదేశ్, ఇండియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించాయి. దీంతో వరల్డ్ కప్ లో బంగ్లాదేశ్ తాము ఆడబోయే మ్యాచ్ లను ఇండియా బయట తటస్థ వేదికలకు తరలించాలని బ్లంగా క్రికెట్ బోర్డు ఐసీసీని కోరింది. లేదంటే తమ జట్టును గ్రూప్‌సి నుంచి గ్రూప్‌బికి మార్చాలని మరో ప్రతిపాదన తీసుకొచ్చింది. అయితే.. ఇప్పటికే టోర్నీ షెడ్యూల్ ఫిక్స్ కావడంతో బీసీబీ అభ్యర్థనలను ఐసీసీ తిరస్కరించింది. ఇండియాలో ఆడాల్సిందేనని.. లేదంటే టోర్నీ నుంచి తప్పుకోవాలని ఐసీసీ అల్టిమేటం జారీ చేసింది. దీంతో ఇండియాలో ఆడేందుకు ఇష్టపడని బంగ్లాదేశ్ వరల్డ్ కప్ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు గురువారం (జనవరి 22) ప్రకటించింది.

**టీ20 వరల్డ్ కప్ కు అర్హత సాధించిన 20 జట్ల లిస్ట్ ఇదే:**

భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్, యూఎస్‌ఏ, వెస్టిండీస్, స్కాట్లాండ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఐర్లాండ్, కెనడా, ఇటలీ, నెదర్లాండ్స్, జింబాబ్వే, నమీబియా, ఒమన్, నేపాల్, యూఏఈ

# పవర్‌ప్లేలో నా విధ్వంసానికి కారణం అదే.. నా దూకుడైన ఆటకు అతనే స్ఫూర్తి: అభిషేక్ శర్మ

- తన దూకుడుకు రోహిత్ శర్మే స్ఫూర్తి అని చెప్పిన అభిషేక్
- పవర్‌ప్లేలో జట్టుకు మెరుగైన ఆరంభాలు ఇవ్వాలనేదే తన టార్గెట్ అన్న యువ బ్యాటర్
- ప్రత్యర్థి బౌలర్లకు అనుగుణంగా ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేస్తానని వెల్లడి
- టీ20 ప్రపంచకప్ కోసం పక్కా ప్రణాళికతో ఉన్నట్లు స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన దూకుడైన ఆటతీరు వెనుక ఉన్న స్ఫూర్తి ఎవరో చెప్పాడు. భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అడుగుజాడల్లోనే తాను నడుస్తున్నానని, పవర్‌ప్లేలో జట్టుకు మెరుగైన ఆరంభాలు ఇవ్వడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో తన సన్నద్ధతపై అభిషేక్ మాట్లాడాడు."రోహిత్ భాయ్ దేశం కోసం ఎంతో చేశాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో అతను ఇచ్చే ఆరంభాలు అద్భుతం. నేను జట్టులోకి వచ్చినప్పుడు కోచ్, కెప్టెన్ కూడా నా నుంచి అదే ఆశించారు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడటం నా శైలికి సరిగ్గా సరిపోతుంది. అందుకే రోహిత్ అడుగుజాడల్లో నడుస్తూ, జట్టు కోసం రాణించడం సంతోషంగా ఉంది" అని జియోస్టార్‌తో మాట్లాడుతూ అభిషేక్ తెలిపాడు. మొన్న న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో అభిషేక్ 84 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే.ప్రత్యర్థి జట్లలోని బౌలర్లను ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేస్తానని అభిషేక్ వివరించాడు. "సిరీస్‌కు ముందు సమయం దొరికితే, నేను ఎదుర్కోబోయే బౌలర్లను దృష్టిలో ఉంచుకుని సాధన చేస్తాను. ప్రపంచకప్‌లో బౌలర్లు నాకు అంత సులువుగా పరుగులు ఇవ్వరని తెలుసు. అందుకే దానికి తగ్గట్టుగా సిద్ధమవుతున్నాను" అని పేర్కొన్నాడు. బ్యాటింగ్‌లో మెరుగైన ఫలితాల కోసం తన బ్యాక్‌లిఫ్ట్‌లో చిన్న మార్పు చేసుకున్నానని, దీనివల్ల బంతిని ఎదుర్కోవడం మరింత సులభమైందని అభిషేక్ చెప్పాడు.

రోజ్ సర్దానా ఆధునిక గ్లామర్‌ను నిశ్శబ్ద చక్కదనంతో పునర్నిర్వచించింది



# 'పుష్ప 3' కోసం స్పెషల్ ఆఫీస్!

'పుష్ప' ఫ్రాంచైజీ నుంచి 'పుష్ప : ది ర్యాంపేజ్' కోసం ప్రేక్షకుల్లో అప్పుడే ఆసక్తి మొదలైపోయింది. హీరో అల్లు అర్జున్-దర్శకుడు సుకుమార్ వేర్వేరు ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్నా? 'పుష్ప 3' మాత్రం నిరంతరం సోషల్ మీడియాలో చర్చకొస్తూనే ఉంది. ఆ సినిమా ఎప్పుడు మొదలు పెడతారు? ఎప్పుడు రిలీజ్ చేస్తారు? అన్న అంశాలపై రకరకాల గెస్సింగ్స్ తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రాజెక్ట్ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మూడవ భాగంలో పుష్పరాజ్ తన సామ్రాజ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి ఎలా విస్తరించాడు ? ప్రత్యర్థులపై అతని దండయాత్ర ఎలా సాగిందనేది ప్రధానాంశంగా




ఉండబోతోందిట. బన్నీ పాత్ర 'పుష్ప' రెండు భాగాలను మించి రెట్టింపు ఎనర్జీతో సాగుతుందని వినిపిస్తోంది. అప్పుడే ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా మొదలైనట్లు సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే హైదరాబాద్‌లో 'పుష్ప 3' కోసం ప్రత్యేకంగా ఒక ఆఫీస్‌ను ఏర్పాటు చేసారట. సుకుమార్ అండ్ టీమ్ ఆఫీస్ అడ్డాగా పని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి సుకుమార్ రైటింగ్ టీమ్ స్పెషల్ గా వర్క్ చేస్తోందట. సుకుమార్ ఆదేశాల మేరకు లీడ్స్ వదిలిన పాయింట్స్ నుంచి స్టోరీ ని బిల్డ్ చేస్తున్నారట. చిత్తూరు జపాన్ కథని ఎలా తీర్చిదిద్దితే బాగుంటుంది అన్న ఐడియా పై స్టోరీ రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.దీనికి సంబంధించి అవసరం మేర స్పాట్ కు వెళ్లడం..అవసరమైన సమాచారం సేకరించడం వంటివి వెంట వెంటనే జరుగుతున్నాయట. టీమ్ అంతా ఐక్యంగా పని చేయడం కోసమే సుకుమార్ మిగతా సినిమాలతో సంబంధం లేకుండా 'పుష్ప 3' కోసమే ప్రత్యేకంగా ఆఫీస్ తీసినట్లు తెలుస్తోంది. సుకుమార్ పుష్పని ఓ యూనివర్స్ గా మార్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇప్పటికే కోలీవుడ్, టాలీవుడ్ లో యూనిర్స్ ట్రెండ్ కొనసాగుతోంది. అందులో 'పుష్ప' పాన్ ఇండియాలో 2400 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ప్రాజెక్ట్ .కాబట్టి యూనివర్స్ క్రియేట్ చేసినా ఆలోచించాల్సిన పనిలేదు. 'పుష్ప 3' హీరో బన్నీ నే. అందులో ఎలాంటి సందేహం లేదు. 2028లో ఈ ప్రాజెక్ట్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. ఒక వేళ యూనివర్స్ లోకి తీసుకొస్తే గనుక అక్కడ నుంచి హీరోలే మారే అవకాశం ఉంది. ప్రస్తుతం సుకుమార్ రామ్ చరణ్ తో తెరకెక్కించే సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. అటు బన్నీ అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. వీళ్లిద్దరు ఫ్రీ అవ్వడానికి ఎలా లేదన్నా ఏడాదిన్నర సమయం పడుతుంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965